

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శుక్రవారం | 26-4-2024 | పేజీలు: 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 10 |

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: విదియ ఉ. 7.46 తదుపరి తదియ; నక్షత్రం: అనూరాధ తె. 3.40 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: ఉ.6.36-8.17; దుర్ముహూర్తం: ఉ.8.26-9.16, మ.12.38-1.28; అమృతఘడియలు: సా.4.43-6.24; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.55; సూర్యాస్తమయం: 6.30

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 26-4-2024 | పేజీలు: 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 10 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ *

39 Years of Excellence 1986-2024

సరైన శిక్షణ, అద్భుత అకడమిక్ ప్రోగ్రామ్‌లు ఉంటేనే
JEE MAIN లో అద్భుత ఫలితాలు సాధించవచ్చని
శ్రీచైతన్య హైదరాబాద్
(మాదాపూర్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్‌లు)
విద్యార్థులు నిరూపించారు.



JEE MAIN 2024 టాప్ ర్యాంకర్స్‌తో
శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మ శ్రీ గారు

ALL-INDIA ALL CATEGORY BELOW 10 RANKS

Rank	Name	Appl No
1	G N NIRMALKUMAR	240310385062
1	K C BASAVA REDDY	240310618179
2	A SINGH RATHORE	240310112318
3	REDDI ANIL	240310238514
3	THOTAMSETTY NIKILESH	240310813888
5	VASANTA SRIRAJ	240310160867
6	HIMANSHU THALOR	240310580429
6	D SRINIVASA REDDY	240310682440
6	T SRI CHANDRAVADAN	240310166340
7	SALLURI VIVEK	240310251202
9	M V MANIKANTA SAI TEJA	240310867335
9	MAVURU JASWITH	240310542275

ఆలిండియా ఓపెన్ కేటగిరీలో టాప్ 1000లోపు ర్యాంకులు

Rank	Name	APPL.No.
106	SAGARIKA SINHA	240310003797
109	DHRUV GAUD	240310290608
115	PATURI HEMANTH SAI	240311090980
116	SATIVADA JYOTHIRADITYA	240310812058
120	PUTTI KUSHAL KUMAR	240310241276
121	RHYTHM KEDIA	240310512973
122	PALAKSH GOYAL	240310459363
123	DHRUVIN HEMANT DOSHI	240310466751
124	AMAAN KHAN	240310481404
131	MUTHU S	240310329404
135	KESHAV NAVANDAR	240310809123
140	Y SATYA SRI NEELESH	240310541589
150	N SIDDHARTH REDDY	240310623454
153	AKSHAR ZALA	240310718875
157	DASARI UPENDRA	240310655505
165	SHUBHAJEET DAS	240310154855
167	LAKSHAY KUMAR	240310153979
178	SIDDU CHANDRA TEJA	240310833016
189	NEELA PRATHIK KUMAR	240310041626
193	C G CHANDRA SAI RAM	240310236301
194	SOHAM DANGE	240310223082
206	NITHISH B	240310043437
209	P V S D SAI MOHITH	240310038215
213	INAPAKURTI RAJESH	240310836734
214	Y T RAVINDRA SREE	240310809529
243	UJJWAL SINGH	240310429164
260	TUSHAR	240310494913
261	DHANUKONDA SRINIDHI	240310153268
262	SANKE BHARGAV SAI RAJ	240310696571
270	INESH AGGARWAL	240310323403
272	LUKKA AKSHARA	240310437162
280	ERANKI VENKATA JHANANI	240310180237
297	KESHAV SINGHAL	240310309470
308	MAYANK JAIN	240310033270
311	GOLLA LEKHA HARSHAA	240310806676
320	GURRAM HARI CHAITANYA	240310835301
323	PRABANDHAM SRINIKETAN	240310359133
326	RIDDHI	240310129920
333	P NIKHIL CHANDRA	240310640628
335	NAGARJUNAPU NAVYASRI	240310455150
343	V AAKASH AADHITHYA	240310007449
359	RAGALA AKHIL	240310889954
363	K HARI HARA TEJA	240310804760
364	DESABOINA SRI SATHWIK	240310225118
365	KOTHA HARDHIK REDDY	240310154330
366	SATYENDU KAR	240310008918
369	SRUTARSHI TRIPATHI	240310000561
382	D G V N S ARYA CHARAN	240310821243
390	SUJAL SATISH MOTAGI	240310865567
391	ADITYA ADHANA	240310182249
394	KODALI RAMANA GOPAL	240310531999
397	BOOSARAJU SACHIN	240310163864
414	PRABHNOOR	240310667271
415	BIBASWAN BISWAS	240310414582
420	NIKET GARG	240310355912
422	SALLURI VIVEK	240310251202
428	G SIDHARTHA REDDY	240310294369
432	V NITHEESH KUMAR	240310902461
434	KOLLI SURYA SHASHANK	240310651471
436	G V S S R K TEJAS REDDY	240310653574
437	CHETAN SRIRAMA	240310616509
438	A S S D B SIDHVIK SUHAS	240310815144
439	K SAMPATH RAJIV	240310545376
440	A SINGH RANA	240310680377
441	M HARSHA VARDHAN	240310816122
443	SHREYAS BALLATIGI	240310288522
444	LINGAMSETTI RAJASA	240310187797
446	SIDHARTH PILLAI	240310112504
450	P KARTHIKEYA	240310481114
452	K VISHAL REDDY	240310540195
463	VASANTA SRIRAJ	240310160867
464	T ARNAV GORAKSHNATH	240310017668
465	YASHDEEP SINGH	240310062156
466	JULAPELLY HANIKAR RAO	240310289991
473	METTA SATEESH CHANDRA	240310483275
474	K A KARTHIK REDDY	240310300365
475	TANAY CHETAN KAKLIYA	240310427817
478	KASAVAJJALA SAI SHREYAS	240310173477
480	MURARI GANESH SAI	240310831164
485	SRINIVAS REDDY GUNTAKA	240310615188
487	KORUPOLU SAI RAKESH	240310154846
492	MACHA HAREESH	240310457602
499	SIKHAKOLLI GURU SAI TEJA	240310113802
508	BHERI SAHITI	240310153717
512	M V SATYA PAVAN KUMAR	240310367085
513	GURNOOR SOHAL	240310231254
517	ANIMESH SINGH RATHORE	240310112318
539	BETHI PRIYESH REDDY	240310551201
542	ARMAN SINGHAL	240310363633
549	Y RAM CHARAN GOUD	240310496254
552	AYUSH RAI	240310369804
559	S VARSHITH REDDY	240310096405
560	ARYAN GUPTA	240310051537
563	B SRI SAI SIVA ADITYA	240310506690
565	PARTH DHAMIJA	240310239396
567	V VENKATA AKHIL	240310467366
569	CHELLURI CHAKRADHAR	240310181118
572	CHIRAG V GOWDA	240310578926
586	GUNDA GNANESH	240310288956
587	BUDDA TANMAY	240310946408
588	K SAI HANEESH REDDY	240310446816
589	P SRI VAATSAV REDDY	240310199599
592	A SAHASRANSH REDDY	240310197694
594	P N VENKATA NAVADEEP	240310550114
595	ANURAG KISHOR PATIL	240310628042
598	IBTESAM AHMED	240310322819
605	T PRUDHVI REDDY	240310186552
624	N V SASHANK REDDY	240310624570
630	JALAGAM SAI RISHITH	240310677967
633	K SUMANTH REDDY	240310658506

*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback

* DLP | @ Gen-EWS | $ OBC-(NCL) | % SC | # ST | & GEN

IIT-JEE & NEET LONG-TERM 2024
ADMISSIONS OPEN
FOR NEET : 040 660 60606

ADMISSIONS OPEN
Knowledge Hub
NEET | IIT JEE | FOUNDATION
COACHING CENTRES
www.srichaitanyaknowledgehub.com

Scan the QR code for offer on JEE Courses

FOR JEE MAIN & ADVANCED HYDERABAD

MADHAPUR - AKSHARA BHAVAN - 8712600768, 8712600769
MADHAPUR - MEGHANA CO - 8977905063, 8977905064
KONDAPUR - GIRLS - 91770 46533, 91000 91871
DD COLONY - 99486 76603, 91775 49043
NARSINGI - 91777 36808 (BOYS)

KUKATPALLY : 91774 44352 | DILSUKHNAGAR : 91774 44326
AMEERPET: 95151 11054 | HIMAYATNAGAR : 91774 44341
KONDAPUR : 95151 11428 | TRIMULGHERRY : 91774 44837

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru









www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

కాసుల రాజకీయం

లోక్‌సభ ఎన్నికల ఖర్చు 1.2-1.35 లక్షల కోట్లు

అమెరికా అధ్యక్ష ఎన్నికలకు మించి వ్యయం.. ఇది ప్రపంచంలోనే అత్యధికం

2019లో ఒక ఓటుకు పెట్టిన ఖర్చు రూ.700.. ఇప్పుడది రూ.1400 13

పార్టీలు, అభ్యర్థులు, ఈసీ.. అందరి ఖర్చు ఇది

సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ చీఫ్ భాస్కర్‌రావు

శుక్రవారం | 26-4-2024 | పేజీలు: 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 10

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హైదరాబాద్ సిటీ *

రిజర్వేషన్ల రద్దుకు కుట్ర

అందుకే బీజేపీ 400 సీట్లు కావాలంటోంది



గాంధీభవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బీజేపీపై రూపొందించిన చార్జిషీట్‌ను విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు

లోక్‌సభ ఎన్నికలు రిజర్వేషన్లపై రెఫరెండమే!

మోదీ రాకముందు మనదేశ అప్పు 54 లక్షల కోట్లు

పదేళ్లలో ఆయన 113 లక్షల కోట్లు అప్పు చేశారు

డబులింజన్ అంటే.. అదానీ, ప్రధాని: రేవంత్‌రెడ్డి

'నయవంచన.. పదేళ్ల మోసం-వందేళ్ల విధ్వంసం' పేరిట బీజేపీపై చార్జిషీట్ విడుదల

బీజేపీ అంటే బ్రిటిష్ జనతాపార్టీ: సీఎం రేవంత్

కంటోన్మెంట్‌ను గ్రేటర్‌లో కలుపుతామని హామీ

నేడు పెద్దశంకరంపేటలో జనజాతర సభకు సీఎం

హైదరాబాద్/సిటీ, రాజేంద్రనగర్, నారాయణ్‌ఖేడ్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై ఆఖరి యుద్ధం ప్రకటించిన బీజేపీ.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ల రద్దుకు కుట్ర చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. అందుకే ఆ పార్టీ 400 సీట్లు కావాలంటోందని.. పార్లమెంటు ఉభయసభల్లో ప్రతిపక్షాలను అదిరించి, బెదిరించి ఓటు బలంతో రిజర్వేషన్ల రద్దుకు కంకణం కట్టుకుందని మండిపడ్డారు. రిజర్వేషన్లు ఉండాలా? వద్దా? అనే అంశంపై రెఫరెండమే ప్రస్తుత ఎన్నికలని ఆయన పేర్కొన్నారు. బీజేపీకి వేసే ప్రతి ఓటూ రిజర్వేషన్లు తీసేయడానికి ఉపయోగపడుతుందన్నారు. రిజర్వేషన్లు ఉండాలి అనే వాళ్లు కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని కోరారు. గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రేవంత్.. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులతో

మిగతా 12వ పేజీలో...

అమేఠీలో రాహుల్.. రాయ్ బరేలీలో ప్రియాంక! 11

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ!

నాలుగైదు రోజుల్లో ప్రకటించే అవకాశం

ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తాం





సిద్దిపేట సభలో ప్రసంగిస్తున్న అమిత్ షా, పక్కన రఘునందన్‌రావు; హాజరైన జనం

మూడోసారి అధికారంలోకి రాగానే వాటిని తొలగించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఇస్తాం

తెలంగాణలో అవినీతి లేకుండా చేస్తాం

రాష్ట్ర సర్కారు ఢిల్లీ నేతలకు ఏటీఎంగా మారింది

తెలంగాణలో 12 ఎంపీ సీట్లు గెల్చుకుంటాం

సిద్దిపేట సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ప్రపంచం మోదీ నాయకత్వాన్ని ప్రశంసిస్తోంది

ఇండియా కూటమికి విదేశాల నుంచీ ఫండింగ్

నిజామాబాద్ సభలో ఉత్తరాఖండ్ సీఎం ధామి

కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రాగానే తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తాం. ఆ రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల వారికి కల్పిస్తాం. తెలంగాణకు అవినీతి నుంచి విముక్తి కల్పిస్తాం. పదేళ్ల మోదీ పాలనలో దేశంలో క్లిష్టమైన అనేక సమస్యలను పరిష్కరించాం.

- సిద్దిపేట సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా

10

ప్రజల కోసం పోరాడా 10



నిరుద్యోగులు, ఉద్యోగుల కోసం జైలుకెళ్లా

కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులేం చేశారు: బండి

ఎమ్మెల్యేలను కాపాడుకోలేని స్థితిలో కేసీఆర్

6 గ్యారెంటీలతో కాంగ్రెస్ మోసం: కిషన్‌రెడ్డి

కరీంనగర్‌లో నామినేషన్ వేసిన సంజయ్

దేవుడి పేరుతో బీజేపీ ఓట్ల వేట

ఆ పార్టీ అంటే అక్షింతలు, పులిహోర, తీర్థాలు, కాషాయ జెండాలు

వారి పాలన డొల్ల.. దేశం పరువు పోయింది.. సబ్‌కా వికాస్ ఏదీ?

నా బిడ్డను జైల్లో వేసినా బీజేపీకి నేను భయపడలేదు

తెలంగాణ శత్రువే కాంగ్రెస్.. దేవుడి మీద ఒట్టుతో కాలం గడుపుతోంది

తెలంగాణ ప్రజల గుండెల్లో నేను.. నా గుండెల్లో రాష్ట్ర ప్రజలు

దించేసి కొట్లాడమంటే ఎలా? ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించండి

మంచిగున్న రాష్ట్రం ఆగమైతుంటే చూస్తూ ఊర్కోవాలా? పోరాడాలా?

భువనగిరి రోడ్ షోలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



భువనగిరి రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

12

ALPHORES
IIT ACADEMY

MAKES THE FABULOUS VICTORIES WITH THE BEST ALL INDIA RANKS IN VARIOUS CATEGORIES IN IIT-JEE (MAIN) RESULTS - 2024



Congratulations!
On Your Achievement

The Effectual Administrator
Dr. V. NARENDER REDDY garu
Chairman
with the **GLORIOUS ACHIEVERS**
OF **BEST RANKS** in
IIT - JEE (MAIN) - 2024

Rank	Name	Place
252	M. HARSHITH	HANAMKONDA
444	B. ADITYAVARDHAN RAO	KARIMNAGAR
466	R. PUNITH MANOHAR	NALLAKUNTA-HYD
503	G. SRIHAAS	KARIMNAGAR
781	B. BHARADWAJ NAYAK	KOTHAPALLY-KNR
1213	T. CHANDANA	KOTHAPALLY-KNR
1301	S. SATYA AMULYA	KARIMNAGAR
1367	SUBODH CHOWDARY	KARIMNAGAR
1562	K. SRINIDHI	KARIMNAGAR
1603	MD. SHAFIQ	HANAMKONDA
1612	M. MITRA	KOTHAPALLY-KNR
1632	CH. ANUHYA	KARIMNAGAR
1719	A. SHIVA VARUN	KARIMNAGAR
1721	N. PRANAY	HANAMKONDA
1751	P. RAHUL	KOTHAPALLY-KNR
1912	M. PARINITH REDDY	HANAMKONDA
1953	J. UMA MAITHRI	KARMANGHAT-HYD
2353	L. ARUN KUMAR	KOTHAPALLY-KNR
2444	CH. SIDDARTHA	KARIMNAGAR
2510	P. RAGHUVEERA REDDY	KARIMNAGAR
2557	K. VISHAL REDDY	KARIMNAGAR
2643	K. ROHAN PREETH	HANAMKONDA
2908	J. HARSHAVARDHANI	KOTHAPALLY-KNR
2965	G. LAHARI	KARIMNAGAR
3065	M. PAVANI	HANAMKONDA
3178	K. SAKSHITH	KOTHAPALLY-KNR
3401	T. SURYA TEJA	KOTHAPALLY-KNR
3407	G. RITHWIK	KOTHAPALLY-KNR
3504	D. RISHWANTH KUMAR	KOTHAPALLY-KNR
3566	J. NIHAL	HANAMKONDA
3632	N. RAJESH	GHATKESAR-HYD
3860	B. RAVICHANDRA	ALWAL-HYD
4236	K. HRUSHIKESH	KARIMNAGAR
4278	J. SHIVA SHANKARA VARAPRASAD	KARIMNAGAR
4652	N. PRAHARSHA	ALWAL-HYD
4736	J. VENKATESH	GHATKESAR-HYD
4767	G. KOUSHIK SAI	KARIMNAGAR

Congratulations ! SUPREME SCORERS
Thanks to PARENTS & TEAM ALPHORES

Below 5000 : 37 ALPHORESIANS

& Many More...

SHORT TERM
IIT - JEE (ADVANCED) Classes Started.
Aspirants... Hurry Up to avail the BEST@EARLIEST

Spectacular !
461 ALPHORESIANS have gained
ELIGIBILITY for IIT - JEE (ADVANCED)

Now also @

KARIMNAGAR
EXCLUSIVE GIRLS SCHOOL -Vavilalapally
GIRLS RESIDENTIAL - Seetharampur
BOYS RESIDENTIAL - Kothapally
✆ 91335 88857

HUZURABAD
GENIOUS SCHOOL

JANAGAON
DAY SCHOLAR CO-ED
✆ 91604 28444

ARMOOR
DAY SCHOLAR CO-ED @ Yogeshwara Colony, Rajaram Nagar ✆ 96524 44414

NIZAMABAD
EXCLUSIVE GIRLS DAY & RESIDENTIAL@Mubharak Nagagar
EXCLUSIVE BOYS DAY & RESIDENTIAL@GG Road, Dubba
EXCLUSIVE CO-ED. DAY SCHOLARS@Gayatrinagar
✆ 96524 44414

MANCHERIAL
IIT & NEET AC CAMPUS@Hi-Tech City
SMART SCHOOL@Godavari Road
✆ 91602 64443

NIRMAL
EXCLUSIVE GIRLS DAY & RES.@Priyadarshininagar
EXCLUSIVE BOYS DAY SCHOLARS @Doctors Lane
✆ 96524 44414

HANAMKONDA
EXCLUSIVE GIRLS DAY@Pochamma Maidan
EXCLUSIVE BOYS RESIDENTIAL.@Bheemaram
✆ 91604 27444, 91604 26444

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శుక్రవారం | 26-4-2024 | పేజీలు: 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 10 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ *

ఆగి ఉన్న లారీలే మృత్యుశకటాలు



- కోదాడ వద్ద లారీని వెనక నుంచి ఢీకొట్టిన కారు
- చిన్నారి సహా ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి మృతి
- ఓఆర్ఆర్‌పై ఆగి ఉన్న బొగ్గు లారీని ఢీకొట్టిన కారు
- కారు దగ్ధం.. ఒకరి సజీవ దహనం 9
- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురి మృత్యువాత

మీ కొలువులకు కాంగ్రెస్ ఎసరు

- ఇంట్లో ఇద్దరు ఉద్యోగులుంటే.. ఒకరి కొలువును లాగేసుకుంటుంది
- ఆ ఉద్యోగాన్ని ముస్లింలకు ఇస్తుంది
- రాజ్యాంగమంటే కాంగ్రెస్‌కు ద్వేషం
- అంబేడ్కర్‌ను అవమానిస్తోంది
- బరేలీ రోడ్‌షోలో మోదీ విమర్శలు
- కాంగ్రెస్ వస్తే ఇస్లామీకరణ తథ్యం
- యోగి ఆదిత్యనాథ్ హెచ్చరికలు





యూపీలోని బరేలీలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ; భారీగా హాజరైన జనం

బరేలీ/భోపాల్, ఏప్రిల్ 25: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ తన వాగ్యుద్ధాన్ని మరింతగా పెంచారు. సంపద దోపిడీ, వారసత్వ పన్ను, ముస్లిం రిజర్వేషన్ల పేరిట ఎస్సీ, ఎస్టీ, బీసీల రాజ్యాంగ హక్కుల హననానికి కాంగ్రెస్ యత్నిస్తోందంటూ నిన్నమొన్న ఎన్నికల ర్యాలీల్లో విరుచుకుపడ్డ మోదీ.. తాజాగా ఉద్యోగాలపైనా పంజా(హస్తం గుర్తు) విసిరే కుతంత్రాలు జరుగుతున్నాయని ఆరోపించారు. "మీరు బీసీ లేదా ఎస్సీ/ఎస్టీ వర్గానికి చెందినవారై ఉండి.. మీ ఇంట్లో ఇద్దరికి ఉద్యోగాలు ఉంటే.. ఒక కొలువును కాంగ్రెస్ లాక్కొంటుంది. దేశ సంపదపై ప్రథమ హక్కుదారులకు(ముస్లింలు) ఆ ఉద్యోగాన్ని పంచిపెడుతుంది" అని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో జరిగిన రోడ్‌షోలో మోదీ ప్రసంగించారు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కలిసి.. ఓబీసీల

మిగతా 11వ పేజీలో...

ఈ ఎన్నికలు.. రాజ్యాంగాన్ని కాపాడేందుకే 11

- మాకు మద్దతు ఇవ్వండి
- ప్రజలకు రాహుల్ విజ్ఞప్తి

మోదీ, రాహుల్ పేర్లు లేకుండా.. బీజేపీ, కాంగ్రెస్‌కు 11

ఈసీ నోటీసులు

- స్టార్ క్యాంపెయినర్లని పేర్కొన్న కమిషన్
- కాంగ్రెస్‌పై మోదీ వ్యాఖ్యలు
- స్పందించడానికి నిరాకరించిన ఈసీ

17 స్థానాలకు బరిలో 893 మంది!

- ముగిసిన లోక్‌సభ నామినేషన్ల ప్రక్రియ
- మల్కాజిగిరి నుంచి అత్యధికంగా 114
- ఆదిలాబాద్ స్థానానికి అత్యల్పంగా 23
- చివరిరోజున పలుచోట్ల ప్రధాన పార్టీల అభ్యర్థుల మరో సెట్ నామినేషన్
- ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా రఘురాంరెడ్డి
- వరంగల్లో ఇండిపెండెంట్‌గా బాబూమోహన్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. నాలుగో దశ ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 18న విడుదల కాగా.. అదే రోజు ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ గురువారంతో పూర్తయింది. చివరిరోజున 632 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఇప్పటివరకు ఏడు రోజుల్లో 893 మంది అభ్యర్థులు 1,488 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన, ఆ తర్వాత ఈ నెల 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగనుంది. ఇటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉపఎన్నికకు కూడా నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఈ నియోజకవర్గానికి 24 మంది 50 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. దేశంలోనే అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గమైన మల్కాజిగిరి స్థానానికి అత్యధికంగా 114 మంది అభ్యర్థులు 177 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా.. అత్యల్పంగా ఆదిలాబాద్

మిగతా 13వ పేజీలో...

వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ

ఉప ఎన్నిక మే 27న 10

- 2 నుంచి నామినేషన్లు, జూన్ 5న కౌంటింగ్
- కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల



కుబేరుడు విశ్వేశ్వర్‌రెడ్డి

- కుచేలుడు సుధీర్ కుమార్
- అత్యధిక కేసులు ఆత్రం సుగుణపైనే
- రఘువీర్ వద్ద మూడు తుపాకులు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది! అభ్యర్థులు ఎన్నికల అఫిడవిట్లు సమర్పించారు! రాజకీయ కుబేరులు ఎవరో.. కుచేలుడు ఎవరో లెక్క తేలింది! ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ల ప్రకారం.. కుబేరుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అయితే.. కుచేలుడు వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్. అభ్యర్థులందరిలోనూ అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నది మాత్రం ఆదిలాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, గిరిజన హక్కుల కోసం పోరాడిన మహిళ ఆత్రం సుగుణపైనే! అభ్యర్థులంతా ఎంతో కొంత బంగారం ఉందని చూపించినా.. ఆమె వద్ద ఒక్క గ్రాము కూడా లేకపోవడం విశేషం. అలాగే, నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి తన వద్ద 3 లైసెన్స్‌డ్ తుపాకులు ఉన్నట్లు చూపించారు. విచిత్రం ఏమిటంటే.. రాజకీయ కుబేరులు ముగ్గురూ చేవెళ్ల నియోజకవర్గంలోని ప్రధాన పార్టీల అభ్యర్థులే!

కొందరి కుటుంబ ఆస్తుల వివరాలివే..

కొండా విశ్వేశ్వర్ రెడ్డి	రూ.4,568.22 కోట్లు
రంజిత్ రెడ్డి	రూ.300 కోట్లు
కాసాని జ్ఞానేశ్వర్	రూ.213.35 కోట్లు
మాధవీలత	రూ.221.40 కోట్లు
నామ నాగేశ్వర్ రావు	రూ.155.90 కోట్లు
తక్కువ ఆస్తులు వీరికే..	
సుధీర్ కుమార్	రూ.20.31 లక్షలు
భరత్ ప్రసాద్	రూ.33.85 లక్షలు
కడియం కావ్య	రూ.56.62 లక్షలు
బండి సంజయ్	రూ.65.70 లక్షలు

జేఈఈ మెయిన్‌లో తెలుగు విద్యార్థుల సత్తా

- 100 పర్సంటైల్ సాధించిన 56 మందిలో 22 మంది తెలుగు రాష్ట్రాల విద్యార్థులే 3
- 15 మందిది తెలంగాణ, ఏడుగురిది ఏపీ
- 5 విభాగాల్లో 24 మంది టాపర్లూ మనోళ్లే
- జనరల్ క్యాటగిరీలో 40 మందికి 12 మంది
- ఈడబ్ల్యూఎస్‌లో టాపర్లు అందరూ కూడా..
- జేఈఈ మెయిన్ సెషన్ 2 ఫలితాలు విడుదల
- దేశవ్యాప్తంగా 2.5 లక్షల మందికి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత.. మే 26న తుది పరీక్ష

స్పోర్ట్స్

హైదరాబాద్ ● శుక్రవారం 26 ఏప్రిల్ 2024

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: కోల్‌కతా

కోల్‌కతా X పంజాబ్

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
430 (9 మ్యాచ్‌లు)	13 (8 మ్యాచ్‌లు)



ఒక్క పరుగూ ఇవ్వకుండా 7 వికెట్లు

రొహ్మాలియా ప్రపంచ రికార్డు

న్యూఢిల్లీ: ఇండోనేసియా బౌలర్ రొహ్మాలియా.. అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ గణాంకాలు (3.2-3-0-7) నమోదు చేసింది. బాలీ బాష్ మహిళల టీ20 సిరీస్‌లో మంగోలియాతో జరిగిన మ్యాచ్‌లో అరంగేట్రం స్పిన్నర్ రొహ్మాలియా 3.2 ఓవర్లలో ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 7 వికెట్లు పడగొట్టింది. ఈ క్రమంలో నెదర్లాండ్స్ మహిళా క్రికెటర్ ఫ్రెడ్రిక్ ఓవర్డిజ్క్ (4-2-3-7) రికార్డును బద్దలు కొట్టింది. రొహ్మాలియా రికార్డు ఫీట్‌తో ఇండోనేసియా 127 పరుగుల తేడాతో మంగోలియాపై గెలిచింది.



గ్రీన్ (20 బంతుల్లో 37 నాటౌట్, 2/12)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	8	7	1	0	14	0.698
కోల్‌కతా	7	5	2	0	10	1.206
హైదరాబాద్	8	5	3	0	10	0.577
లఖ్‌నవూ	8	5	3	0	10	0.148
చెన్నై	8	4	4	0	8	0.415
ఢిల్లీ	9	4	5	0	8	-0.386
గుజరాత్	9	4	5	0	8	-0.974
ముంబై	8	3	5	0	6	-0.227
పంజాబ్	8	2	6	0	4	-0.292
బెంగళూరు	9	2	7	0	4	-0.721

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

రైజర్స్‌కు ముకుతాడు

సత్తా చాటిన బౌలర్లు ● పటీదార్, కోహ్లీ అర్ధసెంచరీలు

35 రన్స్‌తో బెంగళూరు ఘనవిజయం

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు గెలిచింది. అవును.. సరిగ్గా నెల రోజుల క్రితం తొలి విజయం సాధించిన ఈ జట్టు ఆ తర్వాత వరుసగా ఆరు పరాజయాలతో అభిమానులను నిరాశ పరిచింది. ఇక లీగ్‌లో భారీ స్కోర్లతో విరుచుకుపడుతున్న సన్‌రైజర్స్‌తో మ్యాచ్ అనగానే అందరూ ఆర్‌సీబీపై జాలి చూపిన వారే.. కానీ బలహీనంగా భావిస్తున్న వారి బౌలింగ్ విభాగమే ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లకు ముకుతాడు వేసింది. తద్వారా జట్టు రెండో విజయం అందుకుంది.



కోహ్లీ (51)



రజత్ పటీదార్ (20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 50)

1 ఐపీఎల్ ఓ సీజన్‌లో 100+ సిక్సర్లు బాదడం సన్‌రైజర్స్‌కిదే తొలిసారి. గతం (2022)లో 97 సిక్సర్లు అత్యధికం.

హైదరాబాద్: ఐపీఎల్‌లో పట్టపగ్గాల్లేకుండా దూసుకెళుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరుకు బ్రేక్ పడింది. 277, 287, 266.. ఇలా భారీ స్కోర్లతో బెంబేలెత్తిస్తున్న సన్‌రైజర్స్‌ను వారి సొంత ఇలాకాలోనే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఓడించింది. ఈ సీజన్‌లో ఓవర్‌కు 11 పరుగుల రన్‌రేట్‌తో ప్రత్యర్థి జట్లకు అత్యధిక పరుగులిచ్చుకుంటున్న ఆర్‌సీబీ బౌలర్లు చివరకు సత్తా చాటారు. ఫలితంగా గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో 35 రన్స్‌తో డుప్లెసి సేన ఘనవిజయం సాధించింది. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్లకు 206 పరుగులు చేసింది. రజత్ పటీదార్ (20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 50), కోహ్లీ (43 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 51), గ్రీన్ (20 బంతుల్లో 5 ఫోర్లతో 37 నాటౌట్) రాణించారు. ఉనాద్కట్‌కు 3, నటరాజన్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 171 పరుగులు చేసి ఓడింది. షాబాజ్ (40 నాటౌట్), అభిషేక్ (31), కమిన్స్ (31) మాత్రమే మెరుగ్గా ఆడారు. గ్రీన్, కర్ణ్, స్వప్నిల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా పటీదార్ నిలిచాడు.

ఆరంభం నుంచే తడబాటు: తాజా సీజన్‌లో రైజర్స్ దూకుడు ముందు 207 పరుగుల ఛేదన చిన్నదే అనిపించినా.. ఆర్‌సీబీ బౌలర్లు మాత్రం అదరగొట్టారు. వరుస విరామాల్లో వికెట్లు తీసి ఒత్తిడిలోకి నెట్టారు. ప్రమాదకర హెడ్ (1)కు తొలి ఓవర్‌లోనే జాక్స్ షాకిచ్చాడు. మూడో ఓవర్‌లో అభిషేక్ 4,6,6తో 20 రన్స్ సాధించడంతో ఇక జోరు ఆరంభమైందనిపించింది. కానీ తర్వాతి ఓవర్‌లోనే అతడి వికెట్‌ను యష్ తీయగా.. స్పిన్నర్ స్వప్నిల్ ఐదో ఓవర్‌లో డబుల్ షాకిస్తూ మార్‌క్రమ్ (7), క్లాసెన్ (7) వికెట్లను తీయడంతో ఎస్ఆర్‌హెచ్ 56/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. కాసేపటికే నితీశ్ (13), సమద్ (10) కూడా పెవిలియన్ చేరారు. ఈ దశలో కెప్టెన్ కమిన్స్ ధాటిని ప్రదర్శిస్తూ 11వ ఓవర్‌లో 6,6.. 12వ ఓవర్‌లో 4,6తో ఆశలు రేపాడు. కానీ అతడూ ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. పేసర్ గ్రీన్ తన వరుస ఓవర్లలో కమిన్స్‌తో పాటు భువనేశ్వర్ (13) వికెట్లను తీయడంతో ఇక చేసేదేమీ లేకపోయింది. చివర్లో షాబాజ్ ఒంటరి పోరాటం ఏమాత్రం ఫలితాన్నివ్వలేదు.

పటీదార్, విరాట్ హాఫ్ సెంచరీలు: రైజర్స్ బ్యాటర్ల విధ్వంసాన్ని దృష్టిలో ఉంచుకునో ఏమో.. టాస్ గెలవగానే ఆర్‌సీబీ బ్యాటింగ్ ఎంచుకుంది. వీరి ఇన్నింగ్స్‌లో రజత్ పటీదార్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా.. విరాట్ ఆటలో వేగం లేకపోవడం భారీ స్కోరుపై ప్రభావం పడింది. చివర్లో గ్రీన్ బ్యాట్ ఝుళిపించడంతో వరుసగా మూడో మ్యాచ్‌లో స్కోరు 200 దాటింది. పేసర్ ఉనాద్కట్ తన వందో ఐపీఎల్ మ్యాచ్‌లో విశేషంగా రాణించి కీలక వికెట్లు తీశాడు. ఓపెనర్లు విరాట్, డుప్లెసి తొలి వికెట్‌కు 48 పరుగులు అందించడంతో జట్టుకు శుభారంభమే దక్కింది. రెండో ఓవర్‌లోనే డుప్లెసి మూడు ఫోర్లతో రాణించగా, ఆ తర్వాత విరాట్ రెండు ఫోర్లు, డుప్లెసి సిక్సర్‌తో 19 పరుగులు జత చేరాయి. కానీ నాలుగో ఓవర్‌లోనే డుప్లెసి వికెట్ నటరాజన్ తీయడంతో ఆర్‌సీబీకి తొలి షాక్ తగిలింది. ఆ తర్వాత రెండు ఓవర్లలో పరుగులు తగ్గడంతో పవర్‌ప్లేలో జట్టు 61/1 పరుగులు చేసింది. ఆ వెంటనే విల్ జాక్స్ (6) నిరాశపరిచినా.. కోహ్లీకి జత కలిసిన పటీదార్.. రైజర్స్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కానీ మరో ఎండ్‌లో కోహ్లీ నుంచి ఆ స్థాయి ప్రదర్శన కనిపించలేదు. రజత్ మాత్రం ఓవర్‌కో బౌండరీ ఉండేలా చూడగా, స్పిన్నర్ మార్కండే ఓవర్ (11వ)లో అయితే వరుసగా 4 సిక్సర్లతో 27 పరుగులు రాబట్టాడు. దీంతో స్కోరు వంద దాటింది. అటు 19 బంతుల్లోనే వరుసగా తన రెండో ఫిఫ్టీని కూడా పూర్తి చేశాడు. అయితే పటీదార్ దూకుడుకు ఉనాద్కట్ 13వ ఓవర్‌లో తెర దించాడు. ఫుల్ టాస్ బంతిని ఆడిన పటీదార్ డీప్ స్క్వేర్‌లో సమద్‌కు క్యాచ్ ఇవ్వడంతో మూడో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు 37 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన విరాట్ మధ్య ఓవర్లలో పూర్తిగా నెమ్మదించాడు. ఆరో ఓవర్‌లో సిక్సర్ బాదాక.. 15వ ఓవర్‌లో అతను అవుటయ్యే వరకు కూడా మరో బౌండరీ సాధించలేకపోయాడు. ఉనాద్కట్ అతడి వికెట్ తీయగా.. తన తర్వాతి ఓవర్‌లోనే లొమ్రోర్ (7)ను సైతం పెవిలియన్‌కు చేర్చాడు. గ్రీన్ మాత్రం ధాటిని కనబరుస్తూ 19వ ఓవర్‌లో మూడు ఫోర్లతో 15 రన్స్ అందించాడు. కానీ భీకర ఫామ్‌లో ఉన్న దినేశ్ కార్తీక్ (11) అదే ఓవర్‌లో వెనుదిరిగాడు. చివరి ఓవర్‌లో స్వప్నిల్ (12) 6,4తో 12 పరుగులు వచ్చాయి.

స్కోరుబోర్డు

బెంగళూరు: కోహ్లీ (సి) సమద్ (బి) ఉనాద్కట్ 51, డుప్లెసి (సి) మార్‌క్రమ్ (బి) నటరాజన్ 25, జాక్స్ (బి) మార్కండే 6, పటీదార్ (సి) సమద్ (బి) ఉనాద్కట్ 50, గ్రీన్ (నాటౌట్) 37, లోమ్రోర్ (సి) కమిన్స్ (బి) ఉనాద్కట్ 7, కార్తీక్ (సి) సమద్ (బి) కమిన్స్ 11, స్వప్నిల్ (సి) అభిషేక్ (బి) నటరాజన్ 12, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 206/7; వికెట్ల పతనం:** 1-48, 2-65, 3-130, 4-140, 5-161, 6-193, 7-206; **బౌలింగ్:** అభిషేక్ 1-0-10-0, భువనేశ్వర్ 1-0-14-0, కమిన్స్ 4-0-55-1, నటరాజన్ 4-0-39-2, షాబాజ్ 3-0-14-0, మార్కండే 3-0-42-1, ఉనాద్కట్ 4-0-30-3.

సన్‌రైజర్స్: అభిషేక్ (సి) కార్తీక్ (బి) యశ్ దయాల్ 31, హెడ్ (సి) కర్ణ్ శర్మ (బి) జాక్స్ 1, మార్‌క్రమ్ (ఎల్బీ) స్వప్నిల్ 7, నితీశ్ కుమార్ (బి) కర్ణ్ శర్మ 13, క్లాసెన్ (సి) గ్రీన్ (బి) స్వప్నిల్ 7, షాబాజ్ (నాటౌట్) 40, సమద్ (సి అండ్ బి) కర్ణ్ శర్మ 10, కమిన్స్ (సి) సిరాజ్ (బి) గ్రీన్ 31, భువనేశ్వర్ (సి) సిరాజ్ (బి) గ్రీన్ 13, ఉనాద్కట్ (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 171/8; వికెట్ల పతనం:** 1-3, 2-37, 3-41, 4-56, 5-69, 6-85, 7-124, 8-141; **బౌలింగ్:** జాక్స్ 2-0-23-1, సిరాజ్ 4-0-20-0, యశ్ దయాల్ 3-0-18-1, స్వప్నిల్ 3-0-40-2, కర్ణ్ శర్మ 4-0-29-2, ఫెర్గూసన్ 2-0-28-0, గ్రీన్ 2-0-12-2.

జింబాబ్వే మాజీ క్రికెటర్ గై విట్టల్‌పై చిరుత దాడి





హరారే: జింబాబ్వే మాజీ ఆల్‌రౌండర్ గై విట్టల్ (51)పై చిరుతపులి దాడి చేసింది. దీంతో తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిన అతడి తలకు సర్జరీ చేయగా, ప్రస్తుతం కోలుకుంటున్నాడు. హుమాని అటవీ ప్రాంతంలో విట్టల్ తన కుటుంబ సభ్యులతో కలిసి సఫారీ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. అక్కడే ట్రెక్కింగ్‌కు వెళ్లిన సమయంలో ఈ దాడి జరిగింది. అయితే అతడి పెంపుడు శునకం కూడా విట్టల్‌ను రక్షించే క్రమంలో గాయపడింది. విట్టల్‌ను, అతని శునకాన్ని హెలికాప్టర్‌లో ఆస్పత్రికి తరలించారు. కాగా 2013లో ఓ అడుగు ఎత్తు మాత్రమే ఉన్న తన మంచం కిందికి 8 అడుగుల మొసలి చేరి రాత్రంతా అక్కడే ఉన్నా విట్టల్ బతికిపోయాడు. విట్టల్ 1993-2003 మధ్య 46 టెస్టులు, 147 వన్డేలు ఆడాడు.

పసిడి పోరుకు ధీరజ్ టీమ్

సెమీస్‌లో జ్యోతి సురేఖ

షాంఘై: ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1లో తెలుగు కుర్రాడు ధీరజ్ బొమ్మదేవర నేతృత్వంలోని భారత పురుషుల రికర్వ్ జట్టు ఫైనల్ చేరి పతకాన్ని ఖాయం చేసుకోగా.. కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ, ప్రియాన్ష్ సెమీస్‌కు దూసుకెళ్లారు. గురువారం జరిగిన రికర్వ్ టీమ్ సెమీస్‌లో ధీరజ్, ప్రవీణ్ జాదవ్, తరుణ్‌దీప్ త్రయం 5-1తో ఇటలీపై గెలిచింది. ఆదివారం జరిగే ఫైనల్లో కొరియాతో తలపడనుంది. కాగా, దీపిక, అంకిత, భజన్ కౌర్‌లతో కూడిన మహిళల జట్టు రెండో రౌండ్‌లో 3-5తో మెక్సికో చేతిలో ఓడింది. కాంపౌండ్ వ్యక్తిగత ఈవెంట్ క్వార్టర్స్ పోరులో జ్యోతిసురేఖ 143-142తో అవనీత్ కౌర్‌పై నెగ్గగా.. అదితి గోపీచంద్ 142-144తో బెసెర్రా (మెక్సికో) చేతిలో పరాజయం పాలైంది. పురుషుల క్వార్టర్స్‌లో బటుహాన్ అకావ్‌గ్లూ (టర్కీ)పై ప్రియాన్ష్ టైబ్రేకర్‌లో నెగ్గాడు.

ధోనీ, జొకోలే స్ఫూర్తి!

గుకేష్‌కు ఘన స్వాగతం



చెన్నై: క్యాండి డేట్స్ చెస్ టైటిల్ తో చరిత్ర సృష్టించిన టీనేజ్ గ్రాండ్ మాస్టర్ గుకేష్ దొమ్మరాజుకు స్వదేశంలో ఘన స్వాగతం లభించింది. గురువారం తెల్లవారు జామున 3 గంటలకు చెన్నై ఎయిర్‌పోర్టులో దిగిన గుకేష్‌కు తాను చదువుకున్న వేలమ్మాళ్ స్కూల్ విద్యార్థులు గార్డ్‌ఆఫ్ ఆనర్‌తో స్వాగతం పలికారు. కాగా తన కెరీర్‌ను తీర్చిదిద్దడంలో దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ పాత్ర ఎంతో ఉందని గుకేష్ చెప్పాడు. దిగ్గజాలు ధోనీ, జొకోవిచ్‌ను తానెంతో అభిమానిస్తానని చెప్పాడు. ఎంతో ఒత్తిడిలో అత్యుత్తమ ప్రదర్శన చేసే వారిద్దరూ తనకు స్ఫూర్తి అని అన్నాడు.

బిజినెస్

సైయెంట్ లాభం రూ.173 కోట్లు

సైయెంట్ డీఈటీ (డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ).. మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.1,489 కోట్ల ఆదాయంపై రూ.173 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం స్వల్పంగా 2.8 శాతం పెరగగా లాభం మాత్రం 9.1 శాతం వృద్ధి చెందింది. అంతర్జాతీయంగా సవాళ్లు ఉన్నప్పటికీ నిలకడైన వృద్ధిని నమోదు చేసినట్లు సైయెంట్ పేర్కొంది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.5,911 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.689 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసినట్లు తెలిపింది.

లారస్ ల్యాబ్స్ లాభంలో 26% వృద్ధి

మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.76 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు లారస్ ల్యాబ్స్ ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 26 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా 4 శాతం వృద్ధితో రూ.1,440 కోట్లుగా నమోదైంది. కొవిడ్ సంబంధిత ఉత్పత్తుల కొనుగోలు ఆర్డర్లు తగ్గుముఖం పట్టినప్పటికీ సంస్థకు చెందిన అన్ని వ్యాపార డివిజన్లు నిలకడైన పనితీరును కనబరచటం ఎంతగానో కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ఒక్కో షేరుకు 40 పైసల మధ్యంతర డివిడెండ్‌ను బోర్డు సిఫారసు చేసింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.5,041 కోట్ల ఆదాయంపై రూ.161 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసినట్లు కంపెనీ వెల్లడించింది.

తగ్గిన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లాభం

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్.. గడచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.282.74 కోట్ల ఆదాయంపై రూ.11.67 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.369.23 కోట్లుగా ఉండగా లాభం రూ.27.80 కోట్లుగా ఉంది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.1,126.19 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.73.64 కోట్ల లాభాన్ని నమోదు చేసింది.

రూ.404 లక్షల కోట్లు

సరికొత్త రికార్డు స్థాయికి స్టాక్ మార్కెట్ సంపద

మళ్లీ 74,000 పైకి సెన్సెక్స్... 22,550 ఎగువకి నిఫ్టీ



ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఐదో రోజూ లాభాల్లో పయనించాయి. ఆసియా మార్కెట్ల బలహీన సంకేతాల కారణంగా గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్, నిఫ్టీ మధ్యాహ్నం వరకు స్వల్ప లాభ, నష్టాల మధ్య ఊగిసలాడాయి. ఆ తర్వాత బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, లోహ రంగ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరగడంతో రివ్వున ఎగిశాయి. ఒక దశలో 718 పాయింట్ల వరకు ఎగబాకి 74,500 ఎగువ స్థాయిలో ట్రేడైన సెన్సెక్స్.. చివరికి 486.50 పాయింట్ల లాభంతో 74,339.44 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 167.95 పాయింట్ల వృద్ధితో 22,570.35 వద్ద ముగిసింది. గడిచిన ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,850.45 పాయింట్లు (2.55 శాతం) పుంజుకోగా.. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.11.29 లక్షల కోట్లకు పైగా పెరిగి సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.404.18 లక్షల కోట్లకు(4.87 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

కోటక్ బ్యాంక్ షేరు ఢమాల్: ఆర్‌బీఐ ఆంక్షల ఫలితంగా కోటక్ మహీంద్రా బ్యాంక్ షేరు ధర బీఎస్ఈలో ఒక దశలో 12.10 శాతం పతనమై సరికొత్త ఏడాది కనిష్ఠ స్థాయి రూ.1,620 వద్దకు జారుకుంది. చివరికి 10.85 శాతం నష్టంతో రూ.1,643 వద్ద ముగిసింది. దాంతో బ్యాంక్ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) ఒక్క రోజులోనే రూ.39,768.36 కోట్ల మేర తరిగిపోయి రూ.3.26 లక్షల కోట్లకు పరిమితమైంది. సెన్సెక్స్ నమోదిత కంపెనీల్లో కోటక్ బ్యాంక్ షేరు టాప్ లూజర్‌గా మిగిలింది. అంతేకాదు, మార్కెట్ విలువపరంగా దేశంలోని అతిపెద్ద బ్యాంక్‌ల్లో ఐదో స్థానానికి జారుకుంది. యాక్సిస్ బ్యాంక్ నాలుగో స్థానానికి ఎగబాకింది.

స్విగ్గీ రూ.10,400 కోట్ల ఐపీఓ

ఆన్‌లైన్‌లో ఆహారం, కిరాణా సరుకుల బుకింగ్, డెలివరీ సేవలందించే స్విగ్గీ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు వచ్చేందుకు వాటాదారుల నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఐపీఓ ద్వారా రూ.10,414 కోట్ల వరకు సమీకరించే ప్రతిపాదనకు ఈనెల 23న నిర్వహించిన అసాధారణ సమావేశం (ఈజీఎం)లో ప్రత్యేక తీర్మానం ద్వారా ఈ ప్రతిపాదనకు వాటాదారుల నుంచి ఆమోదం పొందినట్లు తెలిసింది. ఐపీఓలో రూ.3,750 కోట్ల తాజా ఈక్విటీ జారీ చేయడంతోపాటు రూ.6,664 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించాలని కంపెనీ భావిస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 2014లో బెంగళూరు కేంద్రంగా ప్రారంభమైన స్విగ్గీ ప్రస్తుతం 1,270 కోట్ల డాలర్ల (రూ.1.06 లక్షల కోట్లు) స్థాయి మార్కెట్ విలువను కలిగి ఉంది.

నెస్లేతో డాక్టర్ రెడ్డీస్ జేవీ

హైదరాబాద్: బ్రాండెడ్ పోషకాహార ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం నెస్లే ఇండియా-డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఒక జాయింట్ వెంచర్ (జేవీ) కంపెనీని ఏర్పాటు చేస్తున్నాయి. ఈ మేరకు రెండు కంపెనీల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం నెస్లే హెల్త్‌సైన్స్ కంపెనీకి చెందిన ఎంపిక చేసిన కొన్ని బ్రాండెడ్ పోషకాహార ఉత్పత్తులు, డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన ఎంపిక చేసిన కొన్ని బ్రాండెడ్ పోషకాహార ఉత్పత్తులను ఈ భాగస్వామ్య సంస్థ భారత్ సహా మరికొన్ని ఇతర దేశాల్లో మార్కెట్ చేస్తుంది.

రూ.700 కోట్లతో దివీస్ విస్తరణ

హైదరాబాద్ కేంద్రంగా పని చేసే ఫార్మా దిగ్గజం దివీస్ లేబొరేటరీస్ తన ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత విస్తరిస్తోంది. ఇందుకోసం రూ.700 కోట్లతో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేస్తోంది. 2027 జనవరి నాటికి ఈ యూనిట్ ఉత్పత్తి ప్రారంభిస్తుందని కంపెనీ తెలిపింది. ఒక ఖాతాదారుడితో కుదిరిన దీర్ఘకాలిక సరఫరా ఒప్పందం షరతులు నెరవేర్చేందుకు ఈ విస్తరణ చేపడుతున్నట్లు తెలిపింది. అయితే ఆ ఖాతాదారుడి పేరుగానీ, ఏ ఉత్పత్తిని ఎంత కాలం ఆ ఖాతాదారుడికి సరఫరా చేస్తారు? అనే వివరాలను మాత్రం కంపెనీ వెల్లడించలేదు. ఈ విస్తరణ ప్రాజెక్టుకు అవసరమైన రూ.700 కోట్లను అంతర్గత వనరుల ద్వారా సమకూర్చుకుంటామని దివీస్ ల్యాబ్స్ తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,270 ▼	66,250 ▼	86,000 ▼
ముంబై	72,094 ▲	66,038 ▲	80,898 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ



హైదరాబాద్	350
వరంగల్	352
చిత్తూరు	453
విజయవాడ	380
గోదావరి	380
విశాఖపట్నం	400

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	123
వరంగల్	123
కరీంనగర్	123
మహబూబ్‌నగర్	123
కర్నూలు	123
విశాఖపట్నం	121
గోదావరి	129
విజయవాడ	129
గుంటూరు	133
ఒంగోలు	133
చిత్తూరు	125

జేఈఈ మెయిన్‌లో తెలుగు విద్యార్థుల సత్తా

100 పర్సంటైల్ సాధించిన 56 మందిలో 22 మంది తెలుగు రాష్ట్రాల విద్యార్థులే



ఓపెన్ కేటగిరీలో నారాయణ హవా

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఆలిండియా ర్యాంకులు సాధించి సత్తా చాటారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓపెన్ కేటగిరిలో తమ విద్యార్థులు ఆలిండియా 1, 5, 6, 7, 8, 10, 12 ర్యాంకులు సాధించారని వివరించారు. 100లోపు ర్యాంకులను 28 మంది, వెయ్యిలోపు ర్యాంకులను 171 మంది సాధించారని పేర్కొన్నారు. జి.నీల్‌కృష్ణ ఆలిండియా మొదటి ర్యాంకు సాధించారని, హెచ్.విదిత్(5), ఎం.అనూప్(6), ఎం.సాయితేజ(7), సీహెచ్ .సతీశ్‌కుమార్(8), ఆర్యన్ ప్రకాశ్(10), పి.రోహన్ సాయి(12) ర్యాంకులతో మెరిసారని తెలిపారు. జేఈఈ మెయిన్‌లో తమ ర్యాంకుల ప్రస్థానాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 11 లక్షల మంది విద్యార్థులు హాజరైన జేఈఈ మెయిన్ పరీక్షలో నారాయణ విద్యార్థులు అత్యధిక సంఖ్యలో విజయం సాధించారని వివరించారు. అనితర సాధ్యమైన శిక్షణ, రిసెర్చ్ ఓరియంటెడ్ ప్రోగ్రాంలు, పక్కా ప్రణాళిక, స్టడీ మెటీరియల్, వారాంతపు పరీక్షలతోనే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.



జేఈఈ టాపర్లతో శ్రీచైతన్య డైరెక్టర్ సుష్మశ్రీ

శ్రీ చైతన్య విద్యాసంస్థల విజయభేరి

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ ఫలితాల్లో తమ విద్యాసంస్థ సంచలన రికార్డు సృష్టించిందని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ తెలిపారు. జాతీయస్థాయిలో తమ విద్యార్థి కేసీ బసవారెడ్డి మొదటి ర్యాంకు, తోటంశెట్టి నిఖిలేశ్ 3వ ర్యాంకు, హిమాన్షు థలోర్ 6వ ర్యాంకు, రెడ్డి అనిల్ 9వ ర్యాంకు సాధించారని.. టాప్-10లో 4 ర్యాంకులను తమ విద్యార్థులే కైవసం చేసుకున్నారని ఆమె వెల్లడించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 100లోపు 25 ర్యాంకులు, 200లోపు 46 ర్యాంకులు సాధించారని, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో 272 మంది తమ విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారని వివరించారు. అనితర సాధ్యమైన ప్రోగ్రాంలు, మైక్రో షెడ్యూల్స్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ర్యాంకింగ్ సిస్టం, ఇన్ఫినిటీ లెర్న్ ఆన్‌లైన్ యాప్, టాప్ ఫ్యాకల్టీ వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని వివరించారు. 2023లో జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్ పోటీ పరీక్షల్లో ఓపెన్ కేటగిరిలో తమ విద్యాసంస్థ నంబర్-1 ర్యాంకులు సాధించిందని గుర్తుచేశారు. 39 సంవత్సరాల వ్యవధిలో శ్రీ చైతన్య ఆసియాలోనే అతిపెద్ద విద్యాసంస్థగా ఎదిగిందని, వివిధ రాష్ట్రాల్లో 900 శాఖలతో 9 లక్షల మంది విద్యార్థులకు సేవలను అందిస్తోందని సుష్మశ్రీ వెల్లడించారు.

పూర్వ విద్యార్థులకు..
3, 8 ర్యాంకులు: శ్రీ గౌతమ్ విద్యాసంస్థలు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జేఈఈ ఫలితాల్లో తమ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆలిండియా ర్యాంకులు సాధించారని డాక్టర్ కేకేఆర్ గౌతం విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. తోటంశెట్టి నిఖిలేశ్ 3వ ర్యాంకు, అరిపికట్ల తేజస్వీ 8వ ర్యాంకు, పి.విద్యప్రవీణ్ 14వ ర్యాంకు, నతివాడ జ్యోతిరాదిత్య 17వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. 100 లోపు 17 ర్యాంకులను తమ పూర్వ విద్యార్థులు కైవసం చేసుకున్నారన్నారు. విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విద్యాసంస్థ తరఫున అభినందనలు తెలిపారు.

ఎస్సార్ విద్యార్థుల జయకేతనం



జి. నవీన్



ఎ.నందిని



వై.సాత్విక్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్సార్ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. జాతీయ స్థాయిలో జి.నవీన్ 5వ ర్యాంకు, ఎ.నందిని 12, వై.సాత్విక్‌రెడ్డి 42, జి.కాలు 55 వ ర్యాంకు సాధించగా, మరో 12 మంది విద్యార్థులు 100 నుంచి 300 లోపు ర్యాంకులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. 2024 జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థలకు చెందిన 3,256 మంది విద్యార్థులు అర్హత సాధించడం ఎస్సార్ విద్యాసంస్థల పేరు ప్రఖ్యాతులను పెంచిందన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డితో కలిసి వరదారెడ్డి విద్యార్థులను అభినందించారు.

- 15 మందిది తెలంగాణ, ఏడుగురిది ఏపీ
- 5 విభాగాల్లో 24 మంది టాపర్లూ మనోళ్లే..
- జనరల్ కేటగిరీలో 40 మందికి 12 మంది
- ఈడబ్ల్యూఎస్‌లో టాపర్లు అందరూ కూడా..
- జేఈఈ మెయిన్ సెషన్ 2 ఫలితాలు విడుదల
- దేశవ్యాప్తంగా 2.5 లక్షల మందికి జేఈఈ
- అడ్వాన్స్‌డ్‌కు అర్హత.. మే 26న తుది పరీక్ష

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్‌లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు మళ్లీ సత్తా చాటారు. అత్యుత్తమ మార్కులతో జాతీయ స్థాయిలో మెరిశారు. ఈ నెల 4-12 తేదీల్లో నిర్వహించిన సెషన్-2 (పేపర్-1 బీఈ, బీటెక్) పరీక్ష ఫలితాలను జాతీయ పరీక్షా సంస్థ (ఎన్టీఏ) గురువారం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 10.67 లక్షల మంది రాసిన ఈ పరీక్షలో 56 మంది 100 పర్సంటైల్ సాధించగా, వీరిలో 22 మంది తెలుగు రాష్ట్రాల విద్యార్థులే. వీరిలో తెలంగాణ నుంచి 15 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి ఏడుగురు ఉన్నారు. ఇద్దరు విద్యార్థినులు (సాన్వి జైన్- కర్ణాటక), శైనా సిన్హా- ఢిల్లీ) మాత్రమే 100 పర్సంటైల్ సాధించారు. సెషన్-2లో మొత్తం 3,29,600 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరయ్యారు.

ఈడబ్ల్యూఎస్‌లో టాపర్లంతా మనోళ్లే

100 పర్సంటైల్‌తో సత్తా చాటిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు వివిధ కేటగిరీల్లోనూ ఆలిండియా టాపర్లుగా నిలిచారు. దేశవ్యాప్తంగా ఈడబ్ల్యూఎస్ విభాగంలో 1,34,465 లక్షల మంది పరీక్ష రాయగా ఆరుగురు మాత్రమే 100 పర్సంటైల్ సాధించారు. వీరంతా తెలుగు విద్యార్థులే కావడం విశేషం. ఇందులో తెలంగాణ నుంచి నలుగురు, ఏపీ నుంచి ఇద్దరు ఉన్నారు. జనరల్ విభాగంలో మొత్తం 3,77,921 మంది పరీక్ష రాయగా 40 మంది 100 పర్సంటైల్ సాధించారు. వీరిలో తెలంగాణ నుంచి 9, ఏపీ నుంచి ముగ్గురు.. మొత్తం 12 మంది తెలుగు విద్యార్థులు ఉన్నారు. ఓబీసీ నాన్ క్రీమిలేయర్ (ఎన్‌సీబీ) విభాగంలో మొత్తం 10 మంది 100 పర్సంటైల్ సాధించగా వీరిలో తెలంగాణ నుంచి ఇద్దరు, ఏపీ నుంచి ఇద్దరు ఉన్నారు. దివ్యాంగుల విభాగంలో (పీడబ్ల్యూడీ) 3,369 మంది పరీక్షకు హాజరవ్వగా తెలంగాణ విద్యార్థి చుంచికల శ్రీచరణ్ టాపర్‌గా నిలిచాడు. ఎస్టీ విభాగంలో తెలంగాణ విద్యార్థి జగన్నాథం మోహిత్ ప్రథమ స్థానం సాధించాడు.

మే 26న జేఈఈ అడ్వాన్స్‌డ్

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష మే 26న జరగనుంది. దీన్ని ఈసారి ఐఐటీ మద్రాస్ నిర్వహించనుంది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహించనున్నారు. జేఈఈ మెయిన్‌లో కటాఫ్ మార్కులు సాధించిన దాదాపు రెండున్నర లక్షల మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారు. ఈ నెల 27 నుంచి మే 7వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. జూన్ 9న ఫలితాలు ప్రకటిస్తారు.

సెషన్-2లో (పేపర్-1 బీఈ, బీటెక్) పరీక్షకు హాజరైన విద్యార్థులు	
విద్యార్థులు	7,38,351
విద్యార్థినులు	3,29,600
ఇతరులు	8
మొత్తం	10,67,959

సెషన్-1 (జనవరి)లో హాజరైన విద్యార్థులు	- 11,70,048
సెషన్-2 (ఏప్రిల్)లో హాజరైన విద్యార్థులు	- 10,67,959
రెండు సెషన్లలో హాజరైన విద్యార్థులు	- 14,15,110

100 పర్సంటైల్ సాధించిన తెలంగాణ విద్యార్థులు

1. హుందేకర్ విదిత్
2. ముత్తవరపు అనూప్
3. వెంకట సాయితేజ మదినేని
4. రెడ్డి అనిల్
5. రోహన్ సాయిబాబా
6. శ్రీయశస్ మోహన్ కల్లూరి
7. కేశం చెన్నబసవ రెడ్డి
8. మురికినాటి సాయి దివ్యతేజ రెడ్డి
9. రిషి శేఖర్ శుక్లా
10. తవ్వ దినేష్ రెడ్డి
11. గంగా శ్రేయాస్
12. పాలిశెట్టి రితీష్ బాలాజీ
13. తమటం జయదేవ్ రెడ్డి
14. మావూరు జస్విత్
15. దొరిసాల శ్రీనివాస రెడ్డి

100 పర్సంటైల్ సాధించిన ఏపీ విద్యార్థులు

1. చింతు సతీష్ కుమార్
2. షేక్ సూరజ్
3. మాకినేని జిష్ణు సాయి
4. తోటంశెట్టి నిఖిలేష్
5. అన్నరెడ్డి వెంకట తనీష్ రెడ్డి
6. తోట సాయి కార్తీక్
7. మురసాని సాయి యశ్వంత్ రెడ్డి



ర్యాంకర్స్‌తో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

'అల్ఫోర్స్'కు అత్యుత్తమ ర్యాంకులు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎం.హర్షిత్ 252వ ర్యాంకు, ఎ.వర్ధన్‌రావు 444, పి.మనోహర్ 466, జి.శ్రీహాస్ 503, బి.భరద్వాజ్‌నాయక్ 781, పి.చందన 1213, సత్య అమూల్య 1301, సుభోద్ చౌదరి 1367, కె.శ్రీనిధి 1562, ఎండీ షఫిక్ 1603, మిత్ర 1612, సీహెచ్ అనూహ్య 1632, ఎ శివవరుణ్ 1719, ఎస్.ప్రణయ్ 1721, పి.రాహుల్ 1751, ఎం.ప్రణీత్‌రెడ్డి 1912, జె ఉమామైత్ర 1953 ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే, ఎల్.అరుణ్‌కుమార్ 2353, సీహెచ్ సిద్ధార్థ 2444, పి.రాగవీరారెడ్డి 2510, కె విశాల్‌రెడ్డి 2557, కె.రోహన్‌ప్రీత్ 2643, జె.హర్షవర్ధన్ 2908, జి.లహరి 2965వ ర్యాంకు సాధించారని వెల్లడించారు. 1000లోపు ఐదు ర్యాంకులు, 5 వేలలోపు 34 ర్యాకులు సాధించడంతోపాటు 461 మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించి.. అల్ఫోర్స్ ప్రతిష్ఠను ఇనుమడింపజేశారని చెప్పారు.

'భాష్యం' విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ తదితరులు

గుంటూరు(విద్య): జేఈఈ మెయిన్-2024 ఫలితాల్లో భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపారని విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ వెల్లడించారు. భాష్యం విద్యార్థి ఎం.జిష్ణుసాయి ఆలిండియా టాప్ మార్కు 300కి 300 మార్కులు సాధించి 100పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 18వ ర్యాంకును సాధించారన్నారు. ఎం.సాయియశ్వంత్‌రెడ్డి 100 పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 36వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ విభాగంలో ఆలిండియా 4వ ర్యాంకు కైవసం చేసుకున్నారని తెలిపారు. ఇంకా ఆలిండియా స్థాయిలో డి.భరత్‌చంద్ర 20వ ర్యాంకు, కె.జె.వివేక్ 33, జి.జాన్ 49, కె.హర్షిత 50, పి.శ్యామ్ 62, జె.మణిప్రదీప్ 69, కె.చైతన్య 77, ఎ.గణేషదత్తా 78, కె.శ్రేయ 82 ర్యాంకులు సాధించారని చెప్పారు. అలాగే 100 లోపు అత్యుత్తమ ర్యాంకులతో పాటు జాతీయ స్థాయిలో 200 లోపు 25 ర్యాంకులు, 500 లోపు 54 ర్యాంకులు, 1000 లోపు 78 ర్యాంకులు కైవసం చేసుకొని 71.68 శాతం ఫలితాలతో భాష్యం విద్యార్థులు సత్తా చాటారని రామకృష్ణ స్పష్టం చేశారు. ర్యాంకర్లను భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ హనుమంతరావు, భాష్యం ఐఐటి జేఈఈ కోఆర్డినేటర్ ఆనంద్ అభినందించారు.

జేఈఈలో గురుకుల విద్యార్థుల ప్రతిభ

- అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్-2024 ఫలితాల్లో గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల విద్యార్థులు మంచి పర్సంటైల్‌లు సాధించి సత్తా కనబరిచారు. ఎస్సీ గురుకులంలో 20 మంది 95 ఆపై పర్సంటైల్, ఎస్టీ గురుకులంలో 16 మంది 90 ఆపై పర్సంటైల్ సాధించారు. అలాగే బీసీ గురుకులాల్లో 8 మంది అబ్బాయిలు, ఆరుగురు అమ్మాయిలు 90 ఆపై పర్సంటైల్ సాధించారు. గురుకుల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం పట్ల సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. గురుకులాల్లో నాణ్యమైన విద్యను అందించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను మంత్రి పొన్నం, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఆయా గురుకులాల సెక్రటరీలు అభినందించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు..
సైబర్ టెర్రరిజం సెక్షన్ జోడింపు

- నాంపల్లి కోర్టులో మెమో.. నిందితుల బెయిల్‌పై నేడు తీర్పు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు అధికారులు సైబర్ టెర్రరిజానికి సంబంధించిన ఐటీ చట్టంలోని సెక్షన్ 66(ఎఫ్)ను జోడించారు. ఈ మేరకు గురువారం నాంపల్లి కోర్టులో మెమో దాఖలు చేశారు. ప్రభుత్వ విధులు నిర్వర్తించిన ఓ ఉద్యోగి, తాను పనిచేసిన సంస్థలో కీలక సమాచారానికి సంబంధించిన ఫైళ్ల యాక్సెస్‌ను అందజేయడానికి నిరాకరిస్తే.. దాన్ని సైబర్ టెర్రరిజంగా పిలుస్తారు. ఈ కేసులో ప్రణీత్‌రావు చేసిందదేనని దర్యాప్తు అధికారులు గుర్తుచేస్తున్నారు. హార్డ్‌డిస్కులను ధ్వంసం చేయడం, బ్యాకప్ తీసుకున్న డేటాను యాక్సెస్ చేసేందుకు వివరాలు అందజేయకపోవడంతో ఈ సెక్షన్‌ను జోడించినట్లు తెలుస్తోంది. ఈ సెక్షన్ కింద నేరం రుజువైతే.. నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష పడే అవకాశాలున్నాయని న్యాయనిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే ఈ కేసులో ఐటీ చట్టంలోని పలు సెక్షన్లను నమోదు చేశారు. 66(ఎఫ్)ను జోడించడంతో కేసు తీవ్రత పెరిగిందని సైబర్ సెక్యూరిటీ నిపుణులు వివరిస్తున్నారు. కాగా.. ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు శుక్రవారం తీర్పును వెలువరించనుంది.

ఏఈ, టెక్నికల్ అధికారుల పరీక్షా ఫలితాల విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఏఈ, టెక్నికల్ ఉద్యోగ నియామకాల కోసం నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ మేరకు గురువారం అసిస్టెంట్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, జూనియర్ టెక్నికల్ అధికారుల మెరిట్ జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. గతేడాది అక్టోబరు 20, 26 తేదీల్లో ఏఈ, టెక్నికల్ ఉద్యోగ నియామకాల పరీక్షలు జరిగాయి. మెరిట్ ఆధారంగా అభ్యర్థుల జాబితాను(జనరల్ ర్యాంకింగ్ లిస్ట్) వెబ్‌సైట్(www.tspsc.gov.in)లో పెట్టినట్లు కమిషన్ ప్రకటించింది. త్వరలోనే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం అభ్యర్థుల తుది జాబితాను వెల్లడించనున్నట్లు పేర్కొంది. తిరస్కరించిన అభ్యర్థుల పేర్లు జాబితాలో లేవని తెలిపింది.

పేదింటి యువతి కడుపులో కణితులు

- సర్జరీకి 3 లక్షలు అవుతాయంటున్న వైద్యులు
- దాతలు ఆదుకోవాలంటూ కుటుంబం విజ్ఞప్తి



సమీర

బచ్చన్నపేట, ఏప్రిల్ 23: నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువతి కడుపులో కణితుల(కంతి)తో బాధ పడుతోంది. సర్జరీకి రూ.3 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ ఫాజిల్‌కు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కుమార్తె సమీర(17) జనగామలో డిప్లొమా సెకండ్ ఇయర్ చదువుతోంది. ఏడాది క్రితమే సమీర కడుపులో కంతి ఏర్పడటంతో ఫాజిల్ ఇంటిని తనఖా పెట్టి, రూ.3 లక్షలు అప్పు తెచ్చి, వైద్యం చేయించాడు. ఆపరేషన్ చేసిన వైద్యులు ఆమె కడుపులో నుంచి ఆరు కిలోల కణితిని తొలగించారు. ఆ తర్వాత మూడు నెలలకే ఆయన భార్య అజీమా అనారోగ్యంతో చనిపోయింది. కాగా రెండు నెలల క్రితం సమీరకు మరోసారి కడుపులో నొప్పి రావడంతో ఫాజిల్ ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిశీలించిన వైద్యులు ఆమె కడుపులో మరిన్ని కణితులు ఏర్పడ్డాయని, మరోసారి సర్జరీ చేయాలని, రూ.3 లక్షలు ఖర్చవుతాయని తెలిపారు. ఆరోగ్యశ్రీ వర్తించదని చెప్పడంతో గతంలోనే ఇంటిని తనఖా పెట్టి వైద్యం అందించానని, ఆటో నడుపుకునే తాను ఆపరేషన్‌కు మరో మూడు లక్షలు ఎలా తీసుకురావాలని ఫాజిల్ ఆందోళన చెందుతున్నాడు. దాతలు ముందుకు వచ్చి తన కూతురి ఆపరేషన్‌కు సహాయం చేయాలని అభ్యర్థిస్తున్నాడు. సహాయం చేయాలనుకునే వారు 7287082239 నంబరులో తనను సంప్రదించాలని కోరుతున్నాడు.

విమానంలో డీజీపీ రవిగుప్తా దంపతులకు అసౌకర్యం

- సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు జరిమానా

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విమాన ప్రయాణంలో డీజీపీ రవిగుప్తా దంపతులకు అసౌకర్యం కలిగించినందుకు సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు వినియోగదారుల ఫోరం జరిమానా విధించింది. గతేడాది మేలో రవిగుప్తా, ఆయన భార్య అంజనీ గుప్తా హైదరాబాద్ నుంచి సింగపూర్ మీదుగా ఆస్ట్రేలియా వెళ్లేందుకు సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానంలో బిజినెస్(జడ్) కేటగిరీలో రెండు టికెట్లు బుక్ చేసుకున్నారు. 2023 మే 23న వారు ప్రయాణానికి బయలుదేరారు. బిజినెస్(జడ్) కేటగిరీలో వారికి కేటాయించిన సీట్లు ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఆటోమెటిక్‌గా రిక్లైన్ అవ్వాలి. కానీ సాంకేతిక సమస్య కారణంగా అలా జరగలేదు. ఫలితంగా డీజీపీ దంపతులు ఎక్కువ మొత్తం చెల్లించి బిజినెస్ క్లాస్ టికెట్లు తీసుకున్నప్పటికీ సరైన సదుపాయాలు అందలేదు. ప్రయాణంలో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు, వెన్నునొప్పి కారణంగా రాత్రి మొత్తం నిద్ర లేకుండా గడపాల్సి వచ్చింది. బిజినెస్ కేటగిరి టికెట్లు కొనుగోలు చేసినా అందుకు తగ్గ సదుపాయాలు కల్పించకపోవడంపై డీజీపీ దంపతులు హైదరాబాద్‌లోని వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం వినియోగదారుల ఫోరం టికెట్ల ధరతో పాటు 12% అదనంగా చెల్లించాలని, అదేవిధంగా ప్రయాణికులకు ఇబ్బంది కలిగించినందుకు లక్ష రూపాయలు జరిమానాగా చెల్లించాలని సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంస్థను ఆదేశించింది. అలాగే ఫిర్యాదుదారుల ఖర్చుల నిమిత్తం మరో రూ. 10 వేలు చెల్లించాలని ఫోరం సూచించింది.

Website : www.mca.gov.in
Phone : 040-2980 4327 (D), 040-2980 5427
e-Mail: roc.hyderabad@mca.gov.in

MINISTRY OF CORPORATE AFFAIRS
GOVERNMENT OF INDIA

OFFICE OF THE REGISTRAR OF COMPANIES, TELANGANA, HYDERABAD
2ND FLOOR, CORPORATE BHAWAN, BANDLAGUDA, NAGOLE, HYDERABAD – 500 068

File. No.ROC/HYD/TBR/Convex-NCLT/2024 Date: 25.04.2024

NOTICE UNDER SECTION 252(1) OF THE COMPANIES ACT, 2013 – M/s. CONVEX LIMITED

1. Whereas the Company M/s. Convex Limited (hereinafter referred as 'Company') vide CIN No. U72200TG2007PLC052409, incorporated on 19.01.2007 and having its registered office address situated at Flat No. 401, Laxmi Residency, Nagarjuna Nagar Colony, Kushaiguda, Hyderabad – Telangana - 500062, India, was identified as one of the companies for the purposes of Strike off from the records of the Registrar of Companies, Telangana under Section 248 of the Companies Act, 2013, on account of default in filing its Annual Returns and Balance Sheets from the year 2013-14 to 2018-19.

2. Whereas the Office of the Registrar of Companies, Telangana has struck off the Company vide Public Notification No. ROC(H)/248(5)/STK-7/Drive III/1347/2019 dated 29.10.2019. However, it has been observed that an Inquiry Ordered under Section 206(4) of the Companies Act, 2013 against the Company by the Ministry of Corporate Affairs vide its Letter No. F No. 07/20/2019/CL-II(SER) dated 12.02.2019 was on-going and pending.

3. Whereas it is observed from the online portal of the Ministry of Corporate Affairs that the Company viz. M/s. Convex Limited has been 'Struck off'. Accordingly, the Ministry of Corporate Affairs vide its letter No. CL-II-04/62/2023-O/o. DGCoA-MCA dated 05.09.2023 has instructed the ROC, Telangana to file an application for revival of the Company under the Companies Act, 2013 as the Company ought not to have been struck off pending Inquiry Order and further follow-up instructions were issued under Inquiry proceedings.

4. Whereas the Registrar of Companies, Telangana has filed an Application viz. the Company Appeal No. 11/252/HDB/2024 before the Hon'ble National Company Law Tribunal (NCLT), Hyderabad Bench seeking for revival of the Company under the Second Proviso to the Section 252(1) of the Companies Act, 2013, in compliance with the instructions received from the Ministry of Corporate Affairs.

5. Whereas the Hon'ble National Company Law Tribunal (NCLT), Hyderabad Bench vide its Order dated 19.04.2024, has directed the Registrar of Companies, Telangana to issue Notices to the Company and its Directors of the Company through publication and also by registered post with acknowledgement due, so as to seek the explanations / comments / objections on the present application filed by the Registrar of Companies, Telangana pending before the Hon'ble Tribunal.

6. Whereas the Company and its Directors are therefore, hereby called upon to show cause within the next date of hearing dated 09.05.2024 before the Hon'ble Tribunal, as to why the present action under Section 252(1) of the Companies Act, 2013 (under Second Proviso of the said provision) shall not be initiated / implemented against the Company, so that the Company shall be revived as an 'Active' Company from the status of 'Strike Off'.

7. In view of the above facts and circumstances, the Company and its Directors are drawn attention to the pending Company Appeal viz. Company Appeal No. 11/252/HDB/2024 before the Hon'ble National Company Law Tribunal (NCLT), Hyderabad Bench filed by the Registrar of Companies, Telangana and are therefore advised to appear before the Hon'ble Tribunal on the next date of hearing through your authorised representative / advocate, if any, failing which the said Company Appeal shall be heard finally ex-parte.

8. A copy of this notice may please be served upon every officer of the company as required under the provisions of Section 20 of the Companies Act, 2013.

Sd/-
(PARVINDER SINGH, I.C.L.S)
REGISTRAR OF COMPANIES
TELANGANA

Azadi Ka Amrit Mahotsav

To:
1. **M/s. CONVEX LIMITED** (RESPONDENT NO. 1) Flat No. 401, Laxmi Residency, Nagarjuna Nagar Colony, Kushaiguda, Hyderabad – 500062, Telangana.
2. **VENKATESWARA RAO AVASARALA** (RESPONDENT NO. 2) 1-6-43/16, Plot No. 16, Anupuram, ECIL, Hyderabad, 500062, Telangana.
3. **KOTA BHASKAR** (RESPONDENT NO. 3) C-9/2, Sainikpuri, Secunderabad - 500094, Telangana.
4. **KOTA ANANTHA PADMANABHAM** (RESPONDENT NO. 4) C-9/2, Sainikpuri, Secunderabad - 500094, Telangana.
5. **KOTA LAKSHMI** (RESPONDENT NO. 5) E-61, Sainakpuri, Secunderabad - 500094, Telangana.
6. **CHODAGAM BABU SURENDER** (RESPONDENT NO. 6) 9-10-3/125&126, Vijayadurga Nagar colony, RCI Road, Balapur, Saroornagar, Rangareddy - 500005, Telangana.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia ద.మ. రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును
PUB/0375

ప్రొఫార్మా 10-01
బహిరంగ ప్రకటన

దిగువ సెక్షన్లపై నిర్దిష్ట తేదీన లేదా ఆ తరువాత 25000 Volts, 50 Hz, A.C ఓవర్ హెడ్ ట్రాక్షన్ వైర్లు విద్యుదీకరించబడతాయని, దక్షిణ మధ్య రైల్వేలోని గుర్తించబడిన సెక్షన్ల క్రింద పూర్తి సెక్షన్లపైగల రైల్వే లైన్లు మరియు ఆవరణల వినియోగదారులందరికీ ఇందుమూలంగా తెలియజేయడమైనది. అదే తేదీన మరియు ఆ తేదీ నుండి అన్ని వేళల్లో విద్యుత్ వాహకంగా ఓవర్‌హెడ్ ట్రాక్షన్ లైన్ పరిగణించబడుతుంది. అందువలన సదరు ఓవర్‌హెడ్‌లైన్ పరిసరాలలో ఎటువంటి అనధికార వ్యక్తి రాకూడదు లేదా పని చేయరాదు.

సెక్షన్	తేది
సికింద్రాబాద్ డివిజన్ యొక్క కాజీపేట-బల్హార్షలో OHE మాస్ట్ లోకేషన్ NTPC/8001(Km.Ch.04/609.30) నుండి NTPC/ 5040 (Km.Ch.06/377.80) వరకు సికింద్రాబాద్ డివిజన్ యొక్క రామగుండం వద్ద NTPC ఎక్స్ఛేంజ్ యార్డ్ నుండి NTPC సైడింగ్ టేకింగ్ ఆఫ్ యొక్క లైన్ నం.4,5,7,8, సిక్ లైన్ & BV సైడింగ్ లైన్ విద్యుదీకరణ.	04-03-2024

ప్రొఫార్మా 10-02
AC 25 KV ట్రాక్షన్ ప్రారంభం
"రోడ్ వినియోగదారులకు హెచ్చరిక"

దిగువ తెలిపిన సెక్షన్‌పై 25 kV ac ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ప్రారంభానికి సంబంధించి ప్రజలందరి సమాచారం నిమిత్తం తెలియజేయబడింది:
సెక్షన్: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ యొక్క కాజీపేట-బల్హార్ష సెక్షన్‌లో రామగుండం వద్ద NTPC తెలంగాణ యొక్క TTGR సైడింగ్ వద్ద ప్రస్తుత ఎక్స్ఛేంజ్ యార్డ్ మరియు నూతన లైన్ల వద్ద సవరణలు, రామగుండం యార్డ్ నుండి NTPC ఎక్స్ఛేంజ్ యార్డ్ వరకు డబుల్ లైన్ విద్యుద్దీకరణ ప్రమాదకర ప్రాక్సిమిటీ లేదా కాంటాక్ట్ లోనికి వచ్చుట నుండి అదనపు ఎత్తుగల లోడ్స్ నివారించుటకు రోడ్ లెవల్‌కు గరిష్ఠంగా 4.78 మీటర్ల కన్నా ఎక్కువ క్లియర్‌హైట్‌తో లెవల్ క్రాసింగ్స్ అన్నింటి వద్ద హైట్ గేజ్‌లు స్థాపించబడినవి.
ఎటువంటి పరిస్థితులలోను రహదారి వాహనాలలో తీసుకువెళుతున్న లోడ్స్ హైట్ గేజ్స్ అతిక్రమించకుండా గమనించాలని మరియు వాహనాలు లోడింగ్ నిమిత్తం పైన నిర్దేశపరచిన హైట్ గమనించాలని సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది.
అదనపు ఎత్తుగల లోడ్ అపాయాలు దిగువ ఇవ్వబడినవి:
i) రోడ్‌ను అదే విధంగా రైల్వే లైన్‌కు తదుపరిగా ఆటంకం, హైటోత్ అపాయం.
ii) వాహనం తీసుకువెళ్తున్న మెటీరియల్స్ లేదా పరికరాలకు అపాయం.
iii) కండక్టర్స్‌కు అపాయకర ప్రాక్సిమిటీతో తగులుట కారణంగా అగ్ని ప్రమాదము మరియు జీవితం అపాయంలో పడుతుంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/టిఆర్‌డి/సికింద్రాబాద్
A0477

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మరో బీభత్సం...!

రెండువందలరోజులు దాటిన గాజాయుద్ధం మరో బీభత్సకాండదిశగా అడుగులువేస్తున్నది. దక్షిణప్రాంత నగరమైన రాఫా లోపలకు ఇజ్రాయెల్ సైన్యం ఏ క్షణమైనా చొరబడవచ్చు. కొద్ది రోజులుగా రాఫా నగరంమీద జరుగుతున్న వైమానికదాడులు గురువారం మరింత తీవ్రమైనాయని, ఈజిప్టుతో సరిహద్దులు పంచుకుంటున్న ఈ నగరంనుంచి ప్రజలను వెళ్ళగొట్టే ప్రయత్నాలు జోరందుకున్నాయని వార్తలు వస్తున్నాయి. ఒకప్పుడు మూడులక్షలమంది జనాభా ఉండే రాఫానగరం ఇజ్రాయెల్ దమనకాండ ఆరంభమైన తరువాత శరణార్థులుగా తరలివచ్చిన మరో పదిలక్షలమందితో కలిసి క్రిక్కిరిసిపోతున్నది. పదమూడులక్షలమందికి కాస్తోకూస్తో నీడనిస్తున్న ఈ నగరంలోకి ఇజ్రాయెల్ సైన్యం ప్రవేశిస్తే ఆ బీభత్సం ఊహకు అందనిది. రాఫాలో చొచ్చుకుపోయేందుకు సైన్యం సర్వసన్నద్ధంగా ఉన్నదని, అది సమధికోత్సాహంతో ఎదురుచూస్తున్న ఆదేశాలు ఏ క్షణాన్నయినా వెలువడవచ్చునని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ అధికార ప్రతినిధి అంటున్నారు.

రాఫా దాడికి వ్యతిరేకంగా ఈజిప్ట్ ఏవో హెచ్చరికలు చేస్తున్నది కానీ, నెతన్యాహూ వీటిని లక్ష్యపెట్టే అవకాశాలు ఎంతమాత్రం లేవు. ఇప్పటివరకూ ఇజ్రాయెల్ గ్రౌండ్ ఆపరేషన్స్ చేపట్టని కీలకమైన నగరం ఇదే. హమాస్ ఉగ్రవాదులు తలదాచుకున్నారన్న ఆరోపణతో మిగతానగరాలను నాశనం చేయడం, జల్లెడపట్టడం పూర్తిచేసిన ఇజ్రాయెల్‌కు రాఫానగరంమీద చాలా అనుమానాలున్నాయి. నాలుగు హమాస్ బెటాలియన్లకు ఈ నగరం స్థావరమని, వీరికితోడు ఆర్నెల్ల యుద్ధంలో వేర్వేరు ప్రాంతాలనుంచి పారిపోయివచ్చిన వేలాదిమంది హమాస్ ఫైటర్లు ఇక్కడే తలదాచుకుంటున్నారని ఇజ్రాయెల్ వాదిస్తోంది. హమాస్ అపహరించుకుపోయిన ఇజ్రాయెలీలను విడిపించుకోవాలంటే ఈ నగరాన్ని జల్లెడపట్టాల్సిందేనని అంటోంది. హమాస్‌ను నాశనం చేయడం పేరిట ఈ ఆర్నెల్లకాలంలో ఇజ్రాయెల్ ఎంత అమానుషంగా వ్యవహరించిందో తెలుసు. పక్షంరోజుల క్రితం దక్షిణ గాజానుంచి ఇజ్రాయెల్ వ్యూహాత్మక అవసరాల రీత్యా సైన్యాన్ని ఉపసంహరించుకున్న తరువాత, అక్కడ అది పాల్పడిన అరాచకాలు ఇప్పుడు వెలుగుచూస్తున్నాయి. ఇజ్రాయెల్ సైన్యం ప్రజలను చంపివేసి, సామూహికంగా ఖననం చేసిన ప్రాంతాలను పాలస్తీనా అధికారులు గత కొద్దిరోజులుగా తవ్వితీస్తున్నారు. ఖాన్ యూనిస్ ప్రాంతంలోని నాసర్ ఆస్పత్రి ప్రాంగణంలో నాలుగువందల మృతదేహాలు బయటపడ్డాయి. రోగులని కూడా చూడకుండా చిత్రహింసలు పెట్టి వారిని చంపివేశారని, కొందరి చేతులు కాళ్ళు కట్టివేశారని పాలస్తీనా అధికారులు ఆరోపిస్తున్నారు. గాజా సిటీలోని అతిపెద్ద ప్రధాన ఆస్పత్రి అల్ షిఫా ప్రాంగణంలోనూ సజీవంగా ఖననమైన పాలస్తీనియన్ల మృతదేహాలు బయటపడ్డాయి.

ఇవన్నీ అసత్యప్రచారాలని ఇజ్రాయెల్ కొట్టిపారేస్తున్నప్పటికీ, చిన్నపిల్లల మృతదేహాలు కూడా అక్కడ బయటపడటం ఇజ్రాయెల్ అరాచకాలకు పరాకాష్ఠ. రోగులు, వైద్యుల ముసుగులో హమాస్ ఉగ్రవాదులు తిరుగుతున్నారని, ఆసుపత్రుల నేలమాళిగల్లో వారి ఆయుధనిల్వలున్నాయని ఆరోపిస్తూ వాటిని నేలమట్టం చేసిన ఇజ్రాయెల్ రోగుల పట్ల కూడా ఎంత అమానుషంగా వ్యవహరించిందో ఈ ఉదంతాలు చెబుతున్నాయి.

అక్టోబర్ ఏడునుంచి మొదలైన ఈ పాశవిక, ప్రతీకార దాడిలో హమాస్ ఎంతగా దెబ్బతిన్నదో తెలియదు కానీ, ముప్పైఐదువేలమంది పాలస్తీనియన్ల ప్రాణాలు తీసింది ఇజ్రాయెల్. మరో డెబ్బయ్ ఐదువేల మంది క్షతగాత్రులైనారు. 23లక్షలమంది జనాభా గల గాజానుంచి 85శాతంమంది తరలిపోయి అది మరుభూమిగా మిగిలింది. చివరకు శరణార్థులకు అన్నం కూడా దక్కనివ్వకుండా, వారంతా ఆకలితో మరణించేట్టుగా ఇజ్రాయెల్ కుట్రకు పాల్పడింది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని యుఎన్ఆర్‌డబ్ల్యూఏలో కొందరు ఉద్యోగులు ఇజ్రాయెల్ పై హమాస్ జరిపిన దాడికి సహకరించారని ఆరోపించి, అమెరికా సహా పదహారు దేశాలతో సదరు సంస్థకు విరాళాలు దక్కకుండా చేసింది. కానీ, ఆ ఆరోపణలన్నీ అబద్ధాలని ఇటీవల తేలిపోయింది. ఇజ్రాయెల్‌మీద అలిగినట్టుగా, ఆగ్రహించినట్టుగా నటిస్తూనే దానిని ఆయుధాలతో ఆదుకుంటున్న అమెరికా అద్భుతమైన నాటకాన్ని ప్రదర్శిస్తోంది. భద్రతామండలిలో ఇజ్రాయెల్ వ్యతిరేక తీర్మానాలకు అడ్డుతగులుతూ, అది తనకు నచ్చిన రీతిలో ఊచకోతలు కోసేందుకు వీలుకల్పిస్తోంది. ఇజ్రాయెల్ జీనోసైడ్‌కు పాల్పడుతున్నదని అంతర్జాతీయ న్యాయస్థానం అప్పట్లో నేరుగా అనలేదు కానీ, జరుగుతున్నది అదే. రఫాలోకి ఇజ్రాయెల్ సేనలు అడుగుపెట్టినపక్షంలో అక్కడ జరగబోయేది ఊహకు కూడా అందనంత ఘోరంగా ఉంటుంది.

అప్పటి ఆధిక్యం నిలిచేనా?

లోక్‌సభ ఎన్నికల రెండో దశలో భారతీయ జనతా పార్టీ ఒక ప్రత్యేకమైన సమస్య నెదుర్కొంటున్నది. రెండో దశ పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలలో అత్యధిక స్థానాలు బీజేపీ అధీనంలో ఉన్నాయి. నేడు పోలింగ్ జరగనున్న 87 స్థానాలలో బీజేపీ, దాని మిత్రపక్షాలు 2019లో 62 కైవసం చేసుకోగా, కేవలం 24 సీట్లలో మాత్రమే ఇండియా కూటమి విజయం సాధించింది. ఆ ఆధిక్యతతో అధికార కూటమి ప్రస్తుత ఎన్నికలలో కూడా అత్యధిక సీట్లను గెలుచుకోగలదనుకోవడం భ్రమే అవుతుంది. ఇందుకు అనేక కారణాలున్నాయి. 2019 నాటి సంఖ్యాబలం ప్రస్తుత పరిస్థితులను ప్రతిబింబించడం లేదు. 2019 అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రాతిపదికన చూసినప్పుడు అధికార ప్రతిపక్ష కూటముల బలాబలాల్లో చోటుచేసుకున్న మార్పులు తెలియవస్తాయి. 2019 అనంతర అసెంబ్లీ ఎన్నికలలో సాధించిన ఆధిక్యతలతో సర్దుబాటు చేసినప్పుడు ఉభయ కూటముల మధ్య పోటీ ఇంచుమించు సమస్థాయిలో ఉన్నట్టు అర్థమవుతుంది. ఈ ప్రకారం ఎన్‌డీఏ 44 సీట్లలోను, ఇండియా కూటమి 43 సీట్లలోను ముందంజలో ఉన్నట్టు స్పష్టమవుతుంది. బీజేపీకి మరో సమస్య కూడా ఉన్నది. రెండు రాష్ట్రాలలో మినహా బీజేపీ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న సీట్లలో ఆ పార్టీ వివిధ స్థాయిలలో బలహీనంగా ఉన్నది. కాగా ఇండియా కూటమి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలు ఇప్పటికీ ఆ ప్రతిపక్ష కూటమికి కంచుకోటలుగా ఉన్నాయి. బీజేపీ ఎట్టి పరిస్థితులలోను ఆ కోటల్లో పాగా వేయలేదు. చెప్పవచ్చినదేమిటంటే ఈ రెండో దశ ఎన్నికలలోను బీజేపీ నష్టాలను చవి చూడనున్నది. ఎన్‌డీఏ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో పోలింగ్ శాతం, ఇండియా భాగస్వామ్యపక్షాలు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాలలో కంటే తక్కువగా ఉంటే అధికార కూటమికి సంభవించే నష్టాలు గణనీయమైనవిగా ఉంటాయి.



నేడు దేశవ్యాప్తంగా 87 నియోజకవర్గాలలో రెండవ విడత పోలింగ్ జరగనున్నది. ప్రతిపక్ష ఇండియా కూటమి ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాలలో కంటే ఎన్‌డీఏ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో పోలింగ్ శాతం తక్కువగా ఉంటే అధికార కూటమికి సంభవించే నష్టాలు ఎక్కువగా ఉంటాయి.

రెండో దశ ఎన్నికలు జరగనున్న స్థానాలలో ఇండియా కూటమి గతంలో వలే ఇప్పుడూ బలోపేతంగా ఉండడానికి ప్రధాన కారణం కేరళ. ఈ రాష్ట్రంలోని మొత్తం 20 లోక్‌సభ స్థానాలలోనూ నేడు పోలింగ్ జరగనున్నది లోక్‌సభ ఎన్నికలలో ఇంత వరకు ఈ రాష్ట్రంలో బీజేపీ ఒక్కసారి కూడా విజయం సాధించలేకపోయింది. అయితే తన ఓట్ల శాతాన్ని మెరుగుపరచుకుంటూ వస్తోంది. 2019లో ఒక నియోజకవర్గం– తిరువనంతపురంలో బీజేపీ రెండవ స్థానంలో ఉన్నది. స్వల్ప శాతం ఓట్ల తేడాతో ఓడిపోయింది. మరో రెండు నియోజకవర్గాలలో ఓట్ల వాటాలో నాలుగో స్థానంలో ఉన్నది. కేరళలో బీజేపీ తన ప్రప్రథమ విజయాన్ని సాధించగలిగితే ఆ పార్టీ మహదానందభరితమవుతుంది అయితే కేరళలో గెలుచుకునే సీట్లు బీజేపీ మొత్తంగా గెలుచుకునే సీట్ల సంఖ్యను పెద్దగా పెంచలేవు.

ఈ రెండో దశ ఎన్నికలలో బీజేపీ అదృష్ట దురదృష్టాలు కర్ణాటక, రాజస్థాన్, మహారాష్ట్రలో నిర్ణయమవనున్నాయి. గత సార్వత్రిక ఎన్నికలలో మూడు రాష్ట్రాలలో అత్యధిక స్థానాలు గెలుచుకున్న బీజేపీ ఈసారి గట్టి పోటీ నెదుర్కొంటున్నది. కర్ణాటకలో రెండో విడత పోలింగ్ జరగనున్న 14 స్థానాలు రాష్ట్ర దక్షిణ ప్రాంతంలో ఉన్నాయి. పాత మైసూరు, కూర్గ్, కోస్తా ప్రాంతాలలో ఈ నియోజకవర్గాలు ఉన్నాయి. కోస్తా ప్రాంతాలలో బీజేపీకి మొదటి నుంచీ మంచి ఆదరణ ఉన్నది. పాత మైసూరు సంస్థానంలో బీజేపీకి పెద్దగా ఆదరణ లేదు. గత సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ గెలుచుకున్న ఒకే ఒక్క స్థానం మైసూరు ప్రాంతంలోనే ఉన్నది. మిగతా రెండు నియోజకవర్గాలను జనతాదళ్ (సెక్యులర్) గెలుచుకున్నది. గ్రామీణ ప్రాంతాలలో ఒక్కలిగ కులస్తులదే పూర్తి ప్రాబల్యం. యూపీలో ఆర్ఎల్‌డీతో పొత్తు దోహదం చేసిన విధంగా ఒక్కలిగల నాయకత్వంలోని జనతాదళ్ (ఎస్)తో మైత్రి కర్ణాటకలో తన విజయావకాశాలను మెరుగుపరుస్తుందని బీజేపీ విశ్వసిస్తోంది. గతంలోని ఎన్నికల ఫలితాలను పరిశీలించినప్పుడు బీజేపీ–జనతాదళ్(ఎస్) పొత్తు ఉభయతారకమైనదని చెప్పవచ్చు. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రాతిపదికన చూస్తే నేడు పోలింగ్ జరగనున్న 14 స్థానాలలో తొమ్మిదిని గెలుచుకోవలసి ఉంటుంది. అయితే బీజేపీ–దళ్(ఎస్)లకు లభించిన ఓట్లను కలిపి లెక్కిస్తే కాంగ్రెస్‌కు ఈ 14 సీట్లలో కేవలం 3 మాత్రమే లభించే అవకాశమున్నది. ఇందుకు బీజేపీ, జనతాదళ్(ఎస్) పార్టీల మధ్య ఓట్ల బదిలీ పూర్తిగా జరగవలసి ఉంది. అయితే అది జరిగే అవకాశం లేదు. అంతేకాకుండా సిద్ధరామయ్య ప్రభుత్వానికి లభిస్తున్న విశేష ప్రజాదరణ కాంగ్రెస్‌కు లబ్ధి సమకూర్చనున్నది. ఓటర్లు నిజంగా కాంగ్రెస్ వైపు మొగ్గితే బీజేపీ– దళ్(ఎస్) కూటమి 3 నుంచి 5 స్థానాలను కోల్పోయే అవకాశమున్నది.


■ యోగేంద్ర యాదవ్

రాజస్థాన్‌లో కూడా ఇండియా కూటమి మంచి లబ్ధి పొందే అవకాశమున్నది. అయితే మొదటి దశలో మాదిరిగా ఈ రెండో దశలో లబ్ధి పొందే అవకాశం లేదు. రాజస్థాన్‌లో ఈ రెండో దశ ఎన్నికలు మార్వార్, మేవార్ హరోటి ప్రాంతాలలో జరగనున్నాయి. 2019 సార్వత్రిక, 2023 అసెంబ్లీ ఎన్నికలలో ఈ ప్రాంతాలలోనే బీజేపీ ఘన విజయాలు సాధించింది. ఈ మూడు ప్రాంతాలలోని 13 నియోజకవర్గాలలో కేవలం 4 స్థానాలలో మాత్రమే కాంగ్రెస్‌కు విజయావకాశమున్నది. రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీతో పొత్తు పెట్టుకోవడంతో పాటు చివరి క్షణంలో భారత్ ఆదివాసీ పార్టీతో ఒక అవగాహనకు వచ్చినందున మరో మూడు సీట్లను కూడా కాంగ్రెస్ గెలుచుకోవచ్చు. మొత్తం మీద బీజేపీ మరో 3 నుంచి 5 సీట్లను కోల్పోయే అవకాశమున్నది.

మహారాష్ట్రలో ఈ సార్వత్రిక ఎన్నికలు ఐదు విడతలుగా జరగనున్నాయి. సిట్టింగ్ ఎంపీలలో అత్యధికులు, గణనీయమైన సంఖ్యలో ఎమ్మెల్యేలు ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలకు చెందినవారే కావడం గమనార్హం. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే నాయకత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ తమ మాతృ పార్టీ పేరు, చిహ్నాన్ని స్వాయత్తం చేసుకోవడంలో సఫలమయ్యాయి. ఈ రెండు పార్టీల మాతృపార్టీలు ఇప్పుడు శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే), ఎన్‌సీపీ–శరద్‌చంద్ర పవార్ అనే కొత్త పేర్లతో వ్యవహరింపబడుతున్నాయి. మాతృ పార్టీల కార్యకర్తల్లో అత్యధికులు ఈ రెండు పార్టీల పక్షానే ఉన్నారు. అలాగే ఓటర్లు కూడా. గత అసెంబ్లీ ఎన్నికలలో శివసేన, ఎన్‌సీపీలకు లభించిన ఓట్లు సమాన స్థాయిలో చీలిపోతే బీజేపీ, దాని మిత్రపక్షాలు నేడు పోలింగ్ జరగనున్న 8 సీట్లలో మూడింటిని కోల్పోతాయి. వంచిత్ బహుజన్ అఘాది ఈ రెండో విడత ఎన్నికలలో 6 స్థానాలలో పోటీ చేస్తోంది. 2019లో కంటే ఇప్పుడు వీబీఏ బలహీనంగా ఉన్నప్పటికీ పలు స్థానాలలో ఇండియా కూటమికి చెప్పుకోదగిన నష్టాన్ని కలిగించే అవకాశమున్నది. మొత్తం మీద మహారాష్ట్రలో ఈ విడత ఎన్నికలలో ఇండియ కూటమి పరిమిత లబ్ధిని మాత్రమే పొందగలదు.

ఇతర రాష్ట్రాలలో నేడు పోలింగ్ జరగనున్న కొద్ది నియోజకవర్గాలలో కూడా బీజేపీకి స్వల్ప నష్టం జరిగే అవకాశమున్నది. ఛత్తీస్‌గఢ్‌లో నేడు పోలింగ్ జరగనున్న మూడు నియోజకవర్గాలలోను కాంగ్రెస్ గెలిచే అవకాశమున్నది. పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర బెంగాల్ ప్రాంతపు మూడు నియోజక వర్గాలలో బీజేపీ ఒక ప్రధాన పోటీదారుగా ఉన్నది. గత అసెంబ్లీ ఎన్నికలలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఈ మూడు నియోజకవర్గాలలో రెండిటిపై పూర్తి పట్టును సాధించింది. బిహార్‌లో ముస్లిం జనాభా అత్యధికంగా ఉన్న సీమాంచల్, భాగల్పూర్ ప్రాంతాలలో నేడు పోలింగ్ జరగనున్నది. ఈ ప్రాంతాలలోని పూర్ణియా నియోజకవర్గంలో ఇండియా కూటమి అంతర్గత విభేదాలు దానికి ప్రతికూలంగా పరిణమించే అవకాశమున్నది. ఇక కిషన్‌గంజ్ నియోజకవర్గంలో ఏఐఎమ్‌ఐఎమ్ నుంచి ఇండియాకు గట్టి సవాల్ ఎదురవుతున్నది. పశ్చిమ యూపీలో నేడు పోలింగ్ జరగనున్న ఎనిమిది నియోజకవర్గాలలో ఎస్పీ–కాంగ్రెస్ కంటే బీజేపీ–ఆర్ఎల్‌డీకే స్పష్టమైన ఆధిక్యత ఉన్నది. అయితే రెండు అంశాలు బీజేపీకి ప్రతికూలంగా పరిణమించవచ్చు. పశ్చిమ యూపీకి ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలనే డిమాండ్‌ను మాయావతి మళ్లీ తలకెత్తుకున్నారు (ఆర్ఎల్‌డి ఒకప్పుడు ఇదే డిమాండ్ చేస్తుండేది). మరో అంశం బీజేపీ పట్ల రాజ్‌పుట్‌ల అసంతృప్తి. అభ్యర్థుల ఎంపికలో తమ వర్గం వారికి సముచిత ప్రాధాన్యమివ్వనందుకు బీజేపీ పట్ల రాజ్‌పుట్‌లు అసంతృప్తితో ఉన్నారు.

18వ సార్వత్రిక ఎన్నికల రెండో దశ పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలు అన్నిటిలోను 2019లో 70 శాతం పోలింగ్ జరిగింది. మిగతా దశలలో కంటే రెండో దశలోనే అత్యధిక పోలింగ్ జరిగింది. మరి ఈసారి ఈ దశలో పోలింగ్ శాతం, ముఖ్యంగా హిందీ రాష్ట్రాలలో తగ్గిపోనున్నదా? ఈ సంభావ్య విషయం బీజేపీని అమితంగా కలవరపరుస్తోంది. ఎందుకంటే మొదటి దశలో పోలింగ్ శాతం తగ్గిపోయింది. (మొదటి దశ ఎన్నికలు జరిగిన నియోజక వర్గాలలో ఎన్‌డీఏ బలంగా ఉండడంతో పాటు 2019లో వాటిలో సగానికి పైగా సీట్లను గెలుచుకున్నది.) 2019లో ఎన్‌డీఏ గెలుచుకున్న నియోజక వర్గాలలో ఈసారి మొదటి దశ పోలింగ్ 5.1 శాతం తగ్గిపోగా గతంలో ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు గెలుచుకున్న సీట్లలో ఇప్పుడు పోలింగ్ శాతం 2.4 శాతం మాత్రమే తగ్గింది. పోలింగ్ శాతం మొదటిదశలో వలే రెండో దశలో కూడా తగ్గిపోయిన పక్షంలో తరువాయి దశల్లో బీజేపీకి సవాళ్లు ముమ్మరమవుతాయి.

(వ్యాసకర్త కన్వీనర్, భారత్ జోడో అభియాన్)

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

వ్యర్థ జలాలు – జలభద్రత

నీరు నీరు వంకకే పారుతుంది... ఇది మన ఇంగిత జ్ఞానం. నీరు నీటికే చేరాలిగాని వ్యర్థమై పోకూడదు అనేది నేడు మనం నేర్చుకోవాల్సిన ఒక ఆవశ్యక పాఠం.

స్వచ్ఛమైన నీరు మనకు అందుబాటులో లేకపోతే మన ఆరోగ్యం దెబ్బ తింటుంది, జీవితం దుర్భరమవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దశాబ్దాలుగా గ్రామీణ ప్రజలకు పరిశుభ్రమైన మంచినీటిని సమకూర్చేందుకు శతథా ప్రయత్నిస్తున్నాయి. వాస్తవంలో జరుగుతున్నదేమిటి? నీటి సరఫరా సదుపాయాలు గ్రామాలకు సమకూరుతున్నా గ్రామస్తులకు నీరు అందుబాటులో లేని గ్రామాలు పెద్ద సంఖ్యలో ఉంటున్నాయి. ఎందుకిలా జరుగుతోంది? నీటి సరఫరా అనేది కేవలం పైప్‌లైన్‌ల నిర్మాణ వ్యవహారం మాత్రమే కాదు, సరఫరా వ్యవస్థకు మూలమైన జలవనరు నిరంతరాయంగా నీటిని సమకూర్చేదిగా ఉండేలా మనం జాగ్రత్తపడాల్సిన అవసరమున్నది. నీటి సరఫరా సదుపాయాలు ఉండవచ్చు. అయితే సరఫరాకు మూలమైన జలవనరు ఎండిపోయినా, కలుషితమయినా నీటి పంపిణీ యంత్రాంగం నిరుపయోగమైపోతుంది.


■ సునీతా నారాయణ్

మట్టివాసన

నీటి సరఫరా వ్యవస్థ నిరంతరం పని చేసేలా చూడడం, ముఖ్యంగా సరఫరాకు ప్రధాన ఆధారమైన జలవనరు శాశ్వతంగా ఉండేలా చేయడమనేది చాలా అవసరం. ఇందుకు చేపడుతున్న చర్యలు లోపభూయిష్టంగా ఉంటున్నాయి. భారత ప్రభుత్వ జల్ జీవన్ మిషన్ (జెజెఎమ్) ఈ మౌలిక లోపాన్ని గుర్తించి, దాన్ని తొలగించేందుకు ప్రాధాన్యమిచ్చింది. పైపులు, ట్యాప్‌ల ద్వారా నీరు నిరంతరం ప్రవహించేలా చేయడమే జెజెఎమ్ లక్ష్యంగా ఉన్నది. ప్రతి గృహంలోనూ ట్యాప్ నేర్పాటు చేయడమే కాకుండా, ఆ ట్యాప్ అవిశ్రాంతంగా పని చేస్తుండడం అంటే నీటి సరఫరాను అన్ని వేళలా కొనసాగిస్తుండడమే జెజెఎమ్ అతి ముఖ్య లక్ష్యంగా ఉన్నది.

ఈ లక్ష్యం నెరవేరాలంటే జల వనరుల మన్నికను మెరుగుపరచడంపై దృష్టిని కేంద్రీకరించవలసి ఉన్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే కుంట, చెరువు, సరస్సు ఎట్టి పరిస్థితులలోను అక్రమ ఆక్రమణలకు గురికాకుండా జాగ్రత్తపడాలి. వాటర్ షెడ్ (సరస్సు, నది మొదలైన కేంద్ర స్థానాలకు నీరంతా ప్రవహించే భూభాగం) సురక్షితంగా ఉండాలి. నీటి వనరు నది, సరస్సు లేదా చెరువు ఏదైనప్పటికీ అది సదా పునశ్శక్తిమంతమవుతూ ఉండాలి. భూమిపై విసర్జించిన మల మూత్రాలు లేదా టాయ్‌లెట్లు, ట్యాప్‌లు ఉన్న గృహాలలో వినియోగించి వదిలివేసిన నీటి మూలంగా జలవనరులు కలుషితం కాకుండా ఉండాలి.

గృహావసరాలకు సరఫరా చేస్తున్న నీటిలో 80 శాతాన్ని వ్యర్థ జలంగా వదిలివేస్తున్నాం. ఇది విస్మరించలేని వాస్తవం. గ్రామీణ గృహాలలో కనిష్ఠ పరిమాణంలో నీటిని వినియోగించే టాయ్‌లెట్ల నిర్మాణానికే ప్రభుత్వాలు అమలుపరుస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రాధాన్యమిస్తున్నాయి. వ్యర్థ జలంలో చాలా భాగం గ్రే వాటర్ (స్నానాలకు, బట్టలు ఉతకడానికి లేదా వంట పాత్రలు కడగడం మొదలైన పనులకు ఉపయోగించగా వెలువడిన నీరు). ఈ నీటిని వీధుల్లోకి వదిలివేయడం కద్దు. ఆ వ్యర్థ జలాలతో వీధుల్లో మడుగులు ఏర్పడుతాయి. అవి రోగ కారక క్రిములకు నెలవులై అంటువ్యాధులు ప్రబలడానికి కారణమవుతున్నాయి. అంతేకాకుండా ఆ నీటి మడుగులు, భూగర్భ జలాలు, ఉపరితల జలాలు కలుషితమయ్యేందుకు కూడా కారణమవుతున్నాయి. ఈ వ్యర్థ జలాలను సాగు ప్రయోజనాలకు ఉపయోగించడం లేదా భూగర్భ జలాలను పునశ్శక్తిమంతం (రీఛార్జ్) చేసేందుకు వినియోగించడమనేది చాలా ముఖ్యం. అప్పుడే నీటి సరఫరా నిరంతరాయంగా జరుగుతుంది. ఇది నీరు నీటికి చేరడమే. ఆ నీరు వ్యర్థమైపోదు.



నీటి సరఫరాను పారిశుద్ధ్య, వ్యర్థ జల ఉత్పాదన వ్యవస్థతో అనుసంధానం చేయాలి. గృహావసరాలకు సరఫరా చేస్తున్న నీటిలో 80 శాతాన్ని వ్యర్థ జలంగా వదిలివేస్తున్నాం. ఈ వ్యర్థ జలాలను సాగు ప్రయోజనాలకు ఉపయోగించడం లేదా భూగర్భ జలాలను పునశ్శక్తిమంతం చేసేందుకు వినియోగించడమనేది చాలా ముఖ్యం. అప్పుడే నీటి సరఫరా నిరంతరాయంగా జరుగుతుంది.

నీటి సరఫరాను పారిశుద్ధ్య, వ్యర్థ జల ఉత్పాదన వ్యవస్థతో అనుసంధానం చేయవలసి ఉన్నది. మనం నీటిని కలుషితం చేస్తున్నామంటే దానిని వృథా చేస్తున్నామన్న వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి. నిజమేమిటంటే వ్యర్థ జలాలను సురక్షితంగా వదిలివేయడం జరగనంత వరకు టాయిలెట్ నిర్మాణ కార్యక్రమం పరిపూర్ణం కాదు. టాయిలెట్ గుంటలలోని మల పంకాన్ని అదే విసర్జన స్థలంలోనే శుద్ధి చేయాలి లేదా మలాన్ని సేకరించి శుద్ధికేంద్రాలకు తీసుకువెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు ఉండాలి. అలా శుద్ధి చేసిన మలాన్ని నీరు లేదా నేల కలుషితం కాకుండా ఎరువుగా ఉపయోగించుకోవచ్చు. శుద్ధి చేసిన తరువాత దానిని నేలపై పునః ఉపయోగించాలి.

మనం తిన్న తరువాత విసర్జించే ఆహారమే మల పదార్థం. పోషకాలు సమృద్ధిగా ఉండే నత్రజని, భాస్వరాన్ని మన ఆహార వనరులు నేల నుంచి తీసుకుంటాయి. ఆహారాన్ని తిని విసర్జించిన తరువాత ఆ మలపదార్థాన్ని మళ్లీ భూమిలో కలిసిపోయేలా చూడాలి. అయితే శుద్ధి చేసిన తరువాత మాత్రమే అలా చేయాలి. వ్యర్థ పదార్థాల పునర్వినియోగమనేది మన ఆరోగ్యానికి హానికరం కాకూడదు.

మరో ముఖ్యమైన వాస్తవమేమిటంటే ప్రజాసమూహాలు భాగస్వాములు కానంతవరకు నీటి సరఫరా పథకాలు సక్రమంగా పని చేయనివిగా మిగిలిపోతాయి. నిజానికి పూర్తిగా నిష్ప్రయోజనమవుతాయి. సమస్యమిటంటే నీటి వనరుల నిర్వహణ, భూముల వ్యవహారాల సంబంధిత అధికార వ్యవస్థలు వేర్వేరుగా ఉండడమే. నీటి వనరుల నిర్వహణ బాధ్యత, నీటిపారుదల వ్యవస్థపై నియంత్రణ వేర్వేరు ప్రభుత్వ విభాగాల పరిధిలో ఉంటాయి. ఆరగాణి ప్రాంతం మరో విభాగం పరిధిలో ఉంటుంది. జల భద్రత సమకూరాలంటే ఈ పరిస్థితి మారాలి. జలవనరులపై స్థానిక ప్రజా సముదాయాలకు యాజమాన్య హక్కులు కల్పించాలి. అధికారాల వికేంద్రీకరణే నీటి వనరుల నిర్వహణకు సరైన మార్గం. స్వచ్ఛమైన నీరు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చేలా అధికారాల వికేంద్రీకరణ తప్పనిసరిగా జరగాలి.

వాతావరణ మార్పు ప్రభావాలు తీవ్రమవుతున్న ప్రస్తుత తరుణంలో నేటి సమాజాలకు ఈ వికేంద్రీకరణ చాలా ముఖ్యం. సమీప కాలంలోనే ప్రాకృతిక వైపరీత్యాలను మనం మరింత తీవ్ర స్థాయిలో చూడనున్నాం. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని జలవనరుల నిర్వహణలో పెట్టుబడులను మరింతగా పెంచాల్సిన అవసరమున్నది. జల ప్రళయం లాంటి కుంభవృష్టిని సైతం తట్టుకుని సురక్షితంగా ఉండగలగాలి. ఈ విషయంలో మన కృషిని మరింత వేగవంతం చేయవలసిన అవసరమున్నది. లేని పక్షంలో వాతావరణ మార్పు ప్రభావంతో తరచు అతివృష్టి లేదా సుదీర్ఘ అనావృష్టిని చవిచూడవలసి వస్తుంది. వాననీటిని మరింత భద్రంగా పట్టుకుని కాపాడుకోవల్సి ఉన్నది. ఎక్కడ పడిందో అక్కడే పట్టుకోవాలి. అక్కడే నిల్వ చేసి ఆ ప్రాంత భూగర్భ జలాలను పునశ్శక్తిమంతం చేయాలి.

నదులు, సరస్సులు, చెరువులు మొదలైన జల వనరులను కాపాడుకునేందుకు మనం చూపే శ్రద్ధాసక్తులపై మన జల భవిష్యత్తు ఆధారపడి ఉన్నది. నీటి కొరత అంటే కేవలం వర్షాలు పడకపోవడం కాదు. ప్రకృతి మనకు ప్రసాదించే జీవధార అందరిదీ. సకల ప్రజలకూ దానిపై హక్కు ఉన్నది. ప్రతి ఒక్కరికీ ఆ హక్కును న్యాయబద్ధంగా అమలుపరచాలి. దురదృష్టవశాత్తు మన సమాజం ఈ విషయంలో విఫలమవుతోంది. ఆ వైఫల్య పర్యవసానమే జల సంక్షోభాలు.

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

మధ్యతరగతీ ఎక్కడికి నీ ప్రయాణం!

ఎన్ని పరిమితులు, పక్షపాతాలు ఉన్నప్పటికీ మంచికైనా చెడుకైనా మధ్యతరగతి ఇప్పుడు మహాచోదక శక్తిగా మారింది. ఆర్థిక రథాన్ని తన వినియోగ శక్తితో పరుగుపెట్టిస్తోంది. ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోవటంలో దూసుకుపోతోంది. నవకల్పనలలోనూ ముందుంటోంది. ప్రజాస్వామ్యాన్ని ఏదో విధంగా కాపాడుతూ వస్తోంది. అదే సమయంలో అసహన ధోరణులకు ఆహ్వానం పలుకుతోంది. ఆధిపత్య భావజాలాల ప్రభావాలకు అనుచితంగా లోనవుతోంది. గతమంతా గొప్పదనే ఆభిజాత్యాన్ని ప్రదర్శిస్తోంది. కుల నిర్దేశిత పెద్దాచిన్నా దృష్టిని పూర్తిగా వదుల్చుకోలేక పోతోంది. వీటిని త్యజించి వివేచనను ప్రదర్శిస్తే దేశాన్ని మేలిమలుపు తిప్పుతుంది. నియంతృత్వాలన్నీ ముందు చూపులేని మధ్యతరగతి మద్దతుతోనే వచ్చాయి. చరిత్ర చెప్పే పాఠం అదే!

పుర్రెకో బుద్ధి–జిహ్వకో రుచి అనేది మనిషి విశిష్టతను చెప్పే ఒక సామెత. అన్ని సంస్కృతుల్లోనూ ఇలాంటి సామెతలు కచ్చితంగా ఉంటాయి. విశిష్టతతో పాటు మనిషికి సాధారణ ప్రవర్తనా ఉంటుంది. సాధారణ ఆలోచనా రీతీ ఉంటుంది. సమాజ మనుగడకు ఇదే కీలకం. సాధారణ ప్రవర్తన లోపిస్తే మనుషుల మధ్య బంధమే ఏర్పడదు. ప్రతి విషయంలోనూ మనుషులు పరస్పరం పొసగని రీతిలో వ్యవహరిస్తే సామాజిక జీవితం సాధ్యంకాదు. కాలక్రమంలో మనుషుల మధ్య విపరీత అంతరాలు ఏర్పడి అసమానతలు తలెత్తిన తర్వాత వర్గాలు, తరగతులుగా మనుషుల స్వభావాలను అంచనా వేయటం మొదలైంది. కార్మికులు, రైతులు, వ్యాపారులు, పెట్టుబడిదారులు, భూస్వాములు, కౌలుదారులు, వ్యవసాయ కూలీలు, మధ్య తరగతి... ఇలా సమాజంలో ఎన్నో సమూహాలు ఉంటాయి. సామాజిక, ఆర్థిక, విద్యా స్థాయిలో కాస్త అటుఇటుగా సమానస్థాయి ఉన్న ప్రజలను భిన్న వర్గాలుగా, తరగతులుగా పరిగణిస్తారు.

అన్ని దేశాల్లోలాగే మన సమాజంలోనూ ఈ వర్గాలు ఉన్నా ఇప్పుడు ఎక్కువగా మాట్లాడుకుంటున్నది మధ్యతరగతి గురించే. మధ్యతరగతి చుట్టూనే రాజకీయాలు తిరుగుతున్నాయి. ఆర్థిక విధానాలు ఎక్కువగా వారిని దృష్టిలో పెట్టుకునే రూపొందుతున్నాయి. వార్తా, వినోద మాధ్యమాల గురీ మధ్యతరగతి పైనే. విదేశీ విలువల అనుకరణలో ముందున్నదీ ఈ తరగతే. కొత్త వస్తువులు, పరికరాల కోసం పరుగులెత్తేది ఈ వర్గమే. సోషల్ మీడియాను విపరీతంగా ఉపయోగించేది వీరే. అంతెందుకు 2014 నుంచి రాజకీయాలను విపరీతంగా ప్రభావితం చేస్తున్నదీ ఈ వర్గమే. ఇన్ని విధాలుగా ప్రాధాన్యం కలిగిన ఈ వర్గం స్వభావం గురించి చాలా పరిశోధనలు జరుగుతున్నాయి. హిందూత్వ ప్రభావానికి బలంగా లోనవుతున్నది ఈ వర్గమే. మత అసహనమూ ఈ వర్గం నుంచే ప్రధానంగా వ్యక్తమవుతోంది. లౌకిక విధానం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగబద్ధపాలన భవిష్యత్తు ప్రధానంగా ఈ వర్గం ప్రవర్తన, ఆలోచనా ధోరణులపైనే ఆధారపడి ఉంటుంది. అటువంటి ఈ వర్గం గురించి సమతూక దృష్టితో పరిశీలనలు చేసిన వారిలో సురీందర్ ఎస్. జోధ్క ఒకరు. అసీం ప్రకాష్‌తో కలిసి రాసిన 'ద ఇండియన్ మిడిల్ క్లాస్' అనే పుస్తకంలో మధ్యతరగతి స్వభావాన్ని లోతుగానే విశ్లేషించారు. ఆర్థికంగా పైకి ఎదగటానికి ఈ వర్గం చేస్తున్న ప్రయత్నాలు, ఆదాయాన్ని ఖర్చుపెడుతున్న తీరు, కొత్త విషయాలకు ఆహ్వానం పలకటం, నాయకత్వ లక్షణాలు, అవకాశాల కోసం దేశం లోపలా వెలుపలా చేసే అన్వేషణలు, పాలనా సంస్కరణల కోసం పట్టుపట్టటం, అవినీతిపై ప్రదర్శించే వైఖరి... ఇలా మధ్యతరగతికి మక్కువైన విషయాలపై చాలామంది రాశారు. ఏ తరగతీ శూన్యం నుంచి ఊడిపడదు. ప్రతిదానికీ నేపథ్యం ఉంటుంది. చరిత్రా ఉంటుంది. వీటిపై దృష్టి పెడితే మధ్యతరగతి అసలు సంగతులూ తెలుస్తాయి.

అభివృద్ధి చెందిన దేశాల్లో మధ్యతరగతి సంఖ్య చాలా ఎక్కువ. మన దగ్గరా దీని సంఖ్య 1990ల తర్వాత బాగా పెరిగింది. ముఖ్యంగా ఆర్థిక సంస్కరణల తర్వాత మధ్యతరగతి విస్తరించింది. పెద్ద యూరపు దేశాల మొత్తం జనాభాని మించి ఇక్కడ మధ్యతరగతి ఉంది. జనాభాలో 30శాతం వరకూ మధ్యతరగతి ఉంటుందనే అంచనాలు ఉన్నాయి. తాజా లెక్కల ప్రకారం మన జనాభా 144 కోట్లు. ఇందులో 30 శాతం అంటే 48 కోట్లు. ఈ సంఖ్యను చూసి భారత్‌లో మధ్యతరగతి మహాయుగం వచ్చేస్తుందనే వ్యాఖ్యానాలు ఊపందుకున్నాయి. గణాంకాలపై ఏకాభిప్రాయం మనకు చాలా అరుదు. అందుకే మధ్యతరగతి ఇంత ఉందంటే అంగీకరించలేని వాళ్లూ ఉన్నారు. జనాభాలో 10 నుంచి 25 శాతం లోపే ఈ వర్గం సంఖ్య ఉంటుందనే అంచనాలూ ఉన్నాయి. ఎంత ఆదాయం ఉన్న వారిని మధ్యతరగతిగా పరిగణించొచ్చు అన్న దానిపైన కూడా ఏకాభిప్రాయం లేదు. ఏడాదికి రెండు లక్షల నుంచి 12 లక్షల రూపాయల వరకూ ఆదాయం ఉన్న వారిని మధ్య తరగతిగా పరగణించవచ్చనీ ఆర్థిక నిపుణులు సూచించారు.

ఆదాయ–వ్యయాల ప్రకారం మొత్తంగా ప్రజలను అయిదు విభాగాలుగా విభజించొచ్చు. అట్టడుగున ఉన్న 20 శాతాన్ని నిరుపేదలుగానూ, ఆ తర్వాత ఉన్న 20 శాతాన్ని పేదలుగానూ పరిగణించి పరిశీలన చేసే పద్ధతి ఉంది. మరో 20 శాతాన్ని కింది మధ్యతరగతిగా భావించొచ్చు. ఆ తర్వాతి 20 శాతాన్ని మధ్య ఆదాయ మధ్యతరగతిగా పరిగణించొచ్చు. అందరికంటే పైనున్న 20 శాతాన్ని ఎగువ మధ్యతరగతి–ధనిక వర్గంగా లెక్కించొచ్చు.

కేవలం ఆదాయాన్నే తీసుకుని ఈ విభాగాలను పరిశీలించటం వల్ల సామాజిక వాస్తవాలు కనపడవు. ఏ విభాగంలో ఏ కులాల ప్రజలు ఎక్కువగా ఉన్నారు? హరిజనులు, గిరిజనులు, బీసీలు, ఓసీలు ఏ విభాగంలో ఎంతెంత శాతంగా ఉన్నారు? అన్ని కులాలకు మధ్యతరగతిలో చోటు లభించటం వల్ల కుల దృష్టి తగ్గుతోందా? తామంతా ఒకటేనన్న భావన మధ్యతరగతిలో పెరుగుతోందా? సమాన ఆర్థికస్థాయి సామాజిక హెచ్చుతగ్గులను చెరిపేస్తోందా? లేక కుల పక్షపాతం మామూలుగానే కొనసాగుతూ ఆధునిక రంగాల్లో కూడా అది ప్రభావాన్ని చూపిస్తోందా? అన్నవి కీలకమైన ప్రశ్నలు. వీటికి జవాబులు వెతికితేనే వాస్తవ చిత్రం ఎంతో కొంత అర్థం అవుతుంది. జాతీయ నమూనా సర్వే (2011–12) వెల్లడించిన తలసరి నెలవారీ వ్యయం లెక్కల ఆధారంగా చూస్తే ఎవరు ఎక్కడున్నారో స్పష్టంగా తెలుస్తుంది.

ఎస్టీల సంగతే చూద్దాం. నిరుపేదల్లో 36శాతం, పేదల్లో 23శాతం, దిగువ మధ్యతరగతిలో 17శాతం, మధ్య ఆదాయ మధ్యతరగతిలో 14శాతం, ఎగువ మధ్యతరగతిలో 10శాతం చొప్పున ఉన్నారు. ఎస్సీల్లో ఈ శాతాలు వరుసగా 25, 23, 20, 18, 13 చొప్పున ఉన్నట్లు తేలింది.

బీసీల్లో 18, 20, 21, 21, 20 శాతం చొప్పున ఉన్నారు. ఓసీల్లో 11, 16, 20, 22, 31 శాతంగా ఉన్నారు. ఇవన్నీ గ్రామీణ ప్రాంతానికి చెందినవి. పట్టణ ప్రాంతాలకు వచ్చేటప్పటికీ శాతాల్లో కొంత తేడాలున్నా పరిస్థితిలో పెద్ద తేడాలేదు.

ఎస్టీ, ఎస్సీ, బీసీలకు సామాజికంగా దిగువ స్థాయిని, అగ్ర కులాలకు ఉన్నతస్థాయిని ఇవ్వటం మన సమాజంలో ఎప్పటి నుంచో ఉంది. సామాజిక స్థాయికి తగ్గట్లుగానే ఆర్థికస్థాయీ ఒకప్పుడు ఉండేది. అనేక పరిణామాల వల్ల కులాల్లోపలా ఆర్థిక పరమైన తేడాలు వచ్చేశాయి. 1990ల తర్వాత అవింకా వేగాన్ని పుంజుకున్నాయి. ఎస్సీల్లో కూడా ఎగువ మధ్యతరగతి ప్రజలు 13 శాతం ఉండటమే దీనికి నిదర్శనం. మధ్యఆదాయ వర్గంలోనూ 18 శాతం ఉన్నారు. ఇంకో ఆసక్తికర పరిణామం ఏమిటంటే దిగువ, మధ్యస్థ తరగతులనే తీసుకుంటే బీసీ, ఓసీల మధ్య పెద్ద తేడాలేదు. ఎగువమధ్య తరగతి వచ్చే సరికి మాత్రం ఈ తేడా 11 శాతం వరకూ ఉంది.

ఈ శాతాలను బట్టి కులాల్లో ఆర్థిక అంతరాలను విస్మరించలేని పరిస్థితి మనకు కనపడుతుంది. మరోవైపు ఇంకో వాస్తవం కూడా మన ముందుకు వస్తుంది. మధ్యతరగతికి చేరుకున్న తర్వాత కూడా కుల, జాతి భావనలు ప్రజల్లో పూర్తిగా తగ్గలేదని చెప్పటానికి సురీందర్ పలు పరిశీలనలను ప్రస్తావించారు. వీలున్నచోట్ల మధ్యతరగతి కుల పక్షపాతాన్ని ప్రదర్శిస్తోంది.



ఇందులోనూ అగ్రకులాల వాటానే పెద్దది. సమాజంలో బాగా పరపతిని కలిగి ఉండి అవసరమైన చోట కొత్త పరిచయాలను ఏర్పరచుకోవటంలో అగ్రకులాలకు చాకచక్యం ఉంది. దీన్నే సోషల్ క్యాపిటల్ అంటారు. ఇతర కులాలకు అవకాశాలు దక్కకుండా పలు సందర్భాల్లో దీన్ని ఉపయోగిస్తారు. అందుకే కుల సంఘీభావం పనిచేయని రంగం ఉందని చెప్పుకోలేం. పాశ్చాత్య దేశాల్లో జాతి ఆధిక్యతా భావాలు ఉన్నప్పటికీ కులం నుంచి ఉత్పన్నమయ్యే ఇన్ని పక్షపాతాల్లేవు. ఈ పక్షపాతమే చాలా సందర్భాల్లో సమస్యలపై సంఘటితం కాలేని దుస్థితిని తెచ్చిపెడుతోంది. అయితే అందరూ ఈ దారిలోనే లేరు. స్వేచ్ఛ, సామాజిక సమానత్వ భావాల నుంచి ప్రేరణ పొందిన వ్యక్తులు, నాయకులు కూడా మధ్యతరగతి నుంచే వచ్చారు. సంస్కరణ, ప్రగతిశీల ఉద్యమాలకు వారే నేతృత్వం వహించారు. కానీ వీటితో నేరుగా ప్రభావితమైన మధ్యతరగతి సంఖ్య గణనీయమైందని చెప్పలేం. దీనికి గట్టి కారణాలే ఉన్నాయి. మన మధ్యతరగతి బ్రిటిషు పాలకుల అవసరాల కోసం పుట్టింది. అధికారాన్ని చలాయించిన వర్గాలతో సంఘర్షించి ఉనికిలోకి రాలేదు. 1947 వరకూ మధ్యతరగతి అంటే ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులు, లాయర్లు, వైద్యులు, గుమాస్తాలు, అకౌంటెంట్లు, ఉపాధ్యాయులే. ఈ తరగతి ఎప్పుడూ సమాజంలో సమూల మార్పులు కోరుకోలేదు. పెద్దగా ఇబ్బంది కలిగించని సంస్కరణల కోసమే పట్టుబట్టింది. రాజకీయ అధికారాన్ని కూడా మెట్టుమెట్టుగా సాధించటానికే ప్రాధాన్యం ఇచ్చింది. మధ్యతరగతిలో అత్యధికులు అగ్రకులాల నుంచి రావటం వల్ల తరతరాలుగా తమకు పెద్దపీట వేసిన సామాజిక వ్యవస్థను మార్చటానికి ఇష్టపడలేదు. ఈ పరిమితి వల్లే ఎన్నో ప్రగతిశీల చట్టాలు ఆచరణలో పేలవంగా అమలయ్యాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, బహుళ సంస్కృతుల పరిరక్షణ, సంక్షేమరాజ్య భావన, రిజర్వేషన్ల కల్పన లాంటి వాటికి మధ్యతరగతి రాజకీయ నాయకత్వం ఆమోదించినా అవన్నీ సవ్యంగా అమలయ్యాయని చెప్పలేం.


■ రాహుల్ కుమార్

ఎన్ని పరిమితులు, పక్షపాతాలు ఉన్నప్పటికీ మంచికైనా చెడుకైనా మధ్యతరగతి ఇప్పుడు మహాచోదక శక్తిగా మారింది. ఆర్థిక రథాన్ని తన వినియోగ శక్తితో పరుగుపెట్టిస్తోంది. ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోవటంలో దూసుకుపోతోంది. నవకల్పనలలోనూ ముందుంటోంది. ప్రజాస్వామ్యాన్ని ఏదో విధంగా కాపాడుతూ వస్తోంది. అదే సమయంలో అసహన ధోరణులకు ఆహ్వానం పలుకుతోంది. ఆధిపత్య భావజాలాల ప్రభావాలకు అనుచితంగా లోనవుతోంది. గతమంతా గొప్పదనే ఆభిజాత్యాన్ని ప్రదర్శిస్తోంది. కుల నిర్దేశిత పెద్దాచిన్నా దృష్టిని పూర్తిగా వదుల్చుకోలేకపోతోంది. వీటిని త్యజించి వివేచనను ప్రదర్శిస్తే దేశాన్ని మేలిమలుపు తిప్పుతుంది. నియంతృత్వాలన్నీ ముందు చూపులేని మధ్యతరగతి మద్దతుతోనే వచ్చాయి. చరిత్ర చెప్పే పాఠం అదే!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.8 కనిష్ఠం 26.2





మ్యాచ్‌ను వీక్షిస్తున్న వెంకటేష్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబసభ్యులు



అల్లు శిరీష్



ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్





వర్షిణి

ఉప్పల్ స్టేడియం వద్ద ఉద్రిక్తత

● టికెట్ల బ్లాక్ దందాపై ఆందోళనలు

ఉప్పల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ టికెట్లను బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ యువజన సంఘాలు ఉప్పల్ స్టేడియం ఎదుట ఆందోళనకు దిగాయి. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, శాట్ చైర్మన్ శివసేన రెడ్డి.. కార్యకర్తలతో గురువారం స్టేడియం వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. హెచ్‌సీఏ ప్రెసిడెంట్ జగన్‌మోహన్‌రావు టికెట్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. టికెట్ల దందాతోపాటు క్రికెట్ అభిమానులు స్టేడియంలో ఆహార పదార్థాలు కొనుగోలు చేసే పరిస్థితి లేదని డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్ రాష్ట్ర కమిటీ నేతలు స్టేడియం ముట్టడికి పిలుపునిచ్చారు. ఉప్పల్ పోలీసులకు యువజన సంఘాల నేతలు హెచ్‌సీఏపై ఫిర్యాదు చేశారు. మ్యాచ్‌ల్లో బ్లాక్ టికెట్ల దందాను అరికట్టాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జావిద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

స్టార్ల జోరు.. ఫ్యాన్స్ హోరు

ఉప్పల్ స్టేడియంలో గురువారం సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు అభిమానులు పోటెత్తారు. ఈసారి బెంగళూరు టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ ఎంచుకున్నా, ఆ జట్టు ఆటగాళ్లు ఫ్యాన్స్‌ను ఏమాత్రం నిరాశ పరచకుండా 200కు పైగా స్కోరు చేసి స్టేడియాన్ని హోరెత్తించారు. ఆర్సీబీ స్టార్లు విరాట్ కోహ్లి, రజత్ పటీదార్.. సన్‌రైజర్స్ హీరోలు అభిషేక్ శర్మ, కమిన్స్ ధనాధన్ షాట్లతో అభిమానులు మైమరచిపోయారు.




క్రికెట్ అభిమానులతో కిక్కిరిసిన స్టేడియం

మోదీ, అమిత్‌షాలను ఓడించకపోతే రిజర్వేషన్లు రద్దవుతాయి

దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలి

● వాటిని కాపాడే బాధ్యత కాంగ్రెస్‌ది
● రిజర్వేషన్ల రద్దుపై ఈటల వైఖరి చెప్పాలి
● కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో కలుపుతాం
● రోడ్‌షోలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ సిటీ/సికింద్రాబాద్, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు ఓటేస్తే ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీల రిజర్వేషన్లను కాపాడే బాధ్యత తమ పార్టీ తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మోదీ అమిత్‌షాలను ఓడించకపోతే రిజర్వేషన్లు రద్దు అవుతాయన్నారు. రిజర్వేషన్ల రద్దుపై ఈటల రాజేందర్ వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని అన్నానగర్‌లో గురువారం రాత్రి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డిలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడంగల్‌లో ఎన్నో కుట్రలతో ఓడిన తనను మూడు నెలల్లో ఎంపీగా గెలిపించారని, ఏ ఒక్కరోజూ విరామం తీసుకోకుండా పార్లమెంట్ నుంచి రాష్ట్ర అసెంబ్లీ వరకు ప్రతీ సమస్యపై కొట్లాడానని గుర్తు చేశారు. ప్రజా సమస్యలను చెప్పేందుకు వెళ్లిన గద్దరన్నను ఎర్రటి ఎండలో నాలుగు గంటలు గేటు ఎదుటే అవమానించిన ఉసురు తగిలి కేసీఆర్ ప్రభుత్వం కూలిపోయిందన్నారు. పేదల చెమట గిట్టని కేసీఆర్ బస్సు యాత్ర మొదలు పెట్టిండని, బస్సు యాత్ర కాదు.. ఆయన మోకాళ్ల యాత్ర చేపట్టినా ప్రజలు నమ్మరని విమర్శించారు. సినిమా వాళ్లు చనిపోతే అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు చేసిన కేసీఆర్ సొంత పార్టీ ఎమ్మెల్యే సాయన్న చనిపోతే అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు చేయలేదని తెలిపారు. కేసీఆర్ చచ్చిన పాముతో సమానమని, బస్సు యాత్ర తర్వాత ఆయనకు తీర్థ యాత్రలే దిక్కని ఎద్దేవా చేశారు. దేవుడి పేరుతో బీజేపీ ఓట్లు దండుకోవాలని చూస్తోందని, దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలని అన్నారు. 300 సీట్లిస్తే 370 ఆర్టికల్, త్రిపుల్ తలాక్, సివిల్ కోడ్, జీఎస్టీ, రైతు నల్ల చట్టాలు, నోట్ల రద్దు చేశారని, 400 సీట్లిస్తే రిజర్వేషన్లు రద్దు చేయడానికి బీజేపీ ప్రయత్నం చేస్తుందని అన్నారు.



రోడ్‌షోలో ప్రసంగిస్తున్న రేవంత్‌రెడ్డి, హాజరైన జనం

విలీనంతోనే సమస్యల పరిష్కారం

కంటోన్మెంట్‌లోని రోడ్ల బంద్, నీటి సమస్యలను కేసీఆర్ పదేళ్లకు కూడా పరిష్కారం చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో కలిపితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గాడిదకు గడ్డేసి ఆవుకు పాలు పిండితే రావని, బీఆర్‌ఎస్‌కో, బీజేపీకో ఓట్లు వేసి కాంగ్రెసోళ్లను అడిగితే సమస్యల పరిష్కారం సాధ్యం కాదన్నారు. ఈ ప్రాంత రోడ్ల సమస్యపై ఢిల్లీకి పోయి ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు ఎలివేటేడ్ కారిడార్‌కు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. వచ్చే పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు. ఎమ్మెల్యేగా శ్రీగణేష్‌ను గెలిపించాలని, ఎంపీ అభ్యర్థిగా సునీతమ్మకు వేసే ప్రతీ ఓటు మీ రేవంత్ అన్నకు వేసినట్టేనన్నారు.

సమస్యలను నోట్ చేసుకుంటున్నా..

మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి సునీతారెడ్డి మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రజలు పడుతున్న ఇబ్బందులన్నీ తాను నోట్ చేసుకుంటున్నానని, విజయం సాధించిన తర్వాత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ కంటోన్మెంట్‌ను దత్తత తీసుకుంటానని కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం డబ్బులు ముట్టచెప్పిన వారికి తాము న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ మాట్లాడుతూ కంటోన్మెంట్ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, వెన్నెల, జంపన ప్రతాప్, కొత్త సంజీవరెడ్డి, మర్రి అమరేందర్‌రెడ్డి, ముప్పిడి గోపాల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీల తొలగింపు

సికింద్రాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి రోడ్‌షో నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు వాటిని తొలగించారు. ముఖ్యమంత్రి ర్యాలీ అయ్యేవరకు ఉంచాలని అధికారులను మైనంపల్లి కోరినా పట్టించుకోలేదు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తొలగించక తప్పదని తెలిపారు.

డ్రోన్లపై ఆంక్షలు

ఉపరాష్ట్రపతి పర్యటన సందర్భంగా..

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డ్రోన్లు, రిమోట్ కంట్రోల్డ్ తేలికపాటి విమానాల ఎగురవేతపై ఆంక్షలు విధిస్తూ సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. ఉపరాష్ట్రపతి శుక్రవారం నగర పర్యటన సందర్భంగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆంక్షలు విధించినట్లు సీపీ తెలిపారు.

57 మంది చొప్పున..!

● హైదరాబాద్, సికింద్రాబాద్‌కు నామినేషన్లు
● అత్యధికంగా మల్కాజిగిరికి 114 మంది
● నేడు పరిశీలన..

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల దాఖలు గురువారం ముగిసింది. 18వ తేదీన నామినేషన్ల స్వీకరణ మొదలు కాగా, నేడు పరిశీలన జరగనుంది. 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశముంది. ప్రధాన పార్టీలతోపాటు, చిన్నాచితక, స్వతంత్ర అభ్యర్థులు భారీగా నామినేషన్లు వేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్‌కు 57 మంది, హైదరాబాద్‌లో 57 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిసింది. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్

మిగతా 8వ పేజీలో..

చాక్లెట్లు ఇస్తా.. అమ్మానాన్నతో ఓటు వేయించండి

● విద్యార్థులతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్



విద్యార్థులతో కమిషనర్ రోనాల్డ్‌రోస్


కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): 'మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మీ అమ్మానాన్నతో ఓటు వేయిస్తే మీకు చాకెట్లు ఇస్తాం' అంటూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ విద్యార్థులకు హామీ ఇచ్చారు. కేపీహెచ్‌బీలోని వేసవి శిక్షణా శిబిరానికి హాజరైన ఆయన దేశంలో ఓటుహక్కు వినియోగించుకోవడంలో హైదరాబాద్ వెనకంజలో ఉండటంపై నిరుత్సాహం వ్యక్తం చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనైనా ఓటింగ్ శాతం పెరగడంలో అధికారులతో పాటు విద్యార్థుల భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మీరు ఇంటికి వెళ్లిన తర్వాత 'అమ్మనాన్న మీకు ఓటు ఉందా? ఎక్కడ ఉంది? ఈ సారి ఓటు వేస్తారా లేదా?' అని ప్రశ్నించండి అని సూచించారు. తల్లిదండ్రులు ఓటు వేసినట్లు వేలి ముద్రలపై సిరా ఇంకు ఉన్న ఫొటోలతో మే 14న వేసవి శిక్షణా శిబిరానికి వచ్చిన విద్యార్థులకు చాక్లెట్లు ఇస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

ప్రచారంపై ఎండల ఎఫెక్ట్

● సాయంత్రం సమావేశాలకే నేతల మొగ్గు ● ఫంక్షన్ హాళ్లలో కూలర్లు పెట్టి మీటింగులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంపై ఎండల ఎఫెక్ట్ పడుతోంది. ఎన్నికలంటే నెలరోజుల ముం దు నుంచే నియోజకవర్గాల్లో అభ్యర్థుల కోసం ఉదయం నుంచి రాత్రి వరకు మైకులతో హోరెత్తించే ప్రచార వాహనాలు అంతగా కనిపించడం లేదు. నేతలూ ఇంటింటికీ తిరగడం లేదు. సాయంత్రం సమావేశాల నిర్వహణకే ప్రాధాన్యం ఇస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఒకటి, రెండు ప్రధానపార్టీల అభ్యర్థుల ప్రచార రథాలు తప్ప పెద్దగా వాహనాలు కనిపించడం లేదు. ఎండల ప్రభావంతో ఉదయం 10 గంటలలోపు, సాయంత్రం 5 తర్వాతే వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. మధ్యాహ్నం 43 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదవడం, వడగాలుల తీవ్రత అధికంగా ఉండటంతో వాహనాలను తిప్పలేకపోతున్నామని డ్రైవర్లు చెబుతున్నారు. గతంతో పోల్చితే 40 నుంచి 50 శాతం వాహనాల సంఖ్య తక్కువగా

మిగతా 6వ పేజీలో..



దడ్.. దడ..!

మూల మలుపుల వద్ద విపరీతమైన శబ్దం వస్తుండడంతో స్థానికులు వణికిపోతున్నారు.

రోడ్లపై వెళ్తున్న వాహనదారులు కూడా పిల్లర్లపై నుంచి వస్తున్న ధ్వని తీవ్రతకు హడలిపోతున్నారు.

● భయపెడుతున్న మెట్రోరైలు శబ్దాలు
● మితిమీరిన డెసిబుల్స్‌తో ట్రాక్ సమీపవాసుల పరేషాన్
● గతంలో ఫిర్యాదులు అందినా.. పట్టించుకోని అధికారులు
● హైకోర్టు నోటీసులతో తాజాగా అప్రమత్తం
● త్వరలో ధ్వని తీవ్రతపై క్షేత్రస్థాయి పరిశీలన

దడ్.. దడ్.. అంటూ వస్తున్న మెట్రోరైలు శబ్దాలకు ట్రాక్ సమీప ప్రాంత వాసులు, కింది నుంచి వెళ్తున్న ప్రయాణికులు హడలిపోతున్నారు. కొన్నిప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల వెంటే ట్రాక్‌ను నిర్మించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గంటకు 80 కిలోమీటర్ల వేగంతో పరుగెడుతున్న రైళ్ల ధ్వని తీవ్రత వారిని కలవరపెడుతోంది. మెట్రోరైలు శబ్ద కాలుష్యంపై హైకోర్టు వివరణ అడిగిన నేపథ్యంలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు ఆకాశహర్మ్యానా తిరుగుతున్న సమయంలో శబ్దం వస్తుండడంతో ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అన్నట్లుగా స్థానికులు హడలిపోతున్నారు. శబ్ద కాలుష్యంపై సంబంధిత అధికారులకు గతంలో కొందరు ప్రయాణికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. తాజాగా సికింద్రాబాద్ సమీపంలోని బోయిగూడ మెట్రోపిల్లర్ బి1006 వద్ద రైల్వేట్రాక్ వంపులో మితి మీరిన శబ్దం వస్తోందని డాక్టర్ హనుమాన్లు హైకోర్టుకు లేఖ రాశారు. దీనిపై వివరణ ఇవ్వాలని హైకోర్టు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో మెట్రో అధికారులు అప్రమత్తమమయ్యారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి నివేదికను అందజేసేందుకు సిద్ధమవుతున్నారు.



సుల్తాన్‌బజార్ స్టేషన్ వెంటనే దుకాణాలు

పలు చోట్ల ఇళ్ల వెంట ట్రాక్..

నగరంలోని సుల్తాన్‌బజార్, మధురానగర్, యూసుఫ్‌గూడ, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, బోయిగూడ, జేబీఎస్ లాంటి ప్రాంతాల్లో ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల వెంటే ట్రాక్‌ను నిర్మించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మూల మలుపుల వద్ద విపరీతమైన శబ్దం వస్తుండడంతో వణికిపోతున్నారు. కాగా, మెట్టుగూడ-సికింద్రాబాద్ మధ్యన, నాంపల్లి-లక్డీకపూల్ స్టేషన్ల మధ్యలో కూడా అప్పుడప్పుడు బేరింగులు పట్టేసినట్లుగా ధ్వని వస్తోందని ఆయా మార్గాల్లో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు చెబుతున్నారు. రైళ్లు నడుస్తున్న సమయంలో వస్తున్న భారీ శబ్దంపై గతంలో ఫిర్యాదులు అందినప్పటికీ అధికారులు.. కనీస చర్యలు చేపట్టలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏడాది తర్వాత పరిస్థితిని పూర్తిగా సమీక్షించి శబ్ద కాలుష్యాన్ని నియంత్రిస్తామని చెప్పిన అధికారులు ఇప్పటివరకు ఆ దిశగా ముందుకు సాగలేదు.

గంటకు 80 కిలోమీటర్ల వేగం

ఎల్‌అండ్‌టీ ఆధ్వర్యంలో నడుస్తున్న మెట్రోరైళ్ల గరిష్ఠ వేగం గంటకు 80 కిలోమీటర్లు. ట్రాక్‌ను గంటకు 90 కిలోమీటర్ల వేగంతో నడిచే విధంగా డిజైన్ చేశారు. సగటు వేగాన్ని గంటకు 33 కిలోమీటర్లతో రూపొందించారు. ప్రస్తుతం మెట్రో ఆపరేటర్లు గంటకు 80 కిలోమీటర్ల వేగంతోనే రైళ్లను నడిపిస్తున్నారు. భూమి మీద నుంచి దాదాపు 65 అడుగుల ఎత్తులో మెట్రో పిల్లర్లను నిర్మించారు. ఒక పిల్లర్‌కు, మరో పిల్లర్‌కు మధ్య 180 అడుగుల దూరం పాటించారు. ఆ మేరకు ట్రాక్‌ను పటిష్ఠంగా నిర్మించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. రైళ్లు నడుస్తున్న సమయంలో ట్రాక్‌పై భారీ శబ్దం వస్తుండడం ప్రయాణికులను

మిగతా 8వ పేజీలో..

సాధారణ, వ్యయ పరిశీలకులు వీరే



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా పరిధిలో జరుగుతోన్న పార్లమెంట్, అసెంబ్లీ ఉపఎన్నిక కోసం సాధారణ, వ్యయ, పోలీస్ పరిశీలకులను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. ఈ సంఘం ఎన్నికల నిర్వహణ, ప్రచార వ్యయం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన ఫిర్యాదులను పరిశీలిస్తుంది. సికింద్రాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి బంజారాహిల్స్‌లోని సిటీ మేనేజర్స్ అతిథి గృహం మూడో అంతస్తులో, హైదరాబాద్ పార్లమెంట్ ఫిర్యాదులను అదే భవనంలోని రెండో అంతస్తులో తీసుకుంటారు. కోడ్ ఉల్లంఘనపై ఆయా అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.

నగరానికి పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు

పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు నగరానికి వచ్చారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్‌ల పరిధిలో ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్

మిగతా 8వ పేజీలో..

మంగళ్‌హట్ డీఐ సస్పెన్షన్ 8 | అత్యాచారం చేసి.. తలను నేలకు బాది.. మహిళ హత్య కేసు ఛేదించిన పోలీసులు

ప్రచారంపై ఎండల ఎఫెక్ట్

(5వ పేజీ తరువాయి)

ఉందని ప్రచారవాహన తయారీదారులు చెబుతున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రధానపార్టీల అభ్యర్థులు సాయంత్రం పూట సమావేశాలు నిర్వహించేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఫంక్షన్‌హాళ్లలో కూలర్లు, ఏసీలు పెట్టి సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాలు, కుల సంఘాల ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహించి వారి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, ఇప్పుడు నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ప్రచార సందడి పెరుగుతుందని ముఖ్యనేతలు చెబుతున్నారు.



ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

మలేరియా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాను మలేరియా రహిత జిల్లాగా మార్చటానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని హైదరాబాద్ జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకట్ కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం నాటికే సిబ్బంది మలేరియా, డెంగీ వంటి కీటక జనిత వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖానా పరిధిలో కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. మలేరియా, డెంగీ సర్వే నిర్వహించి అనుమానితుల నుంచి రక్త పరీక్షలు నిర్వహించి తగిన వైద్యం, సలహాలను అందించాలని డాక్టర్ వెంకట్ సూచించారు. నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్‌మీడియా అధికారి రాములు, మలేరియా అధికారి నిరంజన్, ఉప మాస్ మీడియా అధికారులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జూపార్కులో ఒకరోజు సమ్మర్‌క్యాంపు

మదీన, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణం, వన్యప్రాణుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు జూపార్కులో ఒకరోజు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు డిప్యూటీ క్యూరేటర్ ఎ.నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణంలో వన్యప్రాణుల పాత్ర, జూపార్కు ఆవశ్యకత, జూపార్కు ఏర్పాటు ముఖ్య ఉద్దేశం, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ సమ్మర్‌క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 25 నుంచి 30వ తేదీవరకు లోపు ఒకరోజు క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్యాంపులో చేరదలచుకున్నవారు రూ.వెయ్యి చెల్లించి తమ పేరును నమోదు చేయించుకోవాలని, ఇతర వివరాలకు జూ ఎడ్యుకేషన్ ఆఫీసర్ దీపక్ 7799292607 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ జానకి

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

మదీన, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ జానకి రౌడీషీటర్లను హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల ఎన్నికల నేపథ్యంలో గురువారం చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, ఎన్నికల్లో రౌడీషీటర్లపై నిఘా పెంచుతున్నామన్నారు. అల్లర్లు సృష్టించడం, రాజకీయ పార్టీలకు మద్దతుగా ప్రత్యర్థులను బెదిరించడం, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం లాంటి చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవన్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట ఏసీపీ కె.మనోజ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ కె.గురునాథ్ పాల్గొన్నారు.

వాట్సాప్ గ్రూప్‌లో ఆడియో పోస్ట్

● పోలీసులకు ఫిర్యాదు చేసిన పార్థి కులస్థులు

మదీన, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల మధ్య అశాంతిని రేకెత్తించేందుకు గుర్తుతెలియని వ్యక్తి ఓ సామాజిక వర్గాన్ని టెర్రరిస్టులతో పోల్చుతూ వాట్సాప్ గ్రూప్‌లో ఓ వీడియో పోస్ట్ చేశాడు. 'పార్థి కులస్థులు స్థానికంగా మజ్లిస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నారని, మీరంతా టెర్రరిస్టులని' పార్థివాడ కమ్యూనిటీకి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో ఆడియో పోస్టు చేశాడు. ప్రశాంతంగా ఉన్న ప్రజల్లో అలజడులు సృష్టించేందుకు యత్నించిన వక్తిపై చర్యలు తీసుకోవాలని పార్థివాడ కాలనీ ప్రతినిధులు, రాంకుమార్ గురువారం కామాటిపురా ఇన్‌స్పెక్టర్ వై. కమల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఎస్సై కమల్‌కుమార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న పార్థివాడ కాలనీ వాసులు

ఫలక్‌నుమా బ్రిడ్జిపై భారీ వాహనాల

రాకపోకలు నిలిపివేత

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా బ్రిడ్జిపై నుంచి భారీ వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్టు ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ తెలిపారు. ఫలక్‌నుమా ఆర్‌వోబీ సమాంతర బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా ఫలక్‌నుమా బ్రిడ్జిపై మూడు నెలలపాటు భారీ వాహనాలను అనుమతించడం లేదన్నారు. అందులో భాగంగా గురువారం రోడ్డుపై కమాన్ ఏర్పాటు చేసి సూచిక బోర్డులను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు.

ఓల్డేజ్ హోంలో వృద్ధురాలి మృతి

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓల్డేజ్ హోమ్‌లో నివసిస్తున్న వృద్ధురాలు అనారోగ్యంతో మృతిచెందింది. ఫలక్‌నుమా ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ ప్రాంతంలో రోడ్లపై నివసిస్తున్న శంకరమ్మ(60)ను మార్చి 2023లో ఛత్రినాక పోలీసులు ఫాతిమా ఓల్డేజ్ హోంలో చేర్పించారు. శంకరమ్మ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం సాయంత్రం మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శంకరమ్మ

కాంగ్రెస్ హస్తం.. పేదల నేస్తం..!

● చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి
● రెండో సెట్ నామినేషన్ దాఖలు
● 'పాంచ్ న్యాయ్'తో అందరికీ ప్రయోజనం

రాజేంద్రనగర్/రంగారెడ్డి అర్బన్, , ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హస్తం.. పేదల నేస్తమని చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా గురువారం రాష్ట్ర మైనార్టీ గురుకుల విద్యాసంస్థల వైస్‌చైర్మన్ మహ్మద్ ఫయీమ్ ఖురేషీ, వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇతర నాయకులతో కలిసి రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో చేవెళ్ల ఎన్నికల రిటర్నింగ్‌అధికారి, జిల్లా కలెక్టర్ శశాంకకు రెండో సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. అనంతరం రంజిత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఇప్పటికే నాలుగు అమలు చేశామని, మిగతా రెండు గ్యారెంటీలను పార్లమెంట్ ఎన్నికల అనంతరం అమలు చేస్తామని అన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ 'పాంచ్ న్యాయ్' పేరుతో మేనిఫెస్టోను తీసుకొచ్చారని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని రంజిత్‌రెడ్డి అన్నారు. దేశాభివృద్ధికి, చేవెళ్ల నియోజక వర్గ అభివృద్ధికి ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు అన్నివర్గాల ప్రజలు మద్దతు ఇచ్చి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ 14 ఎంపీ సీట్లు సాధించడం ఖాయమన్న ఆయన, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉంటుందని అన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో నామిషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం



మియాపూర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లోమాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

మియాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొండాపూర్ ప్రేమ్‌నగర్, మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌ల్లో నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేవెళ్ల అభివృద్ధికి అందరూ కాంగ్రెస్‌కు అండగా నిలవాలన్నారు. నాయకులు కార్యకర్తలు శక్తివంచన లేకుండా పార్టీ అభ్యర్థి గెలుపుకు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జెరిపెటి జైపాల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రంజిత్‌రెడ్డితో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

రంజిత్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలి

హైదర్‌నగర్: చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి గురువారం నామినేషన్ వేసిన సందర్భంగా ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ శివమ్మకాలనీ అసోసియేషన్ సభ్యులు గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ను కలిశారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కార్పొరేటర్ అసోసియేషన్‌ను కోరారు.

మైనారిటీలకు అండగా నిలిచేది కాంగ్రెస్ ఒక్కటే

సరూర్‌నగర్: రాష్ట్రంలో మైనారిటీ వర్గాల ప్రజలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని, ఆయా వర్గాల ఓటర్లు వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే సంపూర్ణ సహకారం అందించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి బడంగ్‌పేట్ కార్పొరేషన్ బాలాపూర్ 15వ డివిజన్ పరిధిలోని ఆర్చిడ్‌కాలనీ, సీపీఎస్‌ఆర్ కాలనీ, మెట్రో సిటీ తదితర కాలనీల్లో ముస్లిం మైనారిటీ నేతలు, మహిళలతో కలిసి చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలి

ఎల్‌బీనగర్: హస్తంగుర్తుకు ఓటు వేసి రంజిత్‌రెడ్డిని మరోసారి ఎంపీగా గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు సరూర్‌నగర్ డివిజన్‌లోని అంబేద్కర్‌నగర్, శంకర్‌నగర్, జైస్వాల్‌కాలనీలలో గురువారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. మాజీ కార్పొరేటర్ అనితాదయాకర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శంకర్‌యాదవ్, బేర బాలకిషన్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అరవింద్‌కుమార్, నల్లంకి ధన్‌రాజ్‌గౌడ్, బండి మధుసూదన్, సుదర్శన్ ముదిరాజ్, ఇమ్రాన్, నయిబ్, అరుణ, నాగమణి, లోడి నరసింహ, నాగేష్, జంగారెడ్డి, మల్లేష్, రాఘవేంద్రగుప్త, కె. రాము, భాగ్యమ్మ పాల్గొన్నారు.

తెలంగాణ సారస్వత దిక్సూచి సురవరం

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతంలో సాహిత్య చైతన్యానికి పాదులు వేసిన ఘనత సురవరం ప్రతాపరెడ్డికి దక్కుతుందని, తెలంగాణ సారస్వత దిక్సూచీ సురవరం అని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ సారస్వత పరిషత్తులో జరిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రంథ స్వీకర్తగా పాల్గొన్న చిన్నారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కవులు పూజ్యం అన్న మాటను సవాలుగా తీసుకొని గోలకొండ కవులు సంచిక వెలువరించి ఈ ప్రాంత కవులు, రచనలు వారి గొప్పదనాన్ని లోకానికి చాటుకున్నారని అన్నారు. డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు. అతిథులుగా ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, సురవరం కుమారుడు సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డి పాల్గొనగా... భాషా సాంస్కృతిక మండలి అధ్యక్షుడు డాక్టర్ గంటా జలంధర్‌రెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. డాక్టర్ పోరెడ్డి రంగయ్య కార్యక్రమ సమన్వయం చేశాడు. సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.



గంథాన్ని ఆవిష్కరిస్తున్న ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ చిన్నారెడ్డి తదితరులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దైవజ్ఞశర్మ తదితరులు


28న మెగా నాట్యమహోత్సవం

బర్కత్‌పుర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 28న మెగా నాట్యమహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మెగా డ్యాన్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడయీ వ్యవస్థాపకులు డాక్టర్ ఇ.ఎస్.ఎస్. నారాయణ మాస్టర్, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణజీ శేషు, ప్రముఖ నాట్యగురువులు డాక్టర్. సురభి శారద తదితరులు మాట్లాడారు. ఈ నెల 28న ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో నాట్యమహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేడుకల్లో పాల్గొన్న కళాకారులకు సర్టిఫికెట్‌లు, మెమెంటోలు ప్రదానం చేస్తున్నామని, నాట్యగురువులను ఘనంగా సత్కరిస్తున్నట్లు వారు తెలిపారు. ఆరేళ్ల వయసు నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు పాల్గొనవచ్చని తెలిపారు. ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని, ఇతర వివరాలకు 9652347207 ఫోన్‌నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల

కో-ఆర్డినేటర్‌గా ప్రేమ్‌సింగ్ రాథోడ్

గోషామహల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా గోషామహల్ మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్ నియమితులయ్యారు. గురువారం బీజేపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి నియమాక ఉత్తర్వులను జారీచేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సింగ్ రాథోడ్ మాట్లాడుతూ బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు.



ప్రేమ్‌సింగ్ రాథోడ్



మాట్లాడుతున్న ఇస్కాన్ సంస్థ కూకట్‌పల్లి శాఖ ప్రతినిధులు శ్రీవాణి, రోమా, విజయలక్ష్మి తదితరులు

29 నుంచి చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరం

నల్లకుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ సంస్థ కూకట్‌పల్లి శాఖ, అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి మే 11వ తేదీ వరకు ఇస్కాన్ గీతా క్యాంపు శీర్షికన చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని సంస్థ కూకట్‌పల్లి శాఖ కో-ఆర్డినేటర్లు శ్రీవాణి, రోమా, విజయలక్ష్మి తెలిపారు. గురువారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దూలపల్లి మైసమ్మగూడలోగల డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. శిబిరానికి హాజరైన చిన్నారులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనంతో పాటు ఉచిత ప్రయాణ, వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. వివరాలకు 94404 86792, 98490 19590, 93463 73661 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన గిరిజన కళాశాల విద్యార్థులు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో రాజేంద్రనగర్ గిరిజన ప్రతిభా కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. గిరిజన ప్రతిభా కళాశాలకు చెందిన 75మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, వారిలో 66 మంది ర్యాంకులు సాధించారు. కె.వినోద్ 96.86 పర్సంటైల్ సాధించి, అందరికంటే ముందు వరుసలో ఉన్నాడు. బి.సతీష్ (94.52), బి.రాజ్‌కుమార్ (93.27), డి.పవన్ (93.06) బి.పవన్(91.50), ఎం.గణేష్ (91.10), బి.తరుణ్(92.80), ఎ.రాహుల్ (91.96) పర్సంటైల్ సాధించారు. 80 శాతంపైన 17 మంది, 70 శాతానికిపైగా 17 మంది, 60 శాతానికి పైగా 14 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ గట్టు సురేందర్‌తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురుకుల ఉన్నతాధికారులు అభినందించారు.

బీఆర్ఎస్, బీజేపీని ప్రజలు నమ్మేస్థితిలో లేరు

● దానం నాగేందర్



దానంను కలిసిన మహేష్‌యాదవ్ తదితరులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. గురువారం ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. మహేష్‌యాదవ్‌తో పాటు పలువురు నేతలు దానం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారని అన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, నాయకులు ఎం. శ్యామ్‌రాజ్, సందీప్‌కుమార్, రవికుమార్, బబ్లూ, సుభాష్, ఫ్రాన్సిస్, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దానంను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాం

పంజాగుట్ట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మాల మహానాడు, మాల ప్రజా సంఘాల జేఏసీ మద్దతు ప్రకటించాయి. ఆయనను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లో మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు, మన్నే శ్రీధర్‌రావు, గోపోజు రమేష్‌తో కలిసి దానం నాగేందర్‌కు మద్దతు తెలుపుతూ.. రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. దేశాన్ని రక్షించుకోవాలంటే, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కాపాడుకోవాలంటే కాంగ్రెస్ పార్టీని బలపర్చాలని అన్నారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మాన్ని ప్రవేశపెట్టాలని చూస్తోందని ఆరోపించారు. రిజర్వేషన్లను తొలగించాలని బీజేపీ కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దళిత, బహుజన, మైనారిటీలందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి, దానం నాగేందర్‌ను గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు బంగి ఆనంద్, జి.కళ్యాణ్, జి.రమేష్, పాల్గొన్నారు.



దానం నాగేందర్‌కు మద్దతుగా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య తదితరులు

కాంగ్రెస్‌కు నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ మద్దతు



అభివాదం చేస్తున్న నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉషాకిరణ్, నాయకులు

పంజాగుట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే తమ పూర్తి మద్దతు ఉంటుందని, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేస్తామని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ఉషాకిరణ్ ప్రకటించారు. తెలంగాణలో ఆదివాసీ, గిరిజనుల హక్కుల రక్షణ కోసం కృషి చేస్తున్న, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఫెడరేషన్ నాయకులతో కలిసి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఫెడరేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు మేడ విజయ్, విద్యార్థి విభాగం అధ్యక్షురాలు దేవర విజయ, చెంచు కమ్యూనిటీ కన్వీనర్ బి.రామస్వామి, దేవరాయ సురేష్, శైలేందర్, డాక్టర్ స్టీఫెన్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపీనాథ్



ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో గోషామహల్ బీఆర్ఎస్ నాయకులు

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఇటీవల తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, నాలుగు నెలలోనే అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నదని ఆయన విమర్శించారు. గురువారం గోషామహల్ నియోజక వర్గం నుంచి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్, కోటి శైలేష్ కురుమల ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు ర్యాలీగా తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహానికి మాగంటి గోపీనాథ్‌తో కలిసి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేసీఆర్ సభలో పాల్గొనడానికి వారు బస్సులో సూర్యాపేటకు బయలుదేరి వెళ్లారు.

సంస్థకు ఆదాయం పెరిగేలా ఉద్యోగులు కృషి చేయాలి

ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ వరప్రసాద్

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తూ సంస్థకు ఆదాయం పెంచాలని ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ బి.వరప్రసాద్ ఉద్యోగులకు సూచించారు. గురువారం ఆయన ఫలక్‌నుమా ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆయన, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణికుల పట్ల స్నేహపూర్వకంగా నడుచుకుంటూ రోజూ లక్ష రూపాయల అదనపు ఆదాయం సమకూరేలా అందరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్, అసిస్టెంట్ మేనేజర్ కె.రాజయ్య, అసిస్టెంట్ ఇంజనీర్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులనుద్దేశించి ప్రసంగిస్తున్న వరప్రసాద్

నాటకరంగాన్ని ప్రోత్సహించడం అభినందనీయం

రవీంద్రభారతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా నాటక పోటీలు నిర్వహిస్తూ నటీనటులను ప్రోత్సహించడంతోపాటు రంగస్థల వృద్ధికి పరుచూరి బ్రదర్స్ కృషి చేయడం అభినందనీయమని వక్తలు కొనియాడారు. గురువారం రవీంద్రభారతి లో పరుచూరి రఘుబాబు స్మారక 34వ జాతీయస్థాయి నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి అతిథులుగా ఆచార్య డి.ఎస్.ఎన్.మూర్తి, పరుచూరి గోపాలకృష్ణ, పరుచూరి వెంకటేశ్వరరావు, గుమ్మడి గోపాలకృష్ణ, దైవజ్ఞశర్మ, నటి శివపార్వతి తదితరులు హాజరై పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా డి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ 34 ఏళ్లుగా పరుచూరి రఘుబాబు పరిషత్తులో దాదాపు 600 నాటకాలను ప్రదర్శించారని గుర్తుచేశారు. పరుచూరి రఘుబాబు పేరిట నాటక పోటీలను నిర్వహించి నాటకరంగాన్ని ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. యువ నటీనటులు, దర్శకులు ఇలాంటి వేదికలను ఒక అవకాశంగా మార్చుకుని ముందుకు సాగాలని సూచించారు. వేలాది మంది నటీనటులకు వేదిక కల్పించిన ఘనత పరుచూరి సోదరులదని అన్నారు. రంగస్థల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ తాను సిటీ కాలేజీలో చదువుతున్నప్పుడు దేశంలోనే పేరొందిన రవీంద్రభారతిలో నటించాలని ఉండేదని గుర్తు చేసుకున్నారు. సభానంతరం మొదటి రోజు నాటకాలను ప్రదర్శించారు. రాత నాటికను ప్రదర్శించారు. పోలుదాసు శ్రీనివాసరావు రచన దర్శకత్వం వహించారు. దీంతోపాటు జేబు చెప్పిన ఊసులు నాటక, రైతేరాజు, బూడిద నాటకాలను ప్రదర్శించారు. అన్ని నాటకాలు ఒకటితో ఒకటి పోటీ పడుతూ సాగాయి. చక్కటి నటనతో కళాకారులు ఆకట్టుకున్నారు.



నాటక పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు



అవగాహన ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

మలేరియాపై ప్రజలకు అవగాహన

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వివిధ బస్తీలలో ఎంటమాలజీ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చార్మినార్ జోన్ సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ సతీష్‌రెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బంది ఫలక్‌నుమా, పరిసర బస్తీలలో అవగాహన ర్యాలీ నిర్వహించి మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పించారు. దోమకాటు వల్ల మలేరియా వ్యాధి వ్యాపిస్తుందని, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అరుణ్, సురేశ్, మధుతోపాటు కార్మికులు, బస్తీవాసులు పాల్గొన్నారు.



టోర్నమెంట్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న డాక్టర్ సురేష్

కురుక్షేత్ర-2024 క్రీడా పోటీలు ప్రారంభం

బంజారాహిల్స్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని పెంచేందుకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని జేఎన్ఏఎఫ్ఏఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ డి.సురేష్ అన్నారు. బంజారాహిల్స్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ ఆధ్వర్యంలో కురుక్షేత్ర-2024 క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలను జేఎన్ఏఎఫ్ఏఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ డి. సురేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ మాట్లాడుతూ.. ప్రతియేటా తమ కాలేజీ నుంచి కురుక్షేత్ర పేరుతో ఆర్కిటెక్ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 10 ఆర్కిటెక్ కాలేజీల నుంచి విద్యార్థులు 12రకాల క్రీడల్లో మూడు రోజుల పాటు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ క్రీడా పోటీలు ఎంతో తోడ్పడతాయన్నారు. క్రీడలతో పాటు ఫ్యాషన్ డిజైనింగ్, జర్నలిజం, డిజైనింగ్, ఫొటోగ్రఫీ రంగాల్లో కూడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు. పదేళ్ళుగా ఈ కురుక్షేత్ర ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

ఉప రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ నగర పర్యటన సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని నగర సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉప రాష్ట్రపతి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి జినోమ్ వ్యాలీ వెళతారు. ఆ సమయంలో ఆయా రూట్లలో వాహనాలను నిలిపివేయడం లేదా మళ్లించడం చేస్తారని తెలిపారు. పీఎన్‌టీ ఫ్లైఓవర్, రసూల్‌పురా, సీటీఓ, ప్లాజా, తివోలి క్రాస్‌రోడ్స్, కార్ఖానా, తిరుమలగిరి క్రాస్‌రోడ్స్, లోతుకుంట, అల్వాల్, బొల్లారం చెక్‌పోస్ట్, హకీంపేట వై జంక్షన్, రాజీవ్ రహదారి నుంచి భారత్‌బయోటెక్ వరకు వెళతారు. ఈ సందర్భంగా, కొల్తూరు నుంచి భారత్ బయోటెక్ వరకు వాహనాలను నిలిపి వేస్తారు. కార్యక్రమం ముగిసిన తర్వాత సాయంత్రం 5 గంటలకు ఇదేమార్గంలో ప్రయాణించి రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. ఆ తర్వాత రాజ్‌భవన్ నుంచి బయలుదేరి తాజ్‌కృష్ణా, సాగర్ సొసైటీ, జూబ్లీ చెక్‌పోస్ట్, కేబుల్ బ్రిడ్జి, శిల్పారామం మీదుగా హైటెక్స్ చేరుకుంటారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో శిల్పారామం, కేబుల్ బ్రిడ్జి, పంజాగుట్ట మీదుగా బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఈ సమయాల్లో ఆయా రూట్లలో ప్రయాణించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని ఆయన కోరారు.

సమాజానికి సేవ చేయడంలో వెనుకడుగు వద్దు


సివిల్ సర్వీసెస్ ర్యాంకర్‌ని సత్కరిస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి మేలు చేయడంలో ఎప్పుడు వెనుకడుగు వేయవద్దని కేంద్ర సర్వీసులకు ఎంపికైన వారికి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ సూచించారు. యూపీఎస్సీ పరీక్షల్లో అర్హత సాధించిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థుల్ని గవర్నర్ అభినందించి సత్కరించారు. రాజ్‌భవన్, టీసీ స్టడీ సర్కిల్ సంయుక్తంగా సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో గురువారం నిర్వహించిన ఇన్‌స్పైర్- 2024 కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవలో నిజాయితీ, నిష్పక్షపాతం, చిత్తశుద్ధి పాటించాలని సివిల్స్‌కు ఎంపికైన వారికి గవర్నర్ సూచించారు. గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

అపోలో ఆస్పత్రికి(జేసీఐ) అక్రెడిటేషన్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రి గ్రూప్ మరోసారి జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ద్వారా అక్రెడిటేషన్‌కు ఎంపికైంది. ఈ గౌరవం దక్కడం ఆస్పత్రికి ఇది ఏడోసారి అని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. దీంతో తమ ఆస్పత్రి అత్యధిక జేసీఐ అక్రెడిటేషన్లను కలిగి ఉన్న అతిపెద్ద హాస్పిటల్ నెట్‌వర్క్‌గా అవతరించిందని వారు పేర్కొన్నారు. అపోలో ఆస్పత్రుల గ్రూప్ వైస్‌చైర్మన్ ప్రీతారెడ్డి మాట్లాడుతూ జేసీఐ అక్రెడిటేషన్ మరోసారి అందుకోవడం గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మెరుగైన సంరక్షణలో నిబద్ధతతో కృషి చేయడం వల్లనే ఈ గుర్తింపును అపోలో సాధించిందని, క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ అండ్ పేషంట్ సేఫ్టీ జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ జోయల్ తెలిపారు.

అత్యాచారం చేసి.. తలను నేలకు బాది..

● సీసీటీవీ ఫుటేజీతో మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చిత్తుకాగితాలు ఏరుకునే ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడి.. ఆపై ఆమె తలను నేలకు బాది చంపిన నిందితుడిని కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా సంగారెడ్డిలో ఉంటున్న బిహారీ నిందితులను అరెస్టు చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు వివరాలను వెల్లడించారు. బిహార్‌లోని బంక జిల్లా థానా ప్రాంతానికి చెందిన నితీశ్‌కుమార్ ఓ బాలుడితో కలిసి సంగారెడ్డిలో నివాసముంటున్నాడు. వీరిద్దరూ సంగారెడ్డిలోని తిరుమల బార్ అండ్ రెస్టారెంట్‌లో పనిచేస్తున్నారు. ఈ నెల 20న వీరిద్దరూ బైక్‌పై సికింద్రాబాద్ వెళ్లారు. రాత్రి సమయంలో కూకట్‌పల్లి ప్రశాంతినగర్‌లో టీ తాగేందుకు ఆగారు. ఆ సమయంలో వీరికి ఏపీలోని శ్రీకాకుళానికి చెందిన ఓ మహిళ(42) అక్కడే చిత్తుకాగితాలు ఏరుకుంటూ కనిపించింది. ఆమె వై-జంక్షన్ వైపు వెళ్లడంతో.. నితీశ్, బాలుడు బైక్‌పై ఆమెను వెంబడించారు. ఇద్దరూ కలిసి ఆమెను ఓ కమర్షియల్ బిల్డింగ్‌లోని సెల్లార్‌లోకి తీసుకెళ్లారు. బాలుడు బయట ఉండగా.. సెల్లార్‌లో నితీశ్ ఆమెపై అత్యాచారం చేశాడు. బాధితురాలు తప్పించుకునేందుకు యత్నించగా.. నితిష్ ఆమె తలను బలంగా నేలకేసి కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఓ మహిళ మృతిచెంది పడి ఉందంటూ స్థానికులు ఈ నెల 21న పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ నేతృత్వంలోని బృందం సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించి నిందితుడిని గుర్తించారు. మోటార్‌సైకిల్ నంబర్‌ప్లేట్ ఆధారంగా నిందితులను అరెస్టు చేశారు.

రేవంత్‌కు పాలన చేతకావడం లేదు

● మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి


విలేకరుల సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు

కూకట్‌పల్లి/ఎల్‌బీనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులకు రాష్ట్రాన్ని పరిపాలించడం చేతకావడం లేదని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మెట్రోరైల్‌లో ప్రయాణించి వినూత్న ప్రచారం చేశారు. ఎల్‌బీనగర్ నుంచి కూకట్‌పల్లి వరకు మెట్రోరైల్‌లో ప్రయాణించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని అన్నారు. గడిచిన నాలుగు నెలల కాలంలోనే చెరువులు, పొలాలు ఎండిపోయాయని, మహిళలకు పింఛన్లు రావడంలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనతో రాష్ట్రంలో సునామి వచ్చినట్లు పరిస్థితులు మారిపోయాయని ఎద్దేవా చేశారు. పింఛన్లు, రైతుబంధు, రుణమాఫీ విషయంలో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం మాటతప్పిందన్నారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే సత్తా ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. అనంతరం బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రజలకు రేవంత్‌రెడ్డిపై నమ్మకం పోయిందని అన్నారు. స్థానికుడనైన తనకు ఓటువేసి గెలిపించాలని లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, మల్లేశం, కంటోన్మెంట్ అభ్యర్థి నివేదిత, కూకట్‌పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కోరుకున్న సమానత్వం లేదు

● దేశంలో సంపద కొందరి వద్దే కేంద్రీకృతమైంది

● డా.బి.ఆర్ అంబేడ్కర్ స్మారకోపన్యాసంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. లింబాద్రి


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ.లింబాద్రి, తదితరులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా అంబేడ్కర్ కోరుకున్న సమానత్వం సమాజంలోని అన్ని వర్గాలకు పూర్తిగా రాలేదని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. లింబాద్రి అన్నారు. గురువారం అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 'అంబేడ్కర్ రాజ్యాంగ వాదం- భారత పాలన'పై స్మారకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాలను, పరిపాలనా విభాగాలు, వ్యవస్థలు, వనరులను అందరికీ సమానంగా పంచాలని అంబేడ్కర్ కోరుకున్నారని.. కానీ, దేశంలోని సంపద కొందరి వద్దే కేంద్రీకృతమయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ దూరదృష్టి గల నేత అని, రాజ్యాంగంలో పొందుపర్చిన ఆర్టికల్ 3 ప్రకారమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. డా.బి.అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొ.కె. సీతారామారావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో 25 అడుగుల ఎత్తయిన డా.బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు యూనివర్సిటీ కట్టుబడి ఉందన్నారు. విశ్వవిద్యాలయం అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి. పుష్ప చక్రపాణి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో విశ్వవిద్యాలయం కృషి చేస్తుందన్నారు.

అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ విడుదల

దేశంలో ప్రభుత్వ పరిపాలనాశాస్త్రం 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అంతర్జాతీయ సదస్సును మే 17-18తేదీల్లో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉన్నతవిద్యా మండలి చైర్మన్ ప్రొ.ఆర్. లింబాద్రి, వీసీ ప్రొ.కె.సీతారామారావుతో కలిసి సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ. ఏవీఆర్ఎన్ రెడ్డి, డీన్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, సెమినార్ డైరెక్టర్లు ప్రొ.పల్లవి కబ్డే, కో డైరెక్టర్ ప్రొ.సి.వెంకటయ్య, పలువిభాగాల డైరెక్టర్లు, డీన్లు తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగులకు నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఓయూలో ఘనంగా ఓపెన్ డే ఉత్సవాలు

తార్నాక, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓయూలో మూడు రోజుల పాటు జరిగే ఉస్మానియా తక్ష్ 2024 ఉత్సవాలను గురువారం ఓయూ వీసీ డా. రవీందర్ ఘనంగా ప్రారంభించారు. ఉస్మానియా తక్ష్ 2024లో భాగంగా ల్యాబ్ టు ల్యాండ్ పేరుతో ఆయా కళాశాలల ప్రయోగశాలల్లో జరుగుతున్న పరిశోధనలను సందర్శకులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా ఓపెన్ డే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఓయూ పూర్వ విద్యార్థులతో పాటు, అధ్యాపకులు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు తరలివచ్చి.. విద్యార్థులు రూపొందించిన నమూనాలతో పాటు, ల్యాబ్‌లను ఆసక్తిగా పరిశీలించారు. దాంతో ఓయూ పరసర ప్రాంతాల్లో పూర్తిగా సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. పి.లక్ష్మీనారాయణ, ఓఎస్డీ రెడ్యానాయక్, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. అర్జున్‌రావు కుతాడి, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.డి.శ్రీరాములు పాల్గొన్నారు.

దడ్.. దడ..!

(5వ పేజీ తరువాయి)

ఆందోళనకు గురి చేస్తోంది. ఇదే సమయంలో రోడ్లపై వెళ్తున్న వాహనదారులు కూడా పిల్లర్లపై నుంచి వస్తున్న ధ్వనితీవ్రతకు హడలిపోతున్నారు.

ఇప్పుడైనా మేల్కొంటారా..?

దేశంలోని చెన్నయ్ మెట్రోరైళ్లలో ధ్వని తీవ్రత 40 నుంచి 75 డెసిబుల్స్ ఉన్నట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. ఢిల్లీలోని రెసిడెన్షియల్ ఏరియాల్లో 55 డెసిబుల్స్, కమర్షియల్, ఇండస్ట్రియల్ ఏరియాల్లో 75 ఉంది. హైదరాబాద్‌లో మాత్రం అన్ని ప్రాంతాల్లో 80 డెసిబుల్స్ ఉండడంతో సమస్యలు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. రైళ్లు స్టేషన్ల వద్దకు చేరుకుంటున్న సమయంలో ధ్వని అధికంగా ఉండడంతో రక్తపోటు పెరుగుతోందని సికింద్రాబాద్‌కు చెందిన వెంకటేశ్వర్లు తెలిపారు. ధ్వని కాలుష్యంపై హైకోర్టు వివరణ అడిగిన నేపథ్యంలో మెట్రో అధికారులు ఇప్పుడైనా నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.


మధుయాష్కిగౌడ్ తల్లి అనసూయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

మధుయాష్కిగౌడ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శ

హైదరాబాద్/హయత్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీపార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్‌ను గురువారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పరామర్శించారు. మధుయాష్కి గౌడ్ తల్లి అనసూయ ఇటీవలే కన్నుమూశారు. గురువారం అనసూయ దశదినకర్మ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి హయత్‌నగర్‌లోని మధుయాష్కిగౌడ్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు. సీఎంతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి, రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, తదితరులు అనసూయ చిత్రపటానికి నివాళులర్పించారు.

నార్సింగ్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం

నార్సింగ్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ మున్సిపల్ చైర్మన్ రేఖ, వైస్ చైర్మన్ వెంకటేశ్ యాదవ్‌లపై కౌన్సిలర్లు అవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ తీర్మాన పత్రాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు ఏకమై ఈ అవిశ్వాస తీర్మానంపై సంతకం చేశారు. సంతకం పెట్టిన వారిలో బీఆర్ఎస్ పార్టీ నుంచి గోపాల సునీత, గంగిడి శివారెడ్డి, పత్తి ప్రవీణ్‌కుమార్, కోటిగారి ఉషారాణి ఉండగా.. బీజేపీ నుంచి ఆదిత్యరెడ్డి, లంకెల పద్మ ఉన్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి గోపాలవిజయ్, దుర్గేశ్‌యాదవ్, కొల్లూరు లక్ష్మీ ప్రవళిక, మైలారం నాగపూర్ణ, అమరేందర్‌రెడ్డి, నరేశ్ ఉన్నారు. ఓటింగ్ కోసం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రత్యేక తేదీని నిర్ణయించనున్నారు.

మంగళ్‌హాట్ డీఐ సస్పెన్షన్

● ఉత్తర్వులు జారీ చేసిన సీపీ


మహేందర్ రెడ్డి

హైదరాబాద్ సిటీ/అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నేరగాళ్లతో దోస్తీ చేసి, వారికి అండగా నిలవడమే కాకుండా, బర్త్‌డే పార్టీలో వారితో కలిసి చిందులేసిన మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డిపై వేటు పడింది. నేరస్థులతో కలిసి బర్త్‌డే పార్టీలో పాల్గొన్న వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సస్పెండ్ చేశారు. గత ఏడాది కాలంగా మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో డీఐగా పనిచేస్తున్న మహేందర్ రెడ్డిపై పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఇతడు గ్యాంబ్లింగ్ హౌస్ (పేకాట స్థావరాల) నిర్వాహకులతో చెట్టాపట్టాలు, గంజాయి విక్రేతలు, సట్టా నిర్వాహకులు, రౌడీషీటర్లు, బెల్ట్ షాపుల నిర్వాహకులతో దోస్తీ పెట్టుకున్నాడు. మహేందర్‌రెడ్డి గంజాయి విక్రేతలతో స్నేహంగా ఉంటూ వారికి రక్షణగా ఉన్నాడన్న ఆరోపణలు కూడా వచ్చాయి. వీటికి బలం చేకూరేలా సదరు డీఐ మహేందర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు, పేకాట స్థావరంలో జరుపుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఉన్నతాధికారులు అంతర్గత విచారణ జరిపిన అనంతరం డీఐ మహేందర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు.

57 మంది చొప్పున..!

(5వ పేజీ తరువాయి)

తరపున దానం నాగేందర్, బీజేపీ నుంచి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా పద్మారావుగౌడ్, హైదరాబాద్‌లో కాంగ్రెస్ నుంచి మహ్మద్ వలియుల్ల సమీర్, బీజేపీ తరఫున మాధవీలత కొంపల్లె, ఎంఐఎం నుంచి అసదుద్దీన్ ఓవైసీ, బీఆర్ఎస్ నుంచి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ నామినేషన్లు వేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీ ర్యాలీలు, రోడ్ షోలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికల్లో గెలిపించాలని ఇష్టదైవాలను ప్రార్థించారు. దానం నాగేందర్ నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ దాఖలు ర్యాలీకి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, కిషన్‌రెడ్డి నామినేషన్ దాఖలుకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, మాధవీలత నామినేషన్ దాఖలుకు అనురాగ్‌సింగ్ ఠాగూర్‌లు పాల్గొన్నారు.

మల్కాజిగిరికి 114 మంది

మేడ్చల్, రంగారెడ్డిఅర్బన్ : మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు మొత్తం 114 మంది అభ్యర్థులు 177 నామినేషన్ పత్రాలను దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఫైల్‌నేమ్ : నామినేషన్లు

చేవెళ్లకు 66 మంది

చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 66 మంది అభ్యర్థులు 87 సెట్లు దాఖలు చేశారు. చివరిరోజైన గురువారం 31 మంది నామినేషన్లు వేశారు.

సాధారణ, వ్యయ పరిశీలకులు వీరే

(5వ పేజీ తరువాయి) సిబ్బందిని సమీకరణ తదితర వివరాలు అడిగి తెల్సుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ ఎన్నికల ఏర్పాట్లను వారికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

నియోజకవర్గాల వారీగా పరిశీలకులు

పరిశీలకుడి పేరు	నియోజకవర్గం	ఫోన్ నంబర్
డాక్టర్ సరోజ్‌కుమార్ (సాధారణ)	సికింద్రాబాద్	9154342022
అమిత్‌శుక్లా (వ్యయ)	సికింద్రాబాద్	9154342028
పీఐ శ్రీవిద్య (సాధారణ)	హైదరాబాద్	9154342023
సెంథిల్ కుమరన్(వ్యయ)	హైదరాబాద్	9154342027
శశాంక్ ఆనంద్(పోలీస్)	సికింద్రాబాద్, హైదరాబాద్	9154342168
ప్రియాంక శుక్లా (సాధారణ)	మల్కాజ్‌గిరి	7337047776
అమిత్‌శుక్లా (వ్యయ)	మల్కాజ్‌గిరి	9154342028

డ్రగ్స్, బ్యాంక్ ఖాతాల పేరుతో రిటైర్డ్ ఉద్యోగికి బెదిరింపు

● రూ. 50 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ/హిమాయత్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు రిటైర్డ్ ఉద్యోగి ఖాతా నుంచి రూ. 50 లక్షలు కాజేశారు. సికింద్రాబాద్ ప్రాంతంలో ఉంటున్న రిటైర్డ్ ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. తమను తాము ఫెడెక్స్ అధికారులమని మీ పేరున ఓ కొరియర్ సర్వీసెస్‌లో ఓ పార్సిల్ వచ్చింది. అందులో 7 పాస్‌పోర్టులు, 7 క్రెడిట్ కార్డులు, 7 కిలోల దుస్తులతోపాటు 10 ఎల్ఎస్‌డీ స్ట్రిప్పులు ఉన్నాయని దీని గురించి, ముంబై క్రైం బ్రాంచి పోలీసులకు సమాచారమిచ్చామని చెప్పారు. వెంటనే బాధితుడికి స్కైప్ వీడియో కాల్‌లో ముంబై సైబర్ క్రైం అధికారిగా పరిచయం చేసుకున్న వ్యక్తి మాట్లాడాడు. మీ ఆధార్‌కు అనుసంధానంగా 20 బ్యాంకు ఖాతాలున్నాయని, మీరు నిర్వహించే ఒక్క ఖాతా వివరాలు చెప్పి, మీ మొత్తం డబ్బును జమ చేయాలని సూచించారు. ఇలా చేస్తే ఆధార్‌కు లింక్ అయిన ఇతర ఖాతాలను సీజ్ చేస్తామని చెప్పారు. వారి సూచనల మేరకు ఇతర బ్యాంకుల నుంచి డబ్బును హెచ్‌డీఎఫ్‌సీ ఖాతాకు మార్చి, ఖాతా వివరాలను ఇచ్చాడు. ఈ వివరాలతో సైబర్ నేరగాళ్లు బాధితుడి ఖాతా నుంచి రూ. 49,35,134ను తమ ఖాతాల్లోకి మార్చుకున్నారు. దాంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఓటీపీ అవసరం లేదంటూ మాటల్లో పెట్టి..

కేవైసీ అప్‌డేట్ పేరుతో నగరానికి చెందిన మహిళ (65) నుంచి సైబర్‌నేరగాళ్లు రూ. 1.15 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన మహిళకు ఫోన్ చేసిన సైబర్ నేరగాడు తాను ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్‌నంటూ పరిచయం చేసుకున్నాడు. ఖాతా వివరాలు చెప్పి కేవైసీ చేయించుకోవాలని కోరాడు. తర్వాత 20 నిమిషాలకు ఫోన్ చేసి ఖాతా అప్‌డేట్ అయిందని, వివరాలు సరిపోల్చుకోవాలని చెబుతూ మాటల్లో పెట్టి కొత్తగా వచ్చిన ఓటీపీ వివరాలు తెలుసుకున్నాడు. బాధితురాలు బ్యాంక్‌ను సంప్రదించి చూడగా ఖాతాలోని రూ. 1,15,517ను కాజేసినట్లు గుర్తించి, సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పచ్చ చీర కట్టుకుని.. వైఎస్ శత్రువు ఇంటికి వెళ్లారు

» బురద చల్లేందుకు ఇద్దరు చెల్లెళ్లను

» ఎవరు పంపించారో మీకు తెలుసు

» వీళ్లా వైఎస్ఆర్ వారసులు?: జగన్

» షర్మిల, సునీతపై పరోక్ష విమర్శలు

» వైఎస్ అవినాశ్ చిన్నపిల్లాడని వ్యాఖ్య

కడప, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): "వైఎస్ ఎవరితో పోరాడారో, అలాంటి శత్రువుల ఇంటికి పసుపు చీర కట్టుకుని వెళ్లారు. వారి స్క్రిప్ట్‌లను మక్కీకి మక్కీ చదివి వినిపిస్తూ, వారి కుట్రలో భాగమవుతున్నారు. వీళ్లా వైఎస్సార్ వారసులు? వైఎస్ విగ్రహాలు గ్రామంలో ఉండకూడదని చెప్పిన వారితో చెట్టాపట్టాలేసుకున్నారు" అని ఏపీ సీఎం జగన్ తన చెల్లెళ్లు షర్మిల, సునీతను పరోక్షంగా విమర్శించారు. నామినేషన్ వేసేందుకు గురువారం తాడేపల్లి నుంచి పులివెందులకు చేరుకున్న ఆయన.. అక్కడ బహిరంగ సభలో మాట్లాడారు. "జగన్ అధికారంలోకి వచ్చాక మమ్మల్ని పక్కనబెట్టాడని మాట్లాడుతున్న నా బంధువులకు తెలియజేస్తున్నా"నంటూ షర్మిల, సునీత పేర్లను ప్రస్తావించకుండా నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. షర్మిల తన కుమారుడి పెళ్లి శుభలేఖ ఇవ్వడానికి చంద్రబాబు ఇంటికి వెళ్లిన సందర్భాన్ని ప్రజలకు గుర్తుచేశారు. 'అవినాశ్ ఏ తప్పూ చేయలేదని బలంగా నమ్మాను కాబట్టే అతడికి టికెట్ ఇచ్చాను. మా అందరి కన్నా చిన్నపిల్లాడు అవినాశ్. ఆ పిల్లాడి జీవితం నాశనం చేయాలని పెద్దపెద్దవాళ్లంతా కుట్రలు చేస్తున్నారు. వివేకా హత్య కేసు విషయంలో అవినాశ్ అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేని వీరంతా ఈ చిన్నపిల్లాడిని దూషించడం, తెరమరుగు చేయాలనుకోవడం దారుణం. అసలు వీరందరూ మనుషులేనా?" అన్నారు. "బురద చల్లేందుకు ఇద్దరు చెల్లెమ్మలను ఎవరు పంపించారో, వారి వెనకాల ఎవరున్నారో మీకు తెలుసు" అని ప్రజలనుద్దేశించి అన్నారు.

సభ్యత, సంస్కారం ఉన్నాయా?

» నేను కట్టుకున్న చీర గురించి మగవాళ్ల ముందు మాట్లాడతావా?

» జగన్‌పై షర్మిలారెడ్డి ఫైర్



గుంటూరు/విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): 'సీఎం స్థాయిలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభ పెట్టి.. వేల మంది మగవాళ్లు ఉంటే.. నేను కట్టుకున్న చీర గురించి మాట్లాడాడు' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ధ్వజమెత్తారు. మాట్లాడుతున్నది సొంత చెల్లెలి గురించి అన్న ఇంగితం కూడా లేకుండా తన వంటిపై ఉన్న బట్టల గురించి ప్రస్తావించారంటే ఎంత దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారో ఆలోచించాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం గుంటూరు, విజయవాడల్లో జరిగిన ప్రచార సభల్లో ఆమె ప్రసంగించారు. పులివెందులలో తనపై జగన్ చేసిన వ్యాఖ్యలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'నేను పసుపు చీర కట్టుకొన్నానని అవహేళనగా మాట్లాడారు. ఏం.. పసుపు చీర కట్టుకోకూడదా? చంద్రబాబు ఏమైనా పసుపు రంగు కొన్నారా? జగన్ ఒక విషయాన్ని మరిచిపోయినట్లున్నారు. జగన్ పత్రికలో పసుపు రంగు ఉంటుంది. దానికి వైఎస్ ఆనాడు చెప్పిన మాట.. పసుపు అంటే మంగళకరమైన రంగు. అది టీడీపీది కాదని పెట్టించారు' అని తెలిపారు. సొంత చెల్లి చీర గురించి మాట్లాడుతున్న వీరికి సభ్యత, సంస్కారం ఉన్నాయా అని విరుచుకుపడ్డారు. ఇంకా ఆమె ఏమన్నారంటే..

దేవుడు మీకు ఇంగితం ఇవ్వలేదా?

సీఎం జగన్ ఈ రోజున పులివెందుల సభలో వివేకానందరెడ్డి ప్రస్తావన చేశారు. ఆయన గురించి ఒక్క మంచి మాట కూడా నోటి వెంట రాలేదు. వివేకానందరెడ్డికి రెండో పెళ్లి అయిందట. ఇంకో సంతానం ఉందట! అంతేతప్ప.. వివేకానందరెడ్డి ఒక ప్రజానాయకుడని గానీ.. ఎవరైనా సమస్యతో వస్తే ఉత్త చేతులతో పంపడని గానీ.. రాజశేఖర్‌రెడ్డి తమ్ముడని గానీ... ఆఖరి నిమిషం వరకు వైసీపీ కోసమే పని చేశారని గానీ ఒక్క మాటయినా జగన్ నోట్లో నుంచి రాలేదంటే ఎంత ఆశ్చర్యం! అవినాశ్‌రెడ్డి అమాయకుడు, చిన్నవాడంట! ఆయన భవిష్యత్‌ను మేం నాశనం చేస్తున్నామని జగన్ మాట్లాడుతున్నారు. అతడి భవిష్యత్‌ను పాడు చేసేవాళ్లమే అయితే మీరు ఎంపీగా నిలబెట్టినప్పుడు.. వివేకా వద్దు వద్దని చెప్పినా మేమెవరం కాదనలేదే! వివేకాను చంపిన రోజునే అవినాశ్ చంపాడని చెప్పలేదే! అవినాశ్ మంచివాడని నమ్ముతున్నాను.. అందుకే ఎంపీ టికెట్ ఇచ్చానని జగన్ అంటున్నారు. ఎందుకు గుడ్డిగా నమ్ముతున్నారు? మీకు దేవుడు ఇంగితం ఇవ్వలేదా? మీకు ఆలోచించే శక్తి లేదా? సీబీఐ అన్ని ఆధారాలు చూపిస్తోంది కదా! చంపించిన వారు, చంపినవారి గూగుల్ టేక్ అవుట్స్ మ్యాచ్ అవుతున్నాయి. లావాదేవీలు జరిగాయి. అడ్వాన్స్‌లు తీసుకున్నారని సీబీఐ చెబుతున్నా ఎందుకు అవినాశ్‌ను ఇంకా నమ్ముతున్నారు? అన్నీ తెలిసి కూడా కాపాడుతున్నారంటే మీకు ఏమి అవసరం ఉందో చెప్పాలి. అవినాశ్‌ను నిందితుడిగా సీబీఐ చేర్చినా ఎందుకు కాపాడారు.. మళ్లీ ఎందుకు టికెట్ ఇచ్చారో చెప్పాలి.

వివేకా హత్యపై లైవ్ డిబేట్‌కు సిద్ధం

» మీ చానల్‌కే వస్తా.. మీరు సిద్ధమా?

» సీఎం జగన్‌కు డాక్టర్ సునీత సవాల్

» గాయానికి బ్యాండ్ తీయాలని సలహా

» లేకుంటే చీము పడుతుందని హెచ్చరిక

పులివెందుల రూరల్, ఏప్రిల్ 25: "వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు అవినాశ్‌రెడ్డి నిర్దోషి అని మీరు అంటున్నారు. ఇక ఏ వ్యవస్థపై మీకు నమ్మకముంది సార్?" అని ఏపీ సీఎం జగన్‌ను ఆయన చెల్లెలు, వివేకా కుమార్తె డాక్టరు సునీత సూటిగా ప్రశ్నించారు. పులివెందుల సభలో అవినాశ్‌రెడ్డిని జగన్ చిన్నపిల్లాడుగా సంబోధించడంపై సునీత స్పందించారు. చిన్నపిల్లాడైతే స్కూలుకు పంపించాలన్నారు. పులివెందులలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. "ఎంపీ అంటే బాధ్యత.. పిల్లలకు టికెట్లు ఇవ్వరు. నిందితులను మూడోసారి ఎంపీగా పోటీ చేయిస్తున్నారు. సీబీఐ నిందితులుగా తేల్చిన వారిని మీరు ప్రోత్సహిస్తున్నారు. దయచేసి ఇలా చేయకండి" అని కోరారు. "మీకోసం వివేకా ఎన్నో త్యాగాలు చేశారు. కానీ మీరేం చేశారు? ఆయన గురించి మంచిగా ఒక్కమాట కూడా మాట్లాడరు. ఆయన హత్యపై మీ చానల్‌లో లైవ్ డిబేట్ ఏర్పాటు చేయండి. నేను సిద్ధం. మీరు సిద్ధమా..?" అని జగన్‌కు సవాల్ విసిరారు. అలాగే.. గులకరాయి ఘటన జరిగినప్పటి నుంచీ తలకు బ్యాండేజ్ వేసుకుని తిరుగుతున్న జగన్‌కు ఆమె డాక్టర్‌గా ఓ సలహా ఇచ్చారు. దెబ్బతగిలిన చోట బ్యాండ్ ఎయిడ్ పెట్టుకుంటే లోపల చీము పట్టి, సెప్టిక్ అయ్యే చాన్స్ ఉందని హెచ్చరించారు. బ్యాండ్ ఎయిడ్ తీసేస్తే గాయం త్వరగా మానిపోతుందని తెలిపారు.

జగన్.. నీకిది తగునా?

» నీ సొంత మీడియాలోనే మీ చిన్నాన్న వ్యక్తిత్వ హననమా?

» సీఎం జగన్‌కు వివేకా సతీమణి సౌభాగ్యమ్మ లేఖ




పులివెందుల, ఏప్రిల్ 25: "నిన్ను సీఎంగా చూడాలని తపించిన మీ చిన్నాన్న వ్యక్తిత్వాన్ని మీ పత్రికల్లో, టీవీల్లో, సోషల్ మీడియాలో హననం చేయడం తగునా? న్యాయం కోసం పోరాడుతున్న నీ చెల్లి సునీత.. ఆమెకు మద్దతు ఇస్తున్న షర్మిలపై నిందలు మోపుతుంటే.. కుటుంబ సభ్యునిగా కాకపోయినా.. ముఖ్యమంత్రిగా అయినా ఇదేనా నీ కర్తవ్యం?" అని సీఎం జగన్‌ను వివేకా భార్య వైఎస్ సౌభాగ్యమ్మ ప్రశ్నించారు. ఈ మేరకు ఆమె సీఎంకు రాసిన బహిరంగ లేఖను గురువారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. "2009లో తండ్రి చనిపోయినపుడు నువ్వు ఎంత వేదనను అనుభవించావో 2019లో నీ చెల్లి సునీత కూడా అంతే వేదన అనుభవించింది. అప్పటినుంచి జరిగిన పరిణామాల్లో మమ్మల్ని ఎక్కువ బాధించిన విషయం.. మన కుటుంబంలోని వారే ఈ హత్యకు కారకులు కావడం... వాళ్లకు నువ్వు రక్షణగా ఉండటం. నిన్ను సీఎంగా చూడాలని తపించిన చిన్నాన్నపై మీ సొంత మీడియా, పార్టీ వర్గాలు తీవ్ర విమర్శలు చేశాయి. మాటల్లో చెప్పలేనంత విధంగా వ్యక్తిత్వ హననం చేయడం, చేయించడం నీకు తగునా? న్యాయం కోసం పోరాటం చేస్తున్న నీ చెల్లెలు సునీతను హేళన చేస్తూ, నిందలు మోపుతూ, దాడులకు కూడా తెగబడే స్థాయికి కొంత మంది దిగజారుతుంటే నీకు ఏమాత్రం పట్టడం లేదా? సునీతకు మద్దతుగా నిలిచి పోరాడుతున్న షర్మిలను కూడా టార్గెట్ చేస్తుంటే నువ్వు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం ఏమిటి? కుటుంబ సభ్యునిగా కాకపోయినా రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇదేనా నీ కర్తవ్యం? ఇంకా బాధించే విషయం.. హత్యకు కారకులైన వారికి మళ్లీ పోటీ చేసే అవకాశాన్ని నువ్వు కల్పించడం. ఇది సముచితమా? ఇటువంటి చర్యలు నీకు ఏమాత్రం మంచిది కాదు. హత్యకు కారకుడైన నిందితుడు నామినేషన్ దాఖలు చేశాడు. చివరి ప్రయత్నంగా న్యాయం, ధర్మం గురించి ఆలోచించమని నిన్ను అర్థిస్తున్నా. రాగద్వేషాలకు అతీతంగా పరిపాలన చేస్తానని ప్రమాణం చేసిన ముఖ్యమంత్రిగా న్యాయం, ధర్మం, నిజంవైపు నిలబడమని వేడుకుంటున్నా" అని సౌభాగ్యమ్మ తన లేఖలో పేర్కొన్నారు.

నర్మదానదిని 'రేవా నది' అని కూడా వ్యవహరిస్తారు. పుష్కర నదుల్లో నర్మద ప్రత్యేకమైనది. ఇది రుద్రసంభవ... అంటే సాక్షాత్తూ శివుని శరీరం నుంచి ఆవిర్భవించింది. 'నామృతా నర్మదా' అంటారు. అంటే మృతము లేనిది, శాశ్వతమైనది అని అర్థం.



విశేషం



నమామి దేవి నర్మదే!

సృష్టిలోని ప్రతి జీవికి నీరే ఆధారం. అందుకే 'ఆపోమయః ప్రాణః' అన్నారు పూర్వులు. 'ప్రాణం జలమయం' అన్నది ఛాందగ్యోపనిషత్తు. అటువంటి ప్రాణదాయకమైన నీటితో ప్రవహించేవి నదులు. అందుకే భారతీయ సంస్కృతిలో నదులను మాతృస్వరూపాలుగా భావిస్తారు. మనిషి మనుగడ కూడా నదీతీరాల్లోనే మొదలయింది. ఎన్నో నదులు మన దేశానికి జీవనరేఖలుగా... నిరంతరం ప్రవహిస్తున్నాయి. పాడి పంటలకు దోహదం చేస్తూ ఆహారాన్నీ, ఆరోగ్యాన్నీ, దేహశుద్ధినీ, ఆధ్యాత్మికంగా అంతిమ ఆకాంక్ష అయిన ముక్తినీ ప్రసాదిస్తున్నాయి. అటువంటి వాటిలో కొన్ని నదులు పుష్కర సమయంలో మరింత పవిత్రమవుతాయనీ, పాపాలను హరిస్తాయనీ, ఓషధీ గుణాలతో నిండి రోగ నివారకాలు అవుతాయనీ తరతరాలుగా విశ్వాసం ఉంది.

పుష్కరం అంటే పవిత్ర సమయం. ఒక్కో నదికి ఇది పన్నెండు సంవత్సరాలకు ఒకసారి వస్తుంది. ఆ సమయంలో చేసే నిత్య నైమిత్తిక కర్మలు, స్నానాలు, దానాలు, పితృకర్మలు విశేష ఫలితాలు ఇస్తాయనీ పురాణాలు చెబుతున్నాయి. ప్రత్యేకించి పన్నెండు పవిత్రమైన నదులకు పుష్కరాలు జరుగుతాయి. వాటిని స్మరించినంత మాత్రానే పాపాలు తొలగుతాయనేది అనాది నమ్మకం. అందుకే స్నానం చేసే సమయంలో సంకల్పం చెప్పుకొంటూ... ఆ నదీమతల్లులను స్మరించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అవే గంగ, యమున, సరస్వతి, సింధు, నర్మద, గోదావరి, కృష్ణ, తుంగభద్ర మొదలైనవి. ఆ నదుల కోరిక మేరకు... ఏడాదికి ఒక నదిలో నివసించడానికి పుష్కరుడు (వరుణుడు) అంగీకరించాడని, నవగ్రహాల్లో శుభుడైన గురుడు (బృహస్పతి) ఒక రాశి నుంచి మరొకరాశికి మారుతున్నప్పుడు... అతనితో పాటు సంబంధిత నదిలోకి పుష్కరుడితో పాటు, బ్రహ్మాది దేవతలు ఆ నదిలో కొలువవుతారనీ కథ ఉంది. ఈ ఏడాది చైత్ర బహుళ అష్టమి నాడు (మే ఒకటిన) గురువు మేష రాశి నుంచి వృషభ రాశిలోకి ప్రవేశిస్తాడు. అప్పుడు నర్మదానదికి పుష్కరాలు ఆరంభమవుతాయి. గురు ప్రవేశం తరువాత... ఆ నదిలో తొలి పన్నెండు రోజులు చేసే స్నానాలు, నదీతీరాల్లో చేసే దానాలు, పితృకర్మలకు విశేష ఫలితాలు లభిస్తాయి.

నర్మదానదిని 'రేవా నది' అని కూడా వ్యవహరిస్తారు. పుష్కర నదుల్లో నర్మద ప్రత్యేకమైనది. ఇది రుద్రసంభవ... అంటే సాక్షాత్తూ శివుని శరీరం నుంచి ఆవిర్భవించింది. 'నామృతా నర్మదా' అంటారు. అంటే మృతము లేనిది, శాశ్వతమైనది అని అర్థం. వింధ్య పర్వత శ్రేణిలో... తూర్పున అమర్‌కంటక్‌లో ఆవిర్భవించి, పశ్చిమ దిశగా... మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్‌లలో వేలాది మైళ్ళు ప్రవహించి... పారిశ్రామిక నగరమైన సూరత్‌ను అక్కున చేర్చుకొని, అరేబియా సముద్రంలో సంగమించే నర్మదా నదీ తీరంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు, పారిశ్రావి ుకవాడలు, పాడిపంటలకు




నెలవైన ఊళ్ళు ఉన్నాయి. స్వయంసిద్ధమైన, శివ స్వరూపాలుగా భావించే బాణలింగాలకు కాణాచి నర్మదా నది.

మే ఒకటి నుంచి నర్మదా పుష్కరాలు

సుప్రసిద్ధమైన ఓంకార క్షేత్రం కూడా నర్మదా తీరంలోనే ఉంది. వింధ్యపర్వత రాజు (వింధ్యుడు) శివుడి కోసం ఘోరమైన తపస్సు చేశాడు. శివుడు అతనికి సాక్షాత్కరించగా... తనపై కొలువు ఉండాలని కోరాడు. వింధ్యుడి కోరికను మన్నించిన శివుడు... ఓంకారేశ్వరుడిగా వెలిశాడు. ఓంకారేశ్వర లింగం ద్వాదశ జ్యోతిర్లింగాలలో ప్రసిద్ధమైనది. ఇక... వింధ్యుడు ఆరాధించిన పార్థివ లింగం... అమరేశ్వరుడిగా పూజలందుకుంటున్న క్షేత్రం... అమరేశ్వరంగా ప్రసిద్ధమయింది. ఇవి రెండూ నర్మదకు ఇరువైపులా ఉంటాయి.

ఆది శంకరులు తన గురువైన గోవింద భగవత్పాదులను కలిసి, సన్యాస దీక్ష స్వీకరించిన ప్రదేశంగా ఓంకారేశ్వర్ ప్రసిద్ధి. అక్కడ గోవింద భగవత్పాదుల గుహ ఉంది. అలాగే అహల్యాబాయి రాజధాని మాహిష్మతి (మహేశ్వరం) లాంటి ఎన్నో ప్రదేశాలు నర్మదా పరీవాహక ప్రాంతంలో ఉన్నాయి. అంతటి ప్రసిద్ధమైన నర్మదానదిని పుష్కర సమయంలో సందర్శించి, భక్తి శ్రద్ధలతో స్నానాలు, దానాలు, ధ్యానాలు, పితృకర్మలు ఆచరిస్తే అనంతమైన ప్రయోజనాలు సిద్ధిస్తాయనేది పెద్దలమాట.


• ఆయపిళ్ళ రాజపాప



చింతన

సాధన ఫలించాలంటే..

ఏదైనా సాధించాలంటే గట్టి ప్రయత్నం, ఏకాగ్రత, ఓర్పు అవసరం. 'సతు దీర్ఘకాల నైరంతర్య సత్కారాసేవితో దృఢభూమిః' అంటాడు పతంజలి మహర్షి తన యోగశాస్త్రంలో. చేసే అభ్యాసం దీర్ఘకాలం, నిరంతరం కొనసాగాలి. అలా శ్రద్ధతో చేసే కృషి మాత్రమే సత్ఫలితాలను ఇస్తుంది. చక్కగా, చాలాకాలం, విరామం లేకుండా ఆచరించే సాధన స్థిరంగా ఉంటుంది. దానికోసం మొదట కావలసిన యోగ్యత... చాలాకాలం కొనసాగించడం.. దురదృష్టవశాత్తూ మనం అందరం సత్వర ఫలితాలు కలగాలని ఆశిస్తాం. ఏదైనా మంత్రాన్ని జపించమని సలహా ఇస్తే... ఇంటికి వెళ్ళి, దాన్ని మూడు రోజులు జపించి, ఏ ఫలితాలూ రాలేదని చింతిస్తాం. "ఆ మంత్రం నాకు తగినది కాదేమో, మరొకటి ఉపదేశిస్తారా?" అని అడుగుతాం. పదేళ్ళుగా అప్పుడప్పుడు యోగాభ్యాసం చేస్తున్నా... ఏ ప్రయోజనం లభించలేదని చింతిస్తాం. 'నిరంతరం' అనే మాట మరచిపోయి, కావలసినన్ని విరామాలు తీసుకుంటాం. మరో అతి ముఖ్యమైన అంశం సహనం. మనఃపూర్వకంగా, శ్రద్ధతో, ఏకాగ్రతతో, పట్టుదలతో సాధన కొనసాగించాలి. దాని కోసం చేసే కృషి పట్ల విశ్వాసం ఉండాలి. మనకు ఏదైనా కావాలనుకున్నప్పుడు ఏం చేస్తాం? నిద్రాహారాలు సైతం మానేసి, అహోరాత్రులూ దానికోసం శ్రమిస్తాం. ప్రాపంచికమైన వాటికోసమే ఇంత తపన పడితే... మరి ఆధ్యాత్మిక సాధన కోసం ఇంకెంత కష్టపడాలి?



దీనికి సంబంధించిన పూర్వకాలం కథ ఒకటి ఉంది. దేవర్షి అయిన నారదుడు ఒకనాడు అడవిలోంచి ప్రయాణం చేస్తున్నాడు. ఈ భూమి మీద జరిగే విశేషాలు గమనించాలనేది ఆయన ఉద్దేశం. మార్గమధ్యంలో ఆయనకు తపస్సు చేసుకుంటున్న వ్యక్తి కనిపించాడు. అతని చుట్టూ చీమల పుట్టలు పెరిగాయి. ఆ యోగి నారదుణ్ణి గుర్తుపట్టి, నమస్కరించాడు. "స్వామీ! ఎక్కడికి మీ ప్రయాణం?" అని అడిగాడు.

"వైకుంఠానికి. విష్ణు దర్శనానికి" అని బదులిచ్చాడు నారదుడు.

"అయితే మీరు నాకొక ఉపకారం చేస్తారా?" అని అడిగాడు యోగి.

"తప్పకుండా! నీకేం కావాలి?" అని ప్రశ్నించాడు నారదుడు.

"నేను చాలాకాలంగా ఈ అరణ్యంలో కూర్చొని తపస్సు చేస్తున్నాను. నేను ఇంకా ఎన్నాళ్ళు ఇలా తపస్సు చెయ్యాలి? మహా విష్ణువును అడిగి... నాకు ఎప్పుడు ఆయన లోకంలో స్థానం లభిస్తుందో కనుక్కోగలరా?"

"అలాగే. తప్పకుండా కనుక్కుంటాను" అని నారదుడు భరోసా ఇచ్చి, ముందుకు సాగిపోయాడు.

కొన్ని యోజనాలు నడిచిన తరువాత... మరొక వ్యక్తి ఆయనకు కనిపించాడు. అతను ఎంతో పారవశ్యంతో విష్ణు సహస్రనామ సంకీర్తన చేస్తూ... తనలో తానే ఆనందిస్తున్నాడు. అతను నారదుణ్ణి చూసి "మహర్షీ! ఎక్కడిదాకా మీ పయనం?" అని అడిగాడు.

"వైకుంఠానికి. శ్రీమహావిష్ణువు దర్శనం నిమిత్తం" అన్నాడు నారదుడు.

"ఓహో! ప్రశస్తంగా ఉంది. నేనింకా ఎంతకాలం ఈ ధ్యానం కొనసాగించాలి? ఈ జనన మరణ చక్రం నుంచి నాకు విముక్తి ఎప్పుడో విష్ణులోకంలో అడుగుతారా? ఈ సహాయం చెయ్యగలరా?"

"సరే! తప్పకుండా అడుగుతాను. నా తిరుగు ప్రయాణంలో చెబుతాను" అని నారదుడు వెళ్ళిపోయాడు.

కొన్ని సంవత్సరాల తరువాత దేవర్షి అదే అరణ్యానికి మళ్ళీ వచ్చాడు. మొదటి వ్యక్తిని కలిశాడు. అతను నారదుడితో "మహాత్మా! పూర్వం నేను అడిగిన ప్రశ్నకు సమాధానం కనుక్కున్నారా? పరమాత్మ ఏమన్నారు?" అని అడిగాడు.

"ముక్తికోసం నీవు ఇంకా నాలుగు జన్మలు ఎత్తాలని మహా విష్ణువు చెప్పాడు" అన్నాడు నారదుడు.

"ఇంకా నాలుగు జన్మలు ఎత్తాలా? నేను తగినంత కాలం ధ్యానం చేశాను కదా! ఇంకా నాలుగు జన్మలేవిటి?" అని అతను గట్టిగా రోదిస్తూ... తపస్సునూ, అడవినీ వదిలేసి... తన పూర్వ సంసార ప్రపంచానికి విసుగ్గా వెళ్ళిపోయాడు.

నారదుడు ముందుకు ప్రయాణించి... రెండో వ్యక్తిని కలిశాడు. అతను ఇంకా విష్ణు నామ సంకీర్తనలో మునిగి ఆనందిస్తూనే ఉన్నాడు. నారదుణ్ణి చూడగానే "దేవర్షీ! నా విషయం అడిగారా?" అని ప్రశ్నించాడు.

"ఓ! అడగకేం? ఇక్కడ కనిపిస్తున్న చెట్టును చూడు. వాటికి ఆకులు ఎన్నున్నాయో లెక్కించగలవా?"

"తప్పకుండా. నాకు ఆ ఓపిక ఉంది. ఇప్పుడే లెక్కించమంటారా?"

"ఇప్పుడే అక్కర్లేదు. నింపాదిగా ప్రయత్నించు."

"ఆ చెట్టు ఆకులకూ, నా ప్రశ్నకూ సంబంధం ఏవిటి?"

"ఉంది. నీవు వైకుంఠం చేరాలంటే... ఆ చెట్టుకు ఎన్ని ఆకులు ఉన్నాయో... ఇంకా అన్ని జన్మలు ఎత్తాల్సి ఉంటుందని విష్ణువు నాతో చెప్పాడు."

"అంతేనా? ఆ చెట్టు ఆకులకు ఒక పరిమితి ఉంటుంది. నేను ఇంకా ఈ అడవిలో ఉన్న చెట్ల ఆకుల మొత్తం సంఖ్య ఎంతో అన్ని జన్మలని అనుకున్నాను. ఇప్పుడే ఈ చెట్టు ఆకులను లెక్కిస్తాను" అన్నాడు ఆ యోగి.

ఇంతలో... ఒక అందమైన పల్లకీ దివి నుంచి భువికి దిగింది. అందులో ఉన్న విష్ణుదూత "పరమాత్మ విష్ణువు మిమ్మల్ని ఈ పల్లకిలో వైకుంఠానికి తీసుకురమ్మన్నారు" అని ఆ యోగికి చెప్పాడు.

"నేను ఇప్పుడే విష్ణులోకానికి వెళుతున్నానా?" అన్నాడు యోగి ఆశ్చర్యంగా.

"అవును అన్నాడు విష్ణుదూత .

"కానీ నేను ఇంకా ఎన్నో జన్మలు ఎత్తాలని నారదులవారు ఇప్పుడే చెప్పారే?"

"ఇప్పుడు ఆ అవసరం లేదు. వచ్చి పల్లకి ఎక్కండి" అన్నాడు విష్ణుదూత.

"మరి ఆ మొదటి వ్యక్తి సంగతో?" అని అడిగాడు నారదుడు.

"అతనికి మరో నాలుగు జన్మలు ఎత్తే ఓపిక కూడా లేదు. అతను ఇంకా నిరీక్షిస్తూ, కృషి చేయవలసి ఉంటుంది" అని చెప్పాడు విష్ణుదూత.

కేవలం కథగా కాకుండా దీని వెనుక ఉన్న పరమార్థాన్ని అర్థం చేసుకోవాలి. నిశ్చలమైన మనస్సుతో, ఎంతో దీర్ఘకాలం, చాలా సహనంగా సాధన చేయాలనీ, సత్వర ఫలితాలను ఆశిస్తూ నిరీక్షించకూడదనీ, తొందరతో కలత పడకూడదనీ ఈ కథ బోధిస్తుంది.

• అప్పరుసు విజయరామారావు
9177086363

గీతాసారం


విశ్వానికి మూలాధారం

"నేను నీకు జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని వివరిస్తాను. నువ్వు వాటిని గ్రహించిన తరువాత, నీకు తెలుసుకోవలసినవేవీ ఇక మిగిలి ఉండవు" అని అర్జునుడికి శ్రీకృష్ణుడు చెప్పాడు. మేధస్సు మీద ఆధారపడినవారికి జ్ఞాన, విజ్ఞానాల ద్వారా సాగే మార్గం ఇది. అంతకుముందు మనస్సు ఆధారంగా ఉన్నవారి కోసం (భక్తిలో ఉన్న వ్యక్తుల కోసం) అన్ని జీవులు ఆత్మలో ఉన్నాయని, ఆత్మ అన్ని జీవులలోనూ ఉందనీ గ్రహించడం గురించి, అతణ్ణి (భగవంతుణ్ణి) అన్నిచోట్లా చూడడం గురించి శ్రీకృష్ణుడు చెప్పాడు. ఇది తెలిసిన తరువాత తెలియనిదేదీ ఉండదని తెలిపాడు.

'ఏదీ లేకపోవడం నుంచి విశ్వం ఉద్భవించవచ్చు' అని ఇటీవలి శాస్త్రీయ నిర్ధారణ చెబుతోంది. విస్తరిస్తున్న మన విశ్వం సృష్టి 13.8 బిలియన్ సంవత్సరాల కిందట ఒక 'బిగ్ బ్యాంగ్' ద్వారా జరిగిందంటోంది సైన్స్. కాస్మిక్ మైక్రోవేవ్ బ్యాక్‌గ్రౌండ్ రేడియేషన్ (సిఎంబిఆర్) దృక్పథం ఆధారంగా చూసినప్పుడు, ప్రస్తుతం ఉన్నదానికి ముందు ఒక విశ్వం ఉందనే వాదన ఉంది. విశ్వం విస్తరణ చాలా తక్కువ అనీ, కానీ ఖాళీ స్థలం (శూన్యం) తాలూకు శక్తి మరో విశ్వాన్ని సృష్టించగలదనీ దాని అంచనా. ఇదంతా సృష్టి, ఆ సృష్టి నాశనం కావడం తాలూకు 'చక్రీయ ప్రక్రియ' (సైక్లిక్ ప్రాసెస్) అని అది సూచిస్తుంది.

"మొత్తం విశ్వానికి మూలం నేనే, ప్రళయం నేనే" అనే కృష్ణుడి మాటలను అర్థం చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.. మొదట, ఇది ఒక చక్రీయ ప్రక్రియకు సూచిక. రెండోది, సృష్టి, వినాశనం... ఈ రెండిటినీ ఏకత్వం ఆవరించడం. గుర్తుంచుకోవాల్సిన విషయమేంటంటే, ప్రతి సంస్కృతి భగవంతుణ్ణి సృష్టికర్తగా కీర్తించింది. కానీ, పరమాత్మగా... తాను సృష్టికర్తననీ, అలాగే నాశనకర్తననీ కూడా శ్రీకృష్ణుడు ప్రకటించాడు.

"నాకన్నా అత్యున్నతమైనది మరేదీ లేదు. మొత్తం విశ్వమంతా ఒక దారానికి గుచ్చిన రత్నాల్లా నాలో కూర్చి ఉంది" అని చెప్పాడు. వ్యక్తమైన (రత్నాలు), అవ్యక్తమైన (దారం) వాటిని వివరించడానికి రత్నాల హారం అనే ఉదాహరణను తరచూ ఉపయోగిస్తూ ఉంటారు. దారం కనిపించదు, దారం ఆధారం లేనిదే రత్నాలు అందమైన ఆభరణంగా ఉండలేవు. కనిపించని వేర్లు లేకపోతే చెట్టు మనుగడ సాగించలేదు కదా! అలాగే పరమాత్మ లేనిదే విశ్వం ఉనికి లేదు. విశ్వం ఉనికికి మూలాధారం ఆ పరమాత్మే.





కె. శివప్రసాద్
ఐఎఎస్

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PSjU0rdలో చదవండి.

ఆగిఉన్న లారీలే మృత్యుశకటాలు

కోదాడ వద్ద ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టిన కారు

- ఓ చిన్నారి సహా ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి దుర్మరణం
- ఓఆర్ఆర్‌పై ఆగిఉన్న బొగ్గు లారీని ఢీకొట్టిన కారు
- కారు దగ్ధం.. ఒకరి సజీవ దహనం



కోదాడ సమీపంలో లారీ కిందికి దూసుకెళ్లిన కారు



మృతులు చందర్‌రావు; శ్రీకాంత్; మాణిక్యమ్మ; కృష్ణరాజు; లాస్య; స్వర్ణకుమారి (ఫైల్)



కోదాడ, బోనకల్, పటాన్‌చెరు, ఏప్రిల్ 25 : రకరకాల కారణాలతో నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై ఆపి ఉంచుతున్న లారీలు మృత్యుశకటాలుగా మారుతున్నాయి. అతివేగంగా వస్తున్న ఇతర వాహనదారులు హఠాత్తుగా ఆ లారీలను చూసి వాటిని ఢీకొట్టి ప్రాణాలు కోల్పోతున్నారు. రాష్ట్రంలో గురువారం జరిగిన ఈ తరహా రోడ్డు ప్రమాదాల్లో ఓ నాలుగేళ్ల చిన్నారి సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఓ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం చెందగా, మరో ప్రమాదంలో ఓ వ్యక్తి తన కారులోనే సజీవ దహనమయ్యాడు. సూర్యాపేట జిల్లా మునగాల వద్ద నాలుగు రోజుల క్రితం ఆగి ఉన్న లారీ కిందకు ఓ కారు దూసుకెళ్లి దంపతులు మరణించిన ఘటన మరువకముందే కోదాడలో గురువారం మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఓ కారు ఢీకొట్టగా.. ఆ కారులో ప్రయాణిస్తున్న ఓ చిన్నారి సహా ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం చిమిర్యాలకు చెందిన జల్లా శ్రీకాంత్(32), ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం గోవిందపురం గ్రామానికి చెందిన నల్లమల కృష్ణరాజు (26) బావా బావమరుదులు. కృష్ణరాజు చెల్లెలు నాగమణితో శ్రీకాంత్‌కు వివాహమైంది. శ్రీకాంత్, కృష్ణరాజు హైదరాబాద్‌లో కారు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. శ్రీకాంత్‌కు ఇద్దరు కుమార్తెలు లాస్య, లావణ్య(4) ఉన్నారు. కృష్ణరాజుకు తల్లిదండ్రులు నల్లమల చందర్‌రావు(52), మాణిక్యమ్మ (45), భార్య స్వర్ణకుమారి(23), పిల్లలు కౌశిక్, కార్తీక్ ఉన్నారు. హైదరాబాద్, మణికొండలో నివాసముండే ఈ రెండు కుటుంబాలు శ్రీకాంత్ చిన్న కూతురు లావణ్య పుట్టు వెంట్రుకలు తీయించేందుకు, చెవులు కుట్టించేందుకు విజయవాడ సమీపంలోని గుణదల మేరీమాత ఆలయానికి కారులో బయలుదేరాయి. మొత్తం పది మంది కలిసి ఎర్టిగా కారులో బుధవారం అర్ధరాత్రి తర్వాత హైదరాబాద్‌లో బయలుదేరారు. కృష్ణంరాజు కారు నడుపుతుండగా.. అతివేగంగా ప్రయాణిస్తున్న వీరి కారు గురువారం ఉదయం 4:50నిమిషాల సమయంలో కోదాడ సమీపంలోని శ్రీరంగాపురం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఓ లారీని వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం లారీ కిందకు దూసుకెళ్లింది. ప్రమాద తీవ్రతకు కారులో ఉన్న శ్రీకాంత్, లాస్య, చందర్‌రావు, మాణిక్యమ్మ, కృష్ణరాజు, స్వర్ణకుమారి అక్కడికక్కడే మరణించారు. నాగమణి తీవ్రంగా గాయపడగా, చిన్నారులు లావణ్య, కౌశిక్, కార్తీక్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో కారును బయటకి తీశారు. మృతదేహాలను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్ సోదరుడు కిషోర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

ఓఆర్ఆర్‌పై వ్యక్తి సజీవ దహనం

పటాన్‌చెరు: ఔటర్‌రింగ్‌రోడ్డుపై ఆగి ఉన్న బొగ్గు లారీని ఢీకొట్టడంతో కారులో మంటలు చెలరేగిన ఘటనలో కట్టెకోళ్ల శిరీష్(33) అనే వ్యక్తి సజీవదహనం అయ్యాడు. బీరంగూడకు చెందిన శిరీష్ మాదాపూర్‌లో హోటల్ వ్యాపారం చేస్తున్నారు. వ్యక్తిగత పనిమీద గురువారం ఉదయం సుల్తాన్‌పూర్ నుంచి ముత్తంగి వైపు ఎర్టిగా కారులో వెళ్లాడు. ముత్తంగి ఔటర్ రోడ్డు జంక్షన్‌కు కొద్ది దూరంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న బొగ్గు లారీని వెనక నుంచి శిరీష్ తన కారుతో అతివేగంగా ఢీకొట్టాడు. ఈ క్రమంలో శిరీష్ కారు రోడ్డు రెయిలింగ్, లారీకి మధ్య ఇరుక్కుపోగా.. కారులోని ఇంధన ట్యాంకు పగిలి మంటలు చెలరేగాయి. బయటపడే దారి లేక కారులో ఇరుక్కుపోయిన శిరీష్ ఆ మంటల్లో సజీవ దహనం అయ్యాడు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధం కాగా బొగ్గులారీ వెనకభాగం కాలిపోయింది. పోలీసులు అగ్నిమాపక సిబ్బందిని రప్పించి మంటలను అదుపు చేశారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టానికి తరలించారు.

అవసరమైతే ఎవరినైనా విచారిస్తాం!

- కాళేశ్వరంపై కాగ్, విజిలెన్స్, ఎన్‌డీఎస్ఏ నివేదికలను పరిశీలిస్తాం
- జస్టిస్ పినాకి చంద్రఘోష్ వెల్లడి
- జస్టిస్ ఘోష్‌ను కలిసిన మంత్రి ఉత్తమ్



జస్టిస్ పినాకి చంద్రఘోష్‌తో మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీల్లో తలెత్తిన సమస్యలపై జరుగుతున్న విచారణలో భాగంగా.. ఆ ప్రాజెక్టు నిర్మాణంతో సంబంధం ఉన్న వారిలో ఎవరిని ప్రశ్నించాల్సి వచ్చినా పిలుస్తామని జస్టిస్ పినాకి చంద్రఘోష్ స్పష్టం చేశారు. మెదడును రంగరించి కాళేశ్వరం ప్రాజెక్టును కట్టామని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పలుమార్లు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తూ.. అవసరమైతే ఆయనను కూడా విచారణకు పిలుస్తారా అని విలేకరులు ప్రశ్నించగా జస్టిస్ చంద్రఘోష్ ఈ విధంగా స్పందించారు. కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యాలపై విచారణ కోసం జస్టిస్ చంద్రఘోష్‌ను కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీగా ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. దీంతో ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన ఆయన రెండురోజుల విచారణ అనంతరం గురువారం విలేకర్లతో మాట్లాడారు. త్వరలోనే బ్యారేజీలను సందర్శిస్తానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన కాగ్, ఎన్‌డీఎస్ఏ నుంచి పూర్తిస్థాయి నివేదికలు తెప్పించుకుంటామని, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇప్పటికే మధ్యంతర నివేదిక ఇచ్చిందని.. వీటన్నింటినీ పరిశీలిస్తామని తెలిపారు. విచారణ లో భాగంగా ఐఐటీ నిపుణుల సహకారం కూడా తీసుకుంటామని వెల్లడించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనంత త్వరగా నివేదికను సమర్పిస్తామన్నారు. బ్యారేజీల వైఫల్యాలకు గల కారణాలపై ఎన్‌డీఎస్ఏకు లేఖ రాస్తామని తెలిపారు.

త్వరలో బహిరంగ విచారణ

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కట్టిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నిర్మాణ, నాణ్యత, నిర్వహణపరమైన లోపాలకు సంబంధించి సమాచారం అందించాల్సిందిగా ప్రజలను జస్టిస్ చంద్రఘోష్ కోరారు. లోపాలను వెలికితీయడం, బాధ్యులను గుర్తించటం, నిధుల దుర్వినియోగం తదితర అంశాలకు సంబంధించి ఎవరి వద్ద తగిన సమాచారం ఉన్నా తమకు అందించాలని పేర్కొన్నారు. ఈ మేరకు విచారణ కమిషన్ తరఫున నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా గురువారం ఒక ప్రకటన వెలువరించారు. ఫిర్యాదులు/నివేదికలు/సాక్ష్యాధారాలను నోటరీ ద్వారా అఫిడవిట్ల రూపంలో సమర్పించాలని తెలిపారు. సీల్డ్ కవర్‌లో వివరాలు భద్రపరిచి, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ (కాళేశ్వరం), 8వ అంతస్తు, బూర్గుల రామకృష్ణారావు భవన్, డీ బ్లాక్, హైదరాబాద్ చిరునామాలో ఉన్న బాక్సుల్లో మే31వ తేదీలోపు వేయాలని కోరారు. తగిన సాక్ష్యాధారాలు లేని, నోటరీల సంతకం లేని పత్రాలు తిరస్కరిస్తామని జస్టిస్ చంద్రఘోష్ స్పష్టం చేశారు. అనంతరం బ్యారేజీల నిర్మాణంతో సంబంధం ఉన్న వారికి నోటీసులు/సమన్లు జారీ చేయనున్నారు.

కమిషన్‌కు పూర్తిగా సహకరిస్తాం: ఉత్తమ్

జస్టిస్ ఘోష్‌ను బూర్గుల భవన్‌లో మంత్రి ఉత్తమ్ కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కమిషన్‌కు అన్ని విధాలా సహకరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నాలుగు రోజుల్లో ఎన్‌డీఎస్ఏ నివేదిక ప్రభుత్వానికి అందనుందని, దాని ఆధారంగా బ్యారేజీల మరమ్మతులు, పునరుద్ధరణపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అవసరమైతే మరమ్మతులు జరిపి వచ్చే సీజన్‌కు బ్యారేజీలను వినియోగంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తామన్నారు.

ప్రజల కోసం పోరాడా

- నిరుద్యోగులు, ఉద్యోగుల కోసం జైలుకెళ్లా
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఏం చేశారు
- ఆ రెండు పార్టీలూ ఒక్కటే: బండి సంజయ్
- కరీంనగర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు

కరీంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిరంతరం ప్రజల సమస్యలపై పోరాడిన తాను.. లాఠీ దెబ్బలు తిన్నానని, వందలాది కేసులు పెట్టినా ప్రజలకు అండగా నిలిచానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల కోసం జైలుకు వెళ్లానని తెలిపారు. గురువారం కరీంనగర్‌లో సంజయ్ నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, గుజరాత్ సీఎం భూపేంద్రభాయ్ పటేల్ హాజరయ్యారు. నామినేషన్ అనంతరం నిర్వహించిన ర్యాలీలో సంజయ్ మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులెవరూ ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా లేరని చెప్పారు. వారు ఏనాడైనా ప్రజల కోసం పోరాటం చేశారా..? అని ప్రశ్నించారు. తాను లోకల్ అని.. బీఆర్‌ఎస్ అభ్యర్థి నాన్ లోకల్ అని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి లోకలా..? నాన్ లోకలా..? చెప్పుకోలేని గందరగోళంలో ఆ పార్టీ క్యాడర్ ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు రూ.వందల కోట్ల ఆస్తులు ఉన్నాయని.. వారు గెలిస్తే రూ.వేల కోట్లు సంపాదిస్తారని పేర్కొన్నారు. తనను గెలిపిస్తే వేల కేసులు పెట్టినా ప్రజల కోసం పోరాటం చేస్తానని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులిద్దరూ కేసీఆర్ అనే నాణేనికి బొమ్మ, బొరుసు లాంటి వారని సంజయ్ విమర్శించారు.



నామినేషన్ వేస్తున్న బండి సంజయ్.. చిత్రంలో భూపేంద్ర భాయ్ పటేల్, కిషన్‌రెడ్డి

సంజయ్ గెలుపు ఖాయం: కిషన్‌రెడ్డి

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కాపాడుకోలేని కేసీఆర్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు అడగడానికి సిగ్గుండాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను సిగ్గులేకుండా కాంగ్రెస్‌లోకి పంపి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులను చూసిన తర్వాత బండి సంజయ్ ప్రచారం చేయకుండానే గెలుస్తారన్న విశ్వాసం కలుగుతోందని చెప్పారు. బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం సంజయ్ రాష్ట్రమంతా తిరిగి ఎన్నికల ప్రచారం చేయాలని కోరారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతో మోసం చేసి గద్దెనెక్కిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి దోచుకోవడం తప్ప చేసిందేమీ లేదని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రధాని మోదీ ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ గౌరవాన్ని పెంచారని గుజరాత్ సీఎం భూపేంద్రభాయ్ పటేల్ అన్నారు. మోదీని మరోసారి ప్రధానిగా ఆశీర్వదించాలని, తెలంగాణ సంక్షేమాన్ని ఆయన చూసుకుంటారని తెలిపారు.

వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక మే 27న

- మే 2 నుంచి నామినేషన్లు, జూన్ 5న కౌంటింగ్
- కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ, హైదరాబాద్, నల్లగొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మరో ఎన్నికకు ముహూర్తం కుదిరింది. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నిక షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. మే 2న నోటిఫికేషన్ విడుదల అవుతుంది. అదేరోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. మే 9వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. మే 10న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. మే 13న నామినేషన్ల ఉప సంహరణకు చివరి తేదీ. మే 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. జూన్ 5న ఓట్ల లెక్కింపు జరుగుతుందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కి చెందిన పల్లా రాజేశ్వర్ రెడ్డి ఇక్కడ విజయం సాధించారు. ఆయన జనగామ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించడంతో ఆ స్థానం ఖాళీ అయింది. . కాగా, ఈ ఎన్నికలో పోటీ చేసేందుకు కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నను ఆ పార్టీ అధిష్ఠానం ఇప్పటికే నిర్ణయించగా, బీజేపీ, బీఆర్‌ఎస్, వామపక్షాల తరుపున ఎవరు బరిలో ఉంటారో తేలాల్సి ఉంది.

రాహుల్ బీసీ పక్షపాతిగా నిలిచిపోతారు:జాజుల

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బీసీల పక్షపాతిగా నిలిచిపోతారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. దేశంలోని 70 కోట్ల మంది ఓబీసీల ఆకాంక్ష అయిన సమగ్ర కులగణనను రాహుల్‌గాంధీ తన భుజానికెత్తుకున్నారని, ఇది హర్షించ దగ్గ పరిణామమని ఆయన అన్నారు. బీజేపీ నేతలు కాంగ్రెస్ మేనిఫెస్టో ఎందుకూ పనికిరాదంటూ విమర్శించడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను విమర్శించడమంటే బీసీలను అవమానించడమే అవుతుందని జాజుల పేర్కొన్నారు.

వరంగల్‌లో బీఆర్‌ఎస్‌కు మరో షాక్!

- కాంగ్రెస్‌లో చేరనున్న ఎమ్మెల్సీ సారయ్య
- ఖమ్మంలో మంత్రి తుమ్మలతో మంతనాలు


ఖమ్మం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య త్వరలోనే కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ నాయకుడు నూకల నరేష్‌రెడ్డితో కలిసి ఆయన ఖమ్మంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమావేశమయ్యారు. బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరే విషయమై చర్చించారు. ఆయన చేరిక పట్ల మంత్రి తుమ్మల సానుకూలత వ్యక్తం చేశారు. పార్టీ అధిష్ఠానంతో మాట్లాడి కాంగ్రెస్‌లో చేర్చుకునే విషయమై సానుకూల నిర్ణయాన్ని తీసుకుంటామని తెలిపారు. పార్టీలో ఎప్పుడు చేరాలనే విషయంపై వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలతో మాట్లాడి చెబుతామని బస్వరాజు సారయ్యకు మంత్రి తుమ్మల వెల్లడించారు. అనంతరం మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డిని కూడా బస్వరాజు సారయ్య కలిసి, పార్టీలో చేరే విషయమై చర్చించారు.

ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తాం

మూడోసారి అధికారంలోకి రాగానే వాటిని తొలగించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఇస్తాం

- తెలంగాణలో అవినీతి లేకుండా చేస్తాం
- ఇక్కడ 12 సీట్లు గెల్చుకుంటాం:అమిత్ షా

సిద్దిపేట/నిజామాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మూడోసారి అధికారంలోకి రాగానే తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తామని కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా చెప్పారు. ముస్లింలకు తొలగించి.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపారు. గురువారం సిద్దిపేటలో జరిగిన విశాల జనసభలో అమిత్ షా ప్రసంగించారు. తెలంగాణకు అవినీతి నుంచి విముక్తి కల్పిస్తామని హామీ ఇచ్చారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతిని ప్రస్తుత కాంగ్రెస్ ఎందుకు వెలికితీయడం లేదని ప్రశ్నించారు. ఇక్కడి ప్రభుత్వం ఢిల్లీ కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారిందన్నారు. మూడోసారి మోదీ ప్రధానమంత్రి కాగానే తెలంగాణలో అవినీతి కనుమరుగు అవుతుందని వెల్లడించారు. తెలంగాణలో బీజేపీ 12 స్థానాలు, దేశంలో 400 పైచిలుకు సీట్లు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు మజ్లిస్‌కు భయపడి సెప్టెంబరు 17న విమోచన దినోత్సవం కూడా జరపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికీ భయపడకుండా బీజేపీ విమోచన దినోత్సవాన్ని జరుపుతోందని గుర్తుచేశారు. మెదక్‌లో రఘునందన్‌రావును గెలిపించాలని కోరారు. దేశంలో క్లిష్టమైన అనేక సమస్యలను పరిష్కరించామని అమిత్ షా చెప్పారు. అయోధ్య కేసును గెలిచి, భవ్యమైన రామాలయాన్ని నిర్మించామని తెలిపారు. అయోధ్యలో రామమందిరం కట్టవద్దనే ఆలోచన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల్లో ఉండేదని ఆరోపించారు. ఇక ఆర్టికల్ 370ని రద్దు చేసి కశ్మీర్ అంశానికి శాశ్వత పరిష్కారం చూపించిన ఘనత బీజేపీకే దక్కుతుందని వెల్లడించారు. కాగా, మధ్యాహ్నం 12 గంటలకు సభకు రావాల్సిన షా.. 1.56 గంటలకు వేదికపైకి వచ్చారు. కేవలం 8 నిమిషాల పాటు మాట్లాడి ముగించారు. అమిత్ షా ప్రసంగిస్తుండగా సభ మధ్యలో నుంచి ఒక్కసారిగా నిరసన గళాలు వినిపించడంతో రసాభాసగా మారింది. తమ డబ్బులు చెల్లించాలంటూ కొంతమంది 'సహారా' బాధితులు నినాదాలు చేశారు. పోలీసులు వారించినా ఆగలేదు.



చేసింది బీజేపీ.. చెప్పుకునేది బీఆర్‌ఎస్: రఘునందన్

సిద్దిపేటకు రైలు తేవడం నుంచి ఎన్నో అభివృద్ధి పనులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సాకారం చేస్తే.. బీఆర్‌ఎస్ వాళ్లు తమ ఖాతాలో వేసుకుంటున్నారని మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్ మండిపడ్డారు. చేసింది తామైతే.. చెప్పుకునేది హరీశ్‌రావు అని ఆరోపించారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే బాలరాముడి దర్శనానికి సిద్దిపేట నుంచి అయోధ్యకు రైలు సౌకర్యం కల్పిస్తానని పేర్కొన్నారు. ఎంతోమంది రైతులను ఇబ్బందులు పెట్టిన బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని ప్రజలు తిరస్కరించాలని కోరారు. ఇక నాలుగు పార్టీలు మారిన కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

ప్రపంచం మోదీ నాయకత్వాన్ని ప్రశంసిస్తోంది..

ప్రపంచం మొత్తం మోదీ నాయకత్వాన్ని ప్రశంసిస్తోందని, మోదీ మూడోసారి ప్రధాని అయ్యే విధంగా అందరూ మద్దతివ్వాలని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి కోరారు. గురువారం నిజామాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనంతా అవినీతి, అక్రమాలేనని దేశ రక్షణను కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రజలను దోచుకునే పార్టీలని ఆరోపించారు. ఇండియా కూటమికి విదేశాల నుంచి కూడా ఫండింగ్ వస్తోందని ఆరోపించారు. ఇందూరులో ప్రధాని మోదీని చూసి అర్వింద్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. అర్వింద్‌ను గెలిపిస్తే పసుపు బోర్డును పూర్తిస్థాయిలో పని చేయిస్తారని చెప్పారు. మూడోసారి అధికారంలోకి రాగానే నిజాంషుగర్ ఫ్యాక్టరీపై కూడా నిర్ణయం తీసుకుంటామని ధామి తెలిపారు.

దేశమంతా మోదీ గాలి.. బీజేపీకి 400 సీట్లు

- గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్
- నాగర్‌కర్నూల్‌లో ఎన్నికల ప్రచారం

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో మోదీ గాలి వీస్తోందని, లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు గెలిచి బీజేపీ తిరిగి అధికారం చేపట్టడం ఖాయమని గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ అన్నారు. మోదీ మూడోసారి ప్రధాని అయితే భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని చెప్పారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా నాగర్‌కర్నూల్‌లో గురువారం నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా స్థానిక అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం భారతదేశాన్ని ప్రగతి వైపు నడిపిస్తుందని చెప్పారు. నాగర్‌కర్నూల్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో అబాసుపాలైతే కాంగ్రెస్ సర్కారు కేవలం వంద రోజుల్లోనే చులకన అయ్యిందని విమర్శించారు. తెలంగాణలో తమ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలిచి సత్తా చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. .

కరెంట్‌పై కేసీఆర్ చెప్పినవన్నీ

అవాస్తవాలే..

- వాస్తవాలపై చర్చకు సిద్ధం: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ కరెంట్‌పై చెప్పినవన్నీ అవాస్తవాలేనని, వాస్తవాలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో వైఫల్యాలతో విద్యుత్ రంగం అప్పుల ఊబిలోకి వెళ్లిందని, అవరోధాలను అధిగమించి రెప్పపాటైనా కరెంట్ పోకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే 30 ఏళ్ల రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. దీర్ఘకాలిక అవసరాల కోసం ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు చేశామనే కేసీఆర్ మాటల్లో వాస్తవంలేదని, ఆ రాష్ట్రం నుంచి 1,000 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు ఒప్పందం చేసుకుంటే తెలంగాణ డిస్కమ్‌లకు 300-400 మెగావాట్లకన్నా ఎక్కువ కరెంట్ సరఫరా చేయలేదని, చెల్లింపుల్లో వైఫల్యంతో 2022 ఏప్రిల్ నుంచి విద్యుత్ ఆగిపోయిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో యూనిట్ కరెంట్‌ను రూ.3.90కు కొనుగోలు చేశామని కేసీఆర్ చెప్పడం పచ్చి అబద్ధమని, యూనిట్ కరెంట్‌ను రూ.20కు కొన్నారని చెప్పారు. దీనిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎన్టీపీసీ ఒక్కో యూనిట్ రూ.15కు ఇస్తామని చెప్పిందనడంలో వాస్తవం లేదని, 1,600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్ నుంచి యూనిట్‌కు రూ.5.60కు ఎన్టీపీసీ కరెంట్ అందిస్తుందన్నారు. తాము యూనిట్ కరెంట్‌ను రూ.13కు కొనుగోలు చేశామని చెప్పారని, రూ.5.34 గరిష్ఠ ధరతో మాత్రమే కరెంట్‌ను కొన్నామని తెలిపారు. హైదరాబాద్‌ను పవర్ ఐలాండ్‌గా మార్చామని కేసీఆర్ ప్రకటించడం వాస్తవ విరుద్ధమన్నారు. గత ప్రభుత్వ హయాంలో డిస్కమ్‌ల నష్టాలు రూ.62,461 కోట్లకు చేరాయని తెలిపారు. కాగా, ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా యాదాద్రి పవర్ ప్లాంట్‌కు పర్యావరణ అనుమతులు లభించాయని భట్టి తెలిపారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, అశ్రద్ధతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయన్నారు. తాజాగా తమ చర్యలతో పర్యావరణ అనుమతి లభించిందని భట్టి తెలిపారు.

నవ్య | చిత్రజ్యోతి

ముంబైలో కుబేర యాక్షన్





ధనుష్, నాగార్జున కథానాయకులుగా రూపొందుతున్న మల్టీస్టారర్ 'కుబేర'. దర్శకుడు శేఖర్ కమ్ముల తన పంథాకు భిన్నంగా పూర్తి వాణిజ్య హంగులతో రూపొందిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం బ్యాంకాక్ షెడ్యూల్ పూర్తి చేయగా, గురువారం నుంచి ముంబైలో తాజా షెడ్యూల్ ప్రారంభమైంది. 12 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నగరంలోని పలు ప్రదేశాల్లో చిత్రీకరణ జరుగుతుంది. ధనుష్, రష్మికతో పాటు కీలకపాత్రధారులు పాల్గొనే ఈ షెడ్యూల్‌లో కొంత టాకీ పార్ట్‌తో పాటు యాక్షన్ ఎపిసోడ్స్ తెరకెక్కించనున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్‌రావు నిర్మాతలు. రష్మిక మందన్న కథానాయిక. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: నికిత్ బొమ్మి

సత్యభామ ప్రేమగీతం

కాజల్ అగర్వాల్ లీడ్‌రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో ఆమె శక్తిమంతమైన పోలీస్ అధికారిణిగా కనిపించనున్నారు. నవీన్‌చంద్ర కీలకపాత్ర పోషిస్తున్నారు. దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పణలో బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. సుమన్ చిక్కాల దర్శకుడు. మే 17న 'సత్యభామ' చిత్రం విడుదలవుతోంది. గురువారం ఈ చిత్రం నుంచి 'కళ్లారా చూశాలే నువ్వేనా' అంటూ సాగే తొలి పాటను యూనిట్ విడుదల చేసింది. కాలేజీ ప్రేమ నేపథ్యంలో సాగే ఈ గీతానికి రాంబాబు గోసాల సాహిత్యం అందించగా శ్రీచరణ్ పాకాల స్వరాలందించారు. శ్రేయా ఘోషల్ ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: బి విష్ణు.



పద్నాలుగేళ్ల తర్వాత మళ్లీ..



బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్, దర్శకుడు ప్రియదర్శన్ మళ్లీ చేతులు కలిపారు. "హేరాఫేరి', 'భూల్ భులయ్య' చిత్రాల తర్వాత మళ్లీ వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ సినిమా రూపుదిద్దుకోనుంది. పద్నాలుగేళ్ల తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రం ఇది కావడం విశేషం. హారర్ కామెడీ కథాంశంతో రూపుదిద్దుకొనే ఈ చిత్రాన్ని ఏక్తా కపూర్ నిర్మించనున్నారు. 'అక్షయ్‌తో సినిమా చేయడం ఎప్పుడూ హ్యాపీనే. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. అతీంద్రియ శక్తుల నేపథ్యంలో చిన్న ఫ్యాంటసీతో సినిమా ఉంటుంది' అని చెప్పారు ప్రియదర్శన్.

అందరికీ కనెక్ట్ అయ్యే కథ

సినిమాలు నిర్మించాలనే దీర్ఘకాలిక ప్రణాళికతో చిత్రపరిశ్రమలోకి వచ్చాను. మంచి కథ కోసం వెదుకుతున్నప్పుడు దర్శకుడు మల్లి ఈ కథ చెప్పారు. పెళ్లి చుట్టూ తిరిగే ఈ కథలో కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్.. అన్నీ ఉన్నాయి. అందుకే ఆ కథతో 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రం తీశాను' అన్నారు నిర్మాత రాజీవ్ చిలక. అల్లరి నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన ఈ చిత్రం మే 3న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో రాజీవ్ మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు.

● ఈ కథ వినగానే నరేశ్‌గారినే హీరోగా అనుకున్నాం. మొదట మైండ్‌లోకి రాజేంద్రప్రసాద్‌గారు వచ్చినా యంగ్‌గా ఉంటే ఆయన పర్ఫెక్ట్. ఇప్పుడు నరేశ్‌కు యాప్ట్. మేం ఆయనకి కథ చెప్పినప్పుడు చాలా బిజీగా ఉన్నారు. ఆయన కోసం వెయిట్ చేశాం.



● పెళ్లి కావడం లేదని చాలా మంది మానసికంగా కుంగిపోతున్నారు. ఈ రోజుల్లో సెటిల్ అవడం కంటే పెళ్లి కావడం పెద్ద టాస్క్‌గా మారింది. అందుకే అందరికీ కనెక్ట్ అవుతుందని ఈ కథను ఎన్నుకుని వినోదాత్మకంగా చెప్పాం.

● సినిమా కోసం కొన్ని టైటిల్స్ అనుకున్నాం కానీ సరిగ్గా సెట్ కాలేదు. అప్పుడు నరేశ్‌గారే ఈ టైటిల్ సూచించారు. హీరోని అందరూ పెళ్లి ఎప్పుడని అడుగుతుంటారు. విసిగిపోయిన హీరో 'ఆ ఒక్కటీ అడక్కు' అంటుంటాడు. దర్శకుడు ఇవీవీ సత్యనారాయణగారి క్లాసిక్ సినిమా టైటిల్ ఇది. సినిమా చూసి హ్యాపీగా ఫీల్ అయిన నరేశ్‌గారు ఈ టైటిల్ వాడుకోండి అని చెప్పారు.

● మా బేనరులో మంచి సినిమాలు తీయాలని ఉంది. ఫాంటసీ, హిస్టారికల్, కామెడీ జోనర్స్.. అన్ని రకాలు తీయాలని ఉంది. ఇక యానిమేషన్ విషయానికి వస్తే 'ఛోటా భీమ్'ని పిల్లలతో చేయబోతున్నాం. అలాగే డిస్నీలో ఒక యానిమేషన్ షో లాంచ్ కాబోతోంది.

'సీతా రామం', 'హాయ్ నాన్న', 'ఫ్యామిలీ స్టార్' వంటి చిత్రాలతో తెలుగులో పాపులర్ అయ్యారు మృణాల్ ఠాకూర్. ఇటీవల మీడియాతో ముచ్చటించిన ఆమె పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.



రిలేషన్స్‌పై నమ్మకం లేదు

"వర్క్ లైఫ్ ఒత్తిడి, ఆందోళనలు వ్యక్తిగత జీవితంపై పడకుండా బ్యాలెన్స్ చేసుకోవడం చాలా ముఖ్యం. కెరీర్ ప్రారంభ దశలో బాడీ షేమింగ్ ఎదుర్కొన్నాను. నా బాడీ స్ట్రక్చర్ హీరోయిన్‌కు సెట్ కాదని, స్క్రీన్ మీద గ్లామర్‌గా కనిపించనని విమర్శించేవారు. కానీ వాటన్నింటినీ సవాలుగా తీసుకున్నా. ఇండస్ట్రీలోని బ్యూటీ స్టాండర్డ్స్‌ను మార్చాలని నిశ్చయించుకున్నా. ప్రస్తుత కాలపు రిలేషన్స్‌పై నమ్మకం లేదు. ఒకరితో జీవితం సజావుగా సాగాలంటే మనల్ని, మన ప్రొఫెషనల్ లైఫ్‌ను పూర్తిగా అర్థం చేసుకునే భాగస్వామిని పొందడం అవసరం. ఇక, పిల్లలను కనే విషయమై ఎగ్ ఫ్రీజింగ్ (అండాలను నిల్వ చేయడం) ఆలోచన ఉంది" అని చెప్పారు.



అబ్ కీ బార్?

రాయ్ బరేలీలో పోటీకి వరుణ్ గాంధీ 'నో'!

బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీకి ఆ పార్టీ నాయకత్వం రాయ్ బరేలీ టికెట్ ఆఫర్ చేయగా ఆయన తిరస్కరించినట్టు సమాచారం. ఈ స్థానంలో ప్రియాంకా గాంధీ పోటీ చేసే అవకాశం ఉండడమే ఆయన నిర్ణయానికి కారణం. ఆయన ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

పోటీలో కల్పనా సోరెన్

ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పన.. గాండేయ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ఈ విషయాన్ని జేఎంఎం పార్టీ గురువారం ప్రకటించింది. ఈ స్థానానికి మే 20న ఉప ఎన్నిక జరగనుంది.

మతచిచ్చు రగల్చటం మీకు అలవాటుగా మారింది

- ప్రధాని పదవికున్న ప్రతిష్ఠను మీరు దిగజారుస్తున్నారు
- మోదీపై ఖర్గే నిప్పులు.. లేఖ రాసిన కాంగ్రెస్ అధ్యక్షుడు



న్యూఢిల్లీ, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): 'మాటలను వక్రీకరించటం, ప్రజల మధ్య మతచిచ్చు రగల్చటం మీకు అలవాటుగా మారింది. ఈ విధమైన మాటలతో మీరు ప్రధాని పదవికున్న ప్రతిష్ఠను దిగజారుస్తున్నారు' అంటూ ప్రధాని మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, ధనికులు-పేదల మధ్య వ్యత్యాసాల గురించి తాము మాట్లాడుతుంటే.. ప్రజలను హిందువులు, ముస్లింలుగా ఎందుకు విడదీస్తున్నారని మోదీని ప్రశ్నించారు. 'మా పార్టీ మేనిఫెస్టోలో చెప్పని వాటి గురించి మీ సలహాదారులు మీకు తప్పుడు సమాచారం ఇస్తున్నట్లు అర్థమవుతోంది. దేశ ప్రధాని హోదాలో మీరు అబద్ధాలు మాట్లాడకుండా.. మీ వద్దకు నేనే వచ్చి మా మేనిఫెస్టో గురించి స్వయంగా వివరిస్తా. నాకు సమయం ఇవ్వండి' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సంపదను ముస్లింలకు పంచుతుందని, సంపదను, బంగారాన్ని, చివరికి మంగళసూత్రాలను కూడా లాక్కొని పునఃపంపిణీ చేస్తుందని మోదీ ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆయనకు ఖర్గే గురువారం లేఖ రాశారు. ఆ లేఖను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మోదీ, బీజేపీ నేతల వ్యాఖ్యలు చూసి తాము ఆశ్చర్యపోవటమో, దిగ్భ్రాంతికి గురికావటమే జరగలేదని, తొలిదశ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి చూశాక వారిలా మాట్లాడుతారని ఊహించిందేనని ఖర్గే పేర్కొన్నారు. 'మీరు పని చేసేదే కార్పొరేట్ కంపెనీల కోసం. వారికి లక్షల కోట్ల పన్ను రాయితీలు ఇచ్చే మీరు పేదలు తినే ఆహారం, చివరికి ఉప్పు మీదా జీఎస్టీ వేస్తారు. పేదల సంక్షేమం, ఆర్థిక అంతరాల గురించి మేం మా మేనిఫెస్టోలో మాట్లాడుతుంటే మీరు హిందూ-ముస్లిం అని విబేధాలు సృష్టిస్తున్నారు' అని ఖర్గే నిప్పులు చెరిగారు. పేదలు బ్యాంకుల్లో దాచుకున్న డబ్బును రుణాల రూపంలో ధనికులకు కట్టబెట్టేందుకే పెద్దనోట్లను రద్దు చేశారని, తర్వాత ఆ రుణాలనూ రద్దు చేశారన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు 3లక్షల కోట్ల కార్పొరేట్ల రుణాలను రద్దుచేసి ఆ సంపదను పేదల నుంచి ధనికులకు మళ్లించారన్నారు. ఈ పదేళ్లలో ఒక్క రైతు రుణాన్ని మోదీ రద్దు చేయలేదన్నారు. మణిపూర్‌లో మహిళలపై జరిగిన దారుణ అత్యాచారాలకు, రేపిస్టుల మెడ లో దండలు వేసి సత్కరించిన ఘటనలకు మోదీ ప్రభుత్వం బాధ్యత వహించదా?అని ప్రశ్నించారు. అటువంటి మీరు మహిళల మంగళసూత్రాల గురించి మాట్లాడటమేమిటని మోదీని నిలదీశారు.

మా పార్టీ మేనిఫెస్టోలో వారసత్వ పన్ను ప్రస్తావనే లేదు: జైరాం రమేశ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వారసత్వ పన్నుపై కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యల పట్ల దుమారం రేగుతున్న నేపథ్యంలో ఆ పార్టీ ఎంపీ జైరాంరమేశ్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో వారసత్వ పన్ను ప్రస్తావనేలేదన్నారు. ఆ అంశం గురించి తామెప్పుడూ మాట్లాడలేదని, అది తమ ఎజెండాలోలేదని పేర్కొన్నారు. 1985లో ప్రధానిగా ఉన్న రాజీవ్‌గాంధీ వారసత్వ పన్నును రద్దు చేశారన్నారు. ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో జైరాం మాట్లాడుతూ తమ పార్టీ మేనిఫెస్టోలో సంపద పునఃపంపిణీ గురించి లేదన్నారు.

కేరళ తీర్పు.. వయా వయనాడ్

జాతీయ స్థాయిలో కాంగ్రెస్, లెఫ్ట్ దోస్తీ.. ఇక్కడ కుస్తీ.. వయనాడ్ నుంచి పోటీలో రాహుల్

- ఆయనకు సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా భార్య అన్నీ రాజా సవాల్

(సెంట్రల్ డెస్క్)

దేవుడి సొంత నేల.. కొబ్బరి నేల.. చైతన్యానికి నెలవైన కేరళ ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి తీర్పు ఇవ్వనుందోననే ఆసక్తి నెలకొంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పదిహేను సీట్లతో పట్టం కట్టిన మలయాళీలు.. అధికార లెఫ్ట్ ఫ్రంట్‌ను ఒక్క స్థానానికే పరిమితం చేశారు. అసెంబ్లీ సమరంలో మాత్రం హస్తాన్ని పక్కనపెట్టి వామపక్ష ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించారు. ఇప్పటి విషయానికి వస్తే.. బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ఏర్పడిన ఇండి యా కూటమిలో లెఫ్ట్, కాంగ్రెస్ ప్రధాన పార్టీలు. కేరళలో మాత్రం ఈ రెండింటి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. వయనాడ్‌లో కాంగ్రెస్ అగ్ర నేత, సిటింగ్ ఎంపీ రాహుల్ గాంధీని సాక్షాత్తు సీపీఐ జాతీయ కార్యదర్శి ఎ.రాజా భార్య అన్నీ రాజా సవాల్ చేస్తుండడమే దీనికి నిదర్శనం. పరస్పరం ఢీకొంటే దిగితే తప్పుడు సంకేతాలు వెళ్తాయని లెఫ్ట్ వారించినా.. కాంగ్రెస్ రాహుల్‌నే అభ్యర్థిగా ప్రకటించింది. ఈ ఘర్షణ జాతీయ స్థాయిలో ఆసక్తితో పాటు ఇండియా కూటమిలో అపనమ్మకాన్నీ కలిగించింది. కూటమిలో లుకలుకలను బయటపెడుతూ కేరళ రాజకీయాల్లో పాగాకు బీజేపీ చేస్తున్న పోరాటానికి మార్గం సుగమం చేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. దీనికితగ్గట్లే లెఫ్ట్, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు 'ఢిల్లీ మే దోస్తీ.. కేరళ మే కుస్తీ' నినాదాన్ని ప్రస్తావించారు. కాగా, కేరళలో కాంగ్రెస్, వామపక్షాలు పరస్పర పోటీ, బయట పొత్తు పెట్టుకోవడంపై రాష్ట్ర ఓటర్లలో ఎలాంటి అయోమయం లేదని.. ఇండియా నేతలు పేర్కొంటున్నారు. రాష్ట్ర, జాతీయ ఎన్నికల మధ్య తేడాను గుర్తించే పరిపక్వత వారికి ఉందని అంటున్నారు.

రాహుల్, కేసీ, థరూర్..


2019లోనే వయనాడ్ నుంచి రాహుల్ పోటీపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన వామపక్షాలు ఈసారి కూడా అదే ధోరణి కనబరిచాయి. సురక్షిత స్థానం కావాలనుకుంటే మరో దక్షిణాది రాష్ట్రాన్ని ఎందుకు ఎంచుకోలేదని ప్రశ్నించాయి. దూరదృష్టి లేని కేరళ కాంగ్రెస్ నేతలు రాహుల్‌ను పోటీ చేయాలంటూ బలవంతం చేశారని సీపీఐ ఆరోపించింది. మిత్రపక్షాల అభ్యర్థిగా రాహుల్ ఒక్కరే బరిలో నిలవాల్సి ఉండగా.. అన్నీ రాజా పట్టుబట్టడంతో కాదనలేని పరిస్థితి ఏర్పడింది. కాగా, వయనాడ్‌లో బీజేపీ తరఫున ఆ పార్టీ కేరళ అధ్యక్షుడు కె.సురేంద్రన్ బరిలో ఉన్నారు. ఈ స్థానంలోనే కాక.. అలప్పుళ కూడా లెఫ్ట్, కాంగ్రెస్ మధ్య మంటలు రేపుతోంది. ఇక్కడ సీపీఎం ఎంపీ ఏఎం ఆరిఫ్‌తో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడైన కేసీ వేణుగోపాల్ తలపడుతున్నారు. అలప్పుళ నుంచి కేసీ రెండుసార్లు (2009, 2014) గెలిచారు. తిరువనంతపురంలో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖరన్‌తో కేంద్ర మాజీ మంత్రి శశి థరూర్ తలపడుతున్నారు. కాగా, ఎన్నికల్లో పోటీపరంగానే కాక.. కాంగ్రెస్-లెఫ్ట్ సైద్ధాంతికంగానూ తలపడ్డాయి. ముస్లింలకు సంబంధించిన విషయాల్లో కాంగ్రెస్ మొండి వైఖరిపై వామపక్షాలు ప్రధానంగా ఆరోపణలు చేశాయి. అయోధ్య, ఆర్టికల్-370 రద్దు అంశాల్లో కాంగ్రెస్ సాఫ్ట్ హిందుత్వ వైఖరిని అవలంబించిందని సీపీఎం ఆరోపిస్తోంది. దీనికి ప్రతిగా.. కేరళ బయట తాము సాఫ్ట్ హిందుత్వతో ఉంటే.. రాజస్థాన్‌లో సీపీఎం తమ మద్దతు ఎందుకు తీసుకుంటోందని కాంగ్రెస్ నిలదీసింది.





త్రిముఖ పోరులో రాహుల్ వైపే మొగ్గు

గత ఎన్నికల్లో తొలిసారి దేశవ్యాప్తంగా మార్మోగిన వయనాడ్‌లో రాహుల్ 4.37 లక్షల ఓట్ల ఆధిక్యంతో ఘనవిజయం సాధించారు. వయనాడ్ 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు చోట్ల ముస్లింలదే ఆధిపత్యం. వీరిలో అత్యధికం కాంగ్రెస్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఇప్పుడు రాహుల్, అన్నీ, సురేంద్రన్ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. అయితే, గెలవడం అంత సులువు కాదని తెలిసిన వామపక్షాలు.. రాహుల్ ఆధిక్యాన్ని వీలైనంత తగ్గించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కాగా, సురేంద్రన్ కూడా పెద్దఎత్తున ప్రచారం చేశారు.



అందరి కన్నా మైనారిటీలపైనే!

కేరళలో మైనారిటీల ఓట్లే కీలకం. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ముస్లింలు, క్రైస్తవులు కలిపి 44.9% వరకు ఉన్నారు. ఇప్పుడు ఈ సంఖ్య మరింత పెరిగి ఉండొచ్చు కూడా. లోక్‌సభ ఎన్నికల్లో వీరి ఓట్ల కోసం పాలక లెఫ్ట్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్), విపక్ష యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) విస్తృత ప్రయత్నాలు చేస్తున్నాయి. రాష్ట్రంలో 20 లోక్‌సభ స్థానాలు ఉండగా.. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఏకంగా 19 స్థానాలను కైవసం చేసుకుంది. లెఫ్ట్‌కు ఒక్కటే దక్కింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో రివర్స్ అయింది. ప్రజలు అనూహ్యంగా పినరయి విజయన్ సారథ్యంలోని ఎల్‌డీఎఫ్‌కు రెండోసారి అధికారం కట్టబెట్టారు. కేరళలో ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వం మారిపోవడం రివాజుగా వస్తోంది. విజయన్ దానిని బద్దలు కొట్టారు. ముస్లింలు, క్రైస్తవులు ఆయన నాయకత్వం వైపు మొగ్గుచూపారు. ఇప్పుడు 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఈ విజయపరంపర కొనసాగించాలని ఎల్‌డీఎఫ్ భావిస్తోంది. అటు యూడీఎఫ్ కూడా రాహుల్ సారథ్యంలో మళ్లీ అత్యధిక సీట్లు గెలుచుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

అమేఠీలో రాహుల్ రాయ్ బరేలీలో ప్రియాంక!

- లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి నిర్ణయం!
- నాలుగైదు రోజుల్లో ప్రకటించే చాన్స్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలు కలిగిన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని నియంత్రించేందుకు ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా అమేఠీ, రాయ్ బరేలీ లోక్‌సభ స్థానాల్లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ బరిలో నిలవాలని నిర్ణయించుకున్నట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయమై ఇప్పటికే కాంగ్రెస్ కీలక నేతల మధ్య చర్చ జరిగినట్టు తెలిసింది. బీజేపీ తనకు అత్యంత బలమైన రాష్ట్రంగా భావిస్తున్న ఉత్తరప్రదేశ్‌లో గాంధీ కుటుంబం నుంచి ఇద్దరు బరిలో నిలవడం ద్వారా కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వస్తుందని ఆ పార్టీ భావిస్తున్నట్టు సమాచారం. ఈ విషయమై సోనియాగాంధీ సైతం సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. నాలుగైదు రోజుల్లో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

బాల రాముడి దర్శనం తర్వాత నామినేషన్!

బీజేపీ దేశవ్యాప్తంగా అయోధ్య రాముడి పేరును ప్రచారంలో కీలక అస్త్రంగా మలుచుకుంటోంది. అయితే, ఇప్పటి వరకు రాహుల్, ప్రియాంక అయోధ్య రాముడిని దర్శించుకోలేదు. అందుకే అమేఠీ, రాయ్ బరేలీ స్థానాల్లో నామినేషన్ వేయడానికి ముందే అయోధ్య బాలరాముడిని ఇద్దరూ దర్శించుకోనున్నట్టు తెలిసింది. మే 20న అమేఠీ, రాయ్ బరేలీ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. కాగా, అమేఠీ, రాయ్ బరేలీ లోక్‌సభ నియోజకవర్గాలు కాంగ్రెస్‌కు కంచుకోటలుగా ఉన్నాయి. అమేఠీలో ఇప్పటి వరకు మూడుసార్లు మాత్రమే కాంగ్రెస్ ఓటమి పాలైంది. రాహుల్ గాంధీ 2004 నుంచి వరుసగా మూడుసార్లు అమేఠీ నుంచి ప్రాతినిధ్యం వహించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాయకురాలు స్మృతి ఇరానీ చేతిలో ఓటమి పాలయ్యారు. అప్పుడు అమేఠీతో పాటు వయనాడ్ నుంచి రాహుల్ పోటీ చేశారు. అక్కడ విజయం సాధించారు.

రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఎన్నికలు: రాహుల్

ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దీని కోసం కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని ఓ వీడియో సందేశంలో ప్రజలను అభ్యర్థించారు. 'ఒకవైపు ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని ప్రయత్నిస్తున్న బీజేపీ-ఆరెస్సెస్, మరోవైపు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుతున్న కాంగ్రెస్, ఇండియా కూటమి ఉన్నాయ'ని పేర్కొన్నారు. దేశప్రజల సమస్యలు విని విప్లవాత్మకమైన మేనిఫెస్టో రూపొందించామని చెప్పారు.

మలి దశ మలుపు ఎవరికో?

- 13 రాష్ట్రాల్లోని 89 లోక్‌సభ స్థానాలకు నేడు పోలింగ్
- కేరళలోని మొత్తం 20 సీట్లకూ ఓటింగ్



పశ్చిమబెంగాల్‌లో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల రెండో దశ పోలింగ్ శుక్రవారం జరగనుంది. ఓవైపు ఎండలు మండుతున్నప్పటికీ.. ఓటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లను కేంద్ర ఎన్నికల సంఘం పూర్తి చేసింది. కేరళలోని మొత్తం 20 సీట్లు సహా ఈ విడతలో 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 89 స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. తమిళనాడులో తొలి దశలోనే ఎన్నికల ఘట్టం ముగిసింది. ఈసారి కేరళ, రాజస్థాన్, త్రిపురలో కూడా పూర్తవనుంది. కర్ణాటక (14), రాజస్థాన్ (13), యూపీ, మహారాష్ట్ర (8), మధ్యప్రదేశ్ (7), అసోం, బిహార్ (5), ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ (3) స్థానాలకు, మణిపుర్, త్రిపుర, జమ్మూకశ్మీర్‌లలోని ఒక్కో సీటుకు మలి దశలో ఎన్నికలు జరుగనున్నాయి. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ (వయనాడ్), ఆ పార్టీ కీలక నాయకులు, కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ (తిరువనంతపురం), కేసీ వేణుగోపాల్ (అలప్పుళ), బీజేపీ తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా (గుంజాల్), కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ (జోధ్‌పూర్) పోటీలో ఉన్నారు. కర్ణాటక మాజీ సీఎం, జేడీఎస్ చీఫ్ కుమారస్వామి (మాండ్య), ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ (బెంగళూరు రూరల్), ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భగేల్ (రాజ్‌నంద్‌గావ్) ప్రజల తీర్పు కోరుతున్నారు. కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ (తిరువనంతపురం), ప్రముఖ సినీ నటి, బీజేపీ నేత హేమమాలిని (మధుర), విశేష ఆదరణ పొందిన దూరదర్శన్ రామాయణ సీరియల్ రాముడు పాత్రధారి అరుణ్ గోవిల్ (మీరట్), బీజేపీ యువ నేత తేజస్వీ సూర్య (బెంగళూరు దక్షిణ)లు రెండో విడతలో ఉన్న ప్రముఖులు. కాగా, 34.80 లక్షల మంది కొత్తవారు సహా 15.88 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 8.08 కోట్ల మంది పురుషులు, 7.8 కోట్ల మంది మహిళలు ఉన్నారు. ఏడు విడతలకు గాను 21 రాష్ట్రాల్లోని 102 సీట్లకు తొలి దశలో భాగంగా ఈ నెల 19న పోలింగ్ నిర్వహించారు.

బీజేపీకి గట్టి పోటీ తప్పదా?

రాహుల్ గాంధీతో పాటు అసెంబ్లీ, లోక్‌సభ బరిలో ఓటమి ఎరుగని కేసీ వేణుగోపాల్, నాలుగో సారి గెలుపును ఆశిస్తున్న శశిథరూర్ వంటి వారి పోటీతో మలి విడతలో కళ్లన్నీ కేరళపైనే ఉన్నాయి. 2.77 కోట్ల మందిపైగా ఓటర్లున్న ఈ రాష్ట్రంలో ఇండియా కూటమిలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, వామపక్షాలు నేరుగా తలపడుతున్నాయి. కాగా, రెండో దశలో కూడా ఇండియా కూటమి నుంచి బీజేపీకి గట్టి పోటీ తప్పదని, ముఖ్యంగా కేరళ, కర్ణాటక, మహారాష్ట్రలో ఎన్నికలు జరిగే 42 స్థానాలలో అత్యధిక స్థానాలు 'ఇండియా'కే వస్తాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. బిహార్‌లోని కిషన్‌గంజ్, పూర్ణియా, భగల్పూర్, కతిహార్‌లో ఎన్డీఏకు గట్టి పోటీ నెలకొంది. యూపీలోని 8 సీట్లలో ఎన్డీఏ, ఇండియా కూటములతో పాటు బీఎస్పీ కూడా రంగంలోకి దిగడంతో ముక్కోణపు పోటీ ఏర్పడింది. కేరళలో బీజేపీకి ఒక్క సీటు కూడా వచ్చే అవకాశాలు లేవని, రాజస్థాన్‌లో కూడా గతంలోలా 25కు 24 సీట్లు గెలుచుకునే అవకాశాల్లేవని అంచనాలు వెలువడుతున్నాయి.

కొలువులకు కాంగ్రెస్ ఎసరు

(మొదటి పేజీ తరువాయి)

హక్కులకు ఎసరుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని మోదీ హెచ్చరించారు. "ఓబీసీల హక్కులను ముస్లింలకు అందజేయాలని చూస్తున్నారు. సమాజ్‌వాదీ దృష్టిలో బీసీలంటే యాదవులేనా? యాదవులంటే వారి(అఖిలేశ్) కుటుంబం సభ్యులేనా? బుదౌన్, మణిపురి, ఫిరోజాబాద్, ఆజంగఢ్, కన్నౌజ్‌లలో వారి కుటుంబ సభ్యులకే టికెట్లు ఇచ్చుకున్నారు" అంటూ ప్రధాని మండిపడ్డారు. పేరుకు యాదవులమనే చెప్పుకొంటారు కానీ, శ్రీకృష్ణుడిని అవమానిస్తారని అఖిలేశ్ కుటుంబాన్ని విమర్శించారు. "నేను సముద్రగర్భంలో ద్వారకను సందర్శించినప్పుడు రాకుమారుడు(రాహుల్‌గాంధీని ఉద్దేశించి) ఆటపట్టించేలా మాట్లాడారు. ఇప్పుడు ఆ రాకుమారుడికి అఖిలేశ్ హారతిపడుతున్నారు" అంటూ విరుచుకుపడ్డారు. ఆగ్రాలో జరిగిన ర్యాలీలోనూ కాంగ్రెస్-సమాజ్‌వాదీ పార్టీలపై ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. "ఆ రెండు పార్టీలు ఉత్తరప్రదేశ్‌లో తమ ఓటుబ్యాంకు కోసం బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నాయి" అని విమర్శించారు. అంతకు ముందు మధ్యప్రదేశ్‌లోని సాగర్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని ద్వేషిస్తోందని.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చెందిన కోటాను ముస్లింలకు కట్టబెట్టాలని కుట్రలు చేస్తోందని దుయ్యబట్టారు. 2009, 2014 ఎన్నికల మేనిఫెస్టోల్లోనూ కాంగ్రెస్ మతపరమైన రాజకీయాలను గురించి ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ చర్యలను చౌకీదార్(మోదీ తనను తాను కాపలాదారు అంటూ సంబోధించుకునే పేరు) అడ్డుకుంటారని, ఆ పార్టీని నిలువరించడానికి లోక్‌సభలో 400 సీట్లు కావాలని ప్రజలను కోరారు. ఇందిరా గాంధీ మృతి తరువాత అధికారంలోకి వచ్చిన రాజీవ్ గాంధీ, ఆమె సంపద ప్రభుత్వ పరం కాకుండా చూడటానికే అప్పట్లో వారసత్వ పన్నును రద్దు చేశారని మోదీ ఆరోపించారు. ఎంపీలోని మొరెనాలో ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. వారసత్వ పన్నును కాంగ్రెస్ మళ్లీ తెస్తానంటోందన్నారు. కాంగ్రెస్ లూటీ నుంచి ప్రజల సంపదను కాపాడితీరతానని ప్రధాని స్పష్టం చేశారు.

ఇస్లామీకరణే కాంగ్రెస్ ఎజెండా: యోగి

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. గురువారం లఖ్‌నవూలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న యోగి.. కాంగ్రెస్ వస్తే దేశంలో ఇస్లామీకరణ జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. "రంగనాథ్‌మిశ్రా కమిటీ సిఫారసులను అమలు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పని చేస్తోంది. 27 శాతం బీసీ రిజర్వేషన్లలో ఆరు శాతాన్ని ముస్లింలకు ఇవ్వాలని ఆ కమిటీ సిఫారసు చేసింది. ఇప్పుడు కర్ణాటకలో కాంగ్రెస్ దాన్ని అమలు చేస్తోంది. సచార్ కమిటీ ముస్లింల ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేసింది. ఆ కమిటీ సిఫారసులనూ అమలు చేయడానికి ప్రయత్నిస్తోంది" అని విమర్శించారు.

మోదీ, రాహుల్ పేర్లు లేకుండా బీజేపీ, కాంగ్రెస్‌కు ఈసీ నోటీసులు

- స్టార్ క్యాంపెయినర్లంటూ పేర్కొన్న ఈసీ
- కాంగ్రెస్‌పై మోదీ వ్యాఖ్యలు.. స్పందించడానికి నిరాకరించిన ఈసీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ వస్తే.. సంపదను దోచుకుని ముస్లింలకు పంచుతుంది. మహిళల మెడల్లోని మంగళ సూత్రాలను కూడా వదలరు" అంటూ ప్రధాని మోదీ.. "తమిళులు తమిళం మాట్లాడొద్దు.. కేరళీయులు మళయాలం మాట్లాడొద్దు.. ఇదే బీజేపీ నైజం" అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై అందిన ఫిర్యాదులపై కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) గురువారం స్పందించింది. ఈ మేరకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అధ్యక్షుడు జేపీ నడ్డా, మల్లికార్జున ఖర్గేలకు నోటీసులు జారీ చేసింది. అయితే.. నోటీసుల్లో ఎక్కడా మోదీ, రాహుల్ పేర్లను ప్రస్తావించలేదు. రాజస్థాన్‌లో మోదీ వ్యాఖ్యలపై ఈ నెల 21న కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సూర్జేవాలా.. ఆ తర్వాత సీపీఎం, సీపీఐ నేతలు ఈసీకి ఫిర్యాదు చేశారు. అదేవిధంగా కేరళలోని కోటాయంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై ఈ నెల 19న బీజేపీ నేత ఓం పాఠక్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను పరిశీలించిన ఈసీఐ.. ఇరు పార్టీల చీఫ్‌లకు నోటీసులు ఇచ్చింది. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 77 ప్రకారం నోటీసులను జారీ చేసినట్లు పేర్కొన్న ఈసీఐ.. ఈ నెల 29వ తేదీన ఉదయం 11 గంటల లోపు సమాధానాలివ్వాలని ఆదేశించింది. నోటీసుల్లో మోదీ, రాహుల్ పేర్లను ఎక్కడా ప్రస్తావించకుండా.. 'స్టార్ క్యాంపెయినర్లు' నియమావళిని ఉల్లంఘించారని పేర్కొంది. హుందాగా ప్రచారం చేయాల్సిన స్టార్ క్యాంపెయినర్లు తీవ్ర వ్యాఖ్యలు చేస్తే.. పరిస్థితి జటిలంగా మారుతోందని తెలిపింది. మోదీ, రాహుల్ పేర్లతో కాకుండా.. పార్టీ అధ్యక్షులకు నోటీసులు ఇవ్వడంపై ఈసీఐ విమర్శలను ఎదుర్కొంటోంది. ఈ చర్యపై పరిశీలకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈసీఐ వైఖరి అనుమానాలను లేవనెత్తుతున్నాయని చెబుతున్నారు. విద్వేష వ్యాఖ్యలు చేసిన ప్రధాని మోదీకి నేరుగా నోటీసులు ఎందుకివ్వలేదని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు రాహుల్ తన ఎన్నికల ప్రచారంలో బీజేపీ పాలనపై తప్పుడు ప్రచారం, దళితుడైనందునే తనను అయోధ్య ప్రారంభోత్సవానికి ఆహ్వానించలేదని ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ ఫిర్యాదులను ఒకే విధంగా పరిగణిస్తూ నోటీసులు ఇవ్వడమేంటని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వారికి అలా.. వీరికి ఇలా..!

నిజానికి ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్-77 స్టార్ క్యాంపెయినర్లకు ఉండే వెసులుబాట్లను గురించి వివరిస్తోంది. ఇటీవల తెలంగాణ మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు విషయంలో ఆయనకు ఇదే సెక్షన్ కింద నేరుగా నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రినాటె, పశ్చిమ బెంగాల్ బీజేపీ ఎంపీ దిలీప్ ఘోష్, ఆఆప్ మంత్రి ఆతిశి, కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సూర్జేవాలా విషయంలోనూ వారికే నేరుగా నోటీసులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో మోదీ, రాహుల్ విషయంలో ఆ పార్టీల అధ్యక్షులకు నోటీసులు ఇవ్వడంపై రాజకీయ విశ్లేషకుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. సంపదను దోచిపెడతారంటూ మోదీ చేసిన వ్యాఖ్యలపై విలేకరులు ఈసీని పదేపదే ప్రశ్నించినా.. సమాధానాన్ని దాటవేయడాన్ని విశ్లేషకులు తప్పుబడుతున్నారు.

వీవీప్యాట్ల స్లిప్పుల లెక్కింపుపై నేడు సుప్రీంకోర్టు తీర్పు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: ఎలక్ట్రానిక్ వోటింగ్ మిషన్ (ఈవీఎం)లో నమోదైన ఓట్లతో సరిపోయేలా వీవీప్యాట్‌లోని నూరు శాతం స్లిప్‌లను కూడా లెక్కించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలపై శుక్రవారం సుప్రీంకోర్టు తీర్పు చెప్పనుంది. ఉదయం 10.30 గంటలకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం నిర్ణయాన్ని వెలువరించనుంది. శుక్రవారమే రెండో దశ ఎన్నికల్లో భాగంగా 89 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుండడం గమనార్హం. అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్)తో పాటు మరికొందరు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికలను నియంత్రించలేమని బుధవారం విచారణ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించడం గమనార్హం. ఈవీఎంల సామర్థ్యంపై అనుమానాలు ఉన్నంత మాత్రాన ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని తెలిపింది.

కోర్టుల సమాచారం ఇక వాట్సాప్‌కు..

- కేసుల లిస్టింగ్, తీర్పులు, మొత్తం వివరాలన్నీ సెల్‌ఫోన్లకే
- సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ప్రకటన




న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: కోర్టు కార్యకలాపాల డిజిటలైజేషన్ దిశగా మరో ముందడుగు వేసినట్టు గురువారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ప్రకటించారు. ఇక నుంచి కేసుల లిస్టింగ్, ప్రతి రోజూ ధర్మాసనం ముందుకు వచ్చే కేసుల జాబితా అయిన కాజ్ లిస్ట్, తీర్పులు ఇతర సమాచారాన్ని వాట్సాప్ ద్వారా న్యాయవాదులకు, కక్షిదారులకు పంపించనున్నట్టు వెల్లడించారు. సర్వోన్నత న్యాయస్థానం వినియోగిస్తున్న ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ)తో వాట్సాప్‌ను అనుసంధానం చేసినట్టు తెలిపారు. ప్రైవేటు ఆస్తులను కూడా సమాజ వనరులుగా పరిగణించవచ్చా? అన్న కేసును చేపట్టిన తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి ఆధ్వర్యం వహించిన ఆయన.. విచారణను ప్రారంభించేందుకు ముందు ఈ విషయాన్ని ప్రకటించారు. న్యాయాన్ని పొందే హక్కును బలోపేతం చేసేందుకు, న్యాయ వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సమాచారం పంపించే సుప్రీంకోర్టు వాట్సాప్ నెంబరును కూడా ఆయన వెల్లడించారు. 8767687676 నుంచి సమాచారం వస్తుందని, కానీ ఈ నెంబరుకు ఫోన్ చేయడానికిగానీ, మెసేజ్‌లు పంపడానికిగానీ వీలుపడదని తెలిపారు. దీంతో కోర్టు వ్యవహారాల శైలిలోనే చెప్పుకోదగ్గ మార్పులు వస్తాయని, 'బిగ్ బ్యాంగ్' తరహాలో ప్రభావం చూపిస్తుందని వ్యాఖ్యానించారు. దీర్ఘకాలంలో కాగితాలను ఆదా చేసి తద్వారా భూవిని సంరక్షించగలుగుతామని ఆయన అభిప్రాయపడ్డారు. చిన్న కేసుల విషయంలో మారుమూల ప్రాంతాల వారు కూడా కోర్టు కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని చెప్పారు. దీని నిర్వహణ బాధ్యతను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) పరిధిలోని మేఘరాజ్ క్లౌడ్ 2.0కు అప్పగించినట్టు వివరించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయం విప్లవాత్మకమని అభివర్ణించారు.

ప్లేస్‌మెంట్ల కోసం ప్రత్యేక పోర్టల్

- 30న ప్రారంభం.. ఏఐసీటీఈ, అప్నాకో సంయుక్తంగా రూపకల్పన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: విద్యార్థులకు ఉద్యోగాల విషయమై మార్గదర్శనం చేసేందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుయేషన్-ఏఐసీటీఈ) ప్రత్యేకంగా పోర్టల్‌ను రూపొందించింది. ఏఐసీటీఈ కెరీర్ పోర్టల్ పేరుతో రూపొందించిన ఈ సాంకేతిక వేదికను ఈ నెల 30న ఆవిష్కరించనుంది. ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫారం అయిన అప్నా.కో భాగస్వామ్యంతో దీన్ని రూపొందించింది. సుమారు 30 లక్షల మంది విద్యార్థులు ఉద్యోగ, ఇంటర్న్‌షిప్ సదుపాయాలను చూపించడం ఈ పోర్టల్ లక్ష్యం. ప్లేస్‌మెంట్‌ల విషయంలో 12వేల కళాశాలలకు మార్గదర్శనం చేయనుంది. ప్రధాన కంపెనీలతో సంబంధాలు పెంచుకోవడానికి కూడా ఈ పోర్టల్ ఉపకరిస్తుందని ఏఐసీటీఈ చైర్మన్ టి.జి.సీతారాం చెప్పారు. విద్యార్థులు సిలికాన్ వ్యాలీ ఇమ్మెర్సన్ ప్రోగ్రాంలో పాల్గొనేందుకు కూడా అవకాశం ఉంటుంది. ఈ ప్రోగ్రాం కింద విద్యార్థులు అమెరికాలోని సిలికాన్ వ్యాలీకి వెళ్లి గూగుల్, మైక్రోసాఫ్ట్, యాపిల్ వంటి కంపెనీల ప్రముఖులను కలిసే అవకాశం ఉంటుంది.

లోకం తీరు





29న రాష్ట్రంలో జేపీ నడ్డా పర్యటన

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఈనెల 29న రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన, సోమవారం ఉదయం 10 గంటలకు కొత్తగూడెం, మధ్యాహ్నం 12 గంటలకు మహబూబాబాద్‌ల్లో నిర్వహించే బహిరంగసభల్లో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం, మల్కాజ్‌గిరిలో నిర్వహించే రోడ్డు షోలో జేపీ నడ్డా పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు.



రిజర్వేషన్ల రద్దుకు కుట్ర

(V పేజీ తరువాయి)

కలిసి 'నయవంచన.. పదేళ్లమోసం-వందేళ్ల విధ్వంసం' పేరిట బీజేపీపై రూపొందించిన చార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. బీజేపీ కుట్రల గురించి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఎన్నికలకు ముందు మోదీ ఇచ్చిన పలు హామీల అమలులో ఎలా విఫలమైందీ రేవంత్ గణాంకాలతో సహా వివరించారు. ప్రధాని మోదీ దేశాన్ని రూ.168 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ముంచారని విమర్శించారు. గతంలో 14 మంది ప్రధానులు రూ.54 లక్షల కోట్లు అప్పులు చేస్తే.. మోదీ ప్రభుత్వం కేవలం పదేళ్లలో రూ.113 లక్షల కోట్లు అప్పులు చేసిందని ఆరోపించారు. అరవై ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడబెట్టిన ఆస్తులను మోదీ ప్రభుత్వం పదేళ్లలో కార్పొరేట్‌లకు కట్టబెట్టిందని విమర్శించారు. 2025 నాటికి ఆరెస్సెస్ ఆవిర్భవించి వందేళ్లు అవుతుందని.. అప్పటికి రిజర్వేషన్లు రద్దు చేయాలనే విధానంతో సంఘ్ ఉందని, ఆ విధానాన్నే బీజేపీ అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. మండల్ కమిషన్ సిఫారసు మేరకు ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తే కమండల్ పేరిట కమలనాథులు రిజర్వేషన్లను వ్యతిరేకించారని గుర్తుచేశారు. అలాంటిది.. వర్గీకరణ కోసం కొట్లాడినవారు ఇప్పుడు బీజేపీకి ఎందుకు మద్దతు ఇస్తున్నారో తెలియడం లేదన్నారు. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ వైపు నిలబడవద్దని సూచించారు. కుల గణన పూర్తిచేసి, దేశంలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలుకు రాహుల్‌గాంధీ కట్టుబడి ఉన్నారని రేవంత్ పేర్కొన్నారు. అంతకు ముందు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ పదేళ్లలో దేశంలోని అన్ని వర్గాలకూ బీజేపీ అన్యాయం చేసిందని మండిపడ్డారు. 'సబ్‌కా సాథ్.. సబ్‌కా విశ్వాస్' అంటూ ప్రధాని మోదీ అందరి ఓట్లూ తీసుకుని.. 'సబ్‌కా సత్యేనాశ్' అంటూ అన్ని వర్గాలనూ అధోగతిపాలు చేశారని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ నిప్పులు చెరిగారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు ఎ.అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష కోట్లతో మూసీ అభివృద్ధి..

ఎన్నికల ప్రచారంలో భాగంగా.. సీఎం రేవంత్ గురువారం రాత్రి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డితో కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హైదర్‌గూడ, అత్తాపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీజేపీ అంటే.. బ్రిటీష్ జనతా పార్టీ అని.. ఆ పార్టీది బ్రిటీషోళ్ల ఎజెండా అని ధ్వజమెత్తారు. దేశ ప్రజలను బానిసలుగా చేసి దోచుకున్న ఈస్టిండియా కంపెనీ గుజరాత్‌లోని సూరత్ నుంచి వచ్చిందని.. దాన్ని ఆదర్శంగా తీసుకున్న మోదీ, అమిత్ షా కూడా సూరత్ నుంచే వచ్చారని విమర్శించారు. బ్రిటిష్ వాళ్లు ఉన్నప్పుడు దేశంలో రిజర్వేషన్లు లేవని.. ఇప్పుడు కూడా లేకుండా చేసేందుకు బీజేపీ నేతలు కుట్రపన్నుతున్నారని మండిపడ్డారు. పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయలేదని ఆగ్రహం వెలిబుచ్చారు. కేసీఆర్ బస్సుయాత్రను చూస్తుంటే.. వంద ఎలుకలను తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయినట్టుందని ఎద్దేవా చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ సచివాలయానికి రాలేదని.. ప్రజలను ప్రగతిభవన్‌కు రానివ్వలేదని విమర్శించారు. రూ.లక్ష కోట్లతో మూసీనదిని అభివృద్ధి చేస్తానని సీఎం ఈ సందర్భంగా ప్రజలకు హామీ ఇచ్చారు. లక్ష ఓట్ల ఆధిక్యంతో రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని పిలుపునిచ్చారు. కాగా.. ప్రచారంలో భాగంగా హైదర్‌గూడకు చేరుకున్న సీఎం రేవంత్ సమక్షంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉప్పర్‌పల్లికి చెందిన సామ ఇంద్రపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం.. కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేశ్, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డితో కలిసి కంటోన్మెంట్ పరిధిలోని అన్నానగర్‌లో గురువారం రాత్రి సీఎం రోడ్‌షో నిర్వహించారు. వారిద్దరినీ గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కొడంగల్‌లో ఎన్నో కుట్రలతో ఓడిన తనను.. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రజలు తనను లోక్‌సభకు పంపారని గుర్తుచేసుకున్నారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో కలిపితేనే ఆ ప్రాంత సమస్యలు పరిష్కారమవుతాయని సీఎం పేర్కొన్నారు. కాగా.. ఎన్నికల ప్రచారంలో భాగంగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పెద్దశంకరంపేటలో శుక్రవారం నిర్వహించనున్న కాంగ్రెస్ జనజాతర సభలో రేవంత్ పాల్గొననున్నారు.


హైదర్‌గూడ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం కాన్వాయ్ అంబులెన్స్‌లో సామాన్యుడికి చికిత్స

రేవంత్ ప్రసంగిస్తుండగా రోడ్ షోకు హాజరైన ఒక వ్యక్తి స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే ప్రసంగాన్ని ఆపిన సీఎం.. అతడికి వెంటనే నీరు తాగించాలని, పక్కనే ఉన్న తన కాన్వాయ్‌లోని అంబులెన్స్‌లోకి తీసుకెళ్లి ప్రథమచికిత్స చేయాలని వైద్యులకు వేదికపైనుంచే సూచించారు. దీంతో రేవంత్ భద్రతా సిబ్బంది హుటాహుటిన ఆ వ్యక్తిని అంబులెన్స్‌లోకి తీసుకెళ్లగా వైద్యులు చికిత్స చేశారు. ఈ పరిణామాలను గమనించిన ప్రజలు సీఎం.. సీఎం అంటూ పెద్దపెట్టున జయజయధ్వానాలు చేశారు.

రక్తంతో సీఎం రేవంత్ చిత్రపటం

సీఎంకు కానుకగా అందించిన యువకుడు

మడికొండ, వరంగల్ కార్పొరేషన్: తన రక్తంతో అభిమాన నాయకుడి చిత్రపటాన్ని గీయించి తాను ఎంతగానో ఇష్టపడే నేతపై ప్రేమను చాటుకున్నాడో యువకుడు. హనుమకొండ జిల్లాకు చెందిన తోట పవన్.. రేవంత్ రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఓ సారి పవన్‌పై దాడి జరగడంతో రేవంత్‌రెడ్డి పరామర్శించారు. "భయం వద్దు.. నేనున్నా" అంటూ తనలో ధైర్యం నింపారని, అప్పటి నుంచి ఆయనపై అభిమానం మరింతగా పెరిగిందని పవన్ తెలిపారు. ఈ క్రమంలో తన రక్తంతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రం గీయించాడు. బుధవారం మడికొండలో జరిగిన జన జాతర సభలో సీఎంకు బహుమతిగా అందజేసి అభిమానాన్ని చాటుకున్నాడు. కాగా, జనజాతర సభలో ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై హనుమకొండ జిల్లా వంగపహాడ్ గ్రామానికి చెందిన రైతులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ.. ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. గత ప్రభుత్వాలు రైతులను పట్టించుకోలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రైతులను అక్కున చేర్చుకుందని కొనియాడారు.



ఖమ్మం.. కాంగ్రెస్ జిల్లా అని చాటుతాం

- 'అసెంబ్లీ' స్ఫూర్తితో ఈ ఎన్నికల్లోనూ గెలుస్తాం
- ఖమ్మం, మహబూబాబాద్‌లో భారీ మెజారిటీ ఖాయం
- మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎంపీ రేణుకా చౌదరి

ఖమ్మం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌ను గద్దె దించామని, అదే స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికల్లోనూ గెలుస్తామని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీని ఓడించి.. రాహుల్‌ను ప్రధానిని చేసుకోవాలంటే కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఖమ్మం.. కాంగ్రెస్ జిల్లా అని చాటాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ఖమ్మం అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి నామినేషన్ అనంతరం గురువారం వారు మీడియాతో మాట్లాడారు. అందరి అభిప్రాయం మేరకే సురేందర్‌రెడ్డి కుమారుడు రఘురాంరెడ్డికి అధిష్ఠానం ఖమ్మం టికెట్ ఇచ్చిందని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ త్యాగాలకు నిదర్శనం సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ అని అన్నారు. ఇండియా కూటమి పక్షాన ఈ సారి రాహుల్‌ను ప్రధానిని చేసేందుకు ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో కాంగ్రెస్‌ను మంచి మెజారిటీతో గెలిపిద్దామన్నారు. ఎంపీ రేణుకా చౌదరి మాట్లాడుతూ అధిష్ఠానంతో పాటు జిల్లా ఎమ్మెల్యేల నిర్ణయం మేరకు ఖమ్మం అభ్యర్థిగా రఘురాంరెడ్డిని ఎంపిక చేసినట్టు తెలిపారు. కాంగ్రెస్ ఎంపీలు ఎక్కువ మంది గెలిస్తే రాష్ట్రానికి సంబంధించిన నిధులు, హక్కులు సాధించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రధాని మోదీ మహిళల మంగళసూత్రాలను కాంగ్రెస్ లాక్కొంటుందని హేళనగా మాట్లాడడం బాధాకరమన్నారు. మంగళసూత్రాల విలువ ఆయనకేం తెలుస్తుందన్నారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడుతూ మోదీ పాలనలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని, రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ కుటుంబానికి చెందిన తాను ఖమ్మం జిల్లాకు లోకల్ వాడినేనని, అన్ని నియోజకవర్గాల ప్రజలు తనకు ఓటేసి దీవించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం గాడి తప్పిందన్నారు. మతపరంగా ప్రజల్లో చిచ్చుపెట్టి బీజేపీ లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. ఖమ్మం, మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌ను గెలిపించి సత్తా చూపుతామన్నారు.

సౌత్‌జోన్ డీసీపీగా స్నేహామెహ్రా

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని సౌత్ జోన్ డీసీపీగా స్నేహామెహ్రా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి అవినాశ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. స్నేహామెహ్రా 2018 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. స్నేహామెహ్రా తక్షణం బాధ్యతలు చేపట్టాలని అందుకు సంబంధించిన నివేదిక శుక్రవారం ఉదయం 11 గంటల్లోగా ఎన్నికల సంఘానికి సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు

లోకసభ ఎన్నికల కోసం ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీని టీపీసీసీ నియమించింది. ఈ కమిటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో పాటు మరో ఏడుగురు సీనియర్ నాయకులు ఉంటారని తెలిపింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.


రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేటలో మాట్లాడుతున్న కేటీఆర్

కాంగ్రెస్‌లోకి ఎవరొచ్చినా చేర్చుకుంటాం

- అందరినీ తీసుకోవాలని ఏఐసీసీ ఆదేశం
- నేతలెవరూ నారాజ్ కావొద్దని సూచన
- చేరికల్లో ఎలాంటి షరతులూ లేవు
- అంతా కలిసి పనిచేయాల్సిందే: జగ్గారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లోకి ఎవరొచ్చినా చేర్చుకోవాలని ఏఐసీసీ ఆదేశించిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. గతంలో పార్టీ అభ్యర్థికి నష్టం చేసినవాళ్లయినా చేర్చుకోవాలని ఏఐసీసీ నిర్ణయించదని వెల్లడించారు. నాయకులు ఎవరూ నారాజ్ కావొద్దని.. అంతా కలిసి పని చేయాల్సిందేనని చెప్పారు. తనకు వ్యతిరేకంగా పని చేసిన వాళ్లు వచ్చి కాంగ్రెస్‌లో చేరినా అభ్యంతరం చెప్పేది లేదని స్పష్టం చేశారు. గురువారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కోదండరెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఆప్కో మాజీ ఛైర్మన్ మండల శ్రీరాములు, యువజన నాయకులు మానవతారాయ్, కాట ప్రదీప్ గౌడ్, మెదక్ బాల కృష్ణ తదితరులకు జగ్గారెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడారు. ఎన్నికల వరకు కాంగ్రెస్‌లో పని చేసి.. ఎన్నికల సమయంలో కొందరు బయటకు వెళ్లారని.. వాళ్లందరినీ తిరిగి చేర్చుకోవాలని పీసీసీని ఏఐసీసీ ఆదేశించిందని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి ఎవరు వచ్చినా చేర్చుకోవాలనే ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. పార్టీలోకి రావాలనుకున్న వారందరికీ కండువా కప్పేస్తామని అన్నారు. చేరికల్లో షరతులు లేవని స్పష్టం చేశారు. ఎన్నికల్లో తమకు వ్యతిరేకంగా పని చేసిన వాళ్లతో స్థానిక నాయకులకు కొంత ఇబ్బంది ఉంటుందన్నారు. తన నియోజకవర్గంలో తనకు వ్యతిరేకంగా కొందరు పని చేశారని.. వాళ్ల వల్ల ఓడిపోయినందున.. ఎందుకు చేర్చుకోవాలనే కోపం ఉండటం సహజమన్నారు. అయినప్పటికీ పార్టీ ఆదేశాల మేరకు అలాంటి వారికి సైతం కాంగ్రెస్ కండువా కప్పాల్సిందేనని తెలిపారు. ఎవరూ నారాజ్ కావొద్దని, మీడియాకు ఎక్కొద్దని అధిష్ఠానం ఆదేశించిందని పేర్కొన్నారు. కొత్తగా ఎవరు పార్టీలో చేరినా వాళ్లంతా భవిష్యత్‌లో కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌ల వద్ద, ఎమ్మెల్యేల కిందనే పని చేయాలని పార్టీ ఆదేశించినట్టు వెల్లడించారు. పార్టీలో చేరే వాళ్లంతా డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందని జగ్గారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి నిర్దిష్టమైన సిద్ధాంతం, నియమాలున్నాయని చేరికల కమిటీ ప్రతినిధి కోదండరెడ్డి అన్నారు. ప్రాంతీయ పార్టీలకు అవకాశవాదమే ఎజెండా అని ఆరోపించారు. బీజేపీ సైతం రూపాంతరం చెందిందన్నారు. అద్వానీ, మోదీలు వేర్వేరు పద్ధతుల్లో విధ్వంసం చేశారని విమర్శించారు.


జగ్గారెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న గుండు సుధారాణి, మానవతారాయ్

దమ్ముంటే భార్యాపిల్లల మీద ఒట్టెయ్!

- ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్
- అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చారు
- 12 సీట్లు ఇవ్వండి.. ఏడాదిలో కేసీఆర్ సర్కార్ వస్తుంది
- చేసిందేమీ లేకనే మోదీ మత రాజకీయం:కేటీఆర్

సిరిసిల్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైతుల రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్లు వేస్తున్నారని, కానీ, ఆయనకు దమ్ముంటే భార్యాపిల్లల మీద ఒట్టేసి చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. 'బ్యాంకులకు వెళ్లి రూ.2 లక్షల రుణం తెచ్చుకోండి.. డిసెంబరు 9న రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కానీ, 150 రోజులవుతున్నా అది జరగలేదు' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని దేవుళ్ల మీద రేవంత్‌రెడ్డి ఒట్లు వేస్తున్నారని గుర్తుచేశారు. రేవంత్‌కు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే ఆగస్టు 15వ తేదీలోపు రైతు రుణమాఫీ చేస్తామని ఆయన భార్యాపిల్లలపై ఒట్టు వేయాలి అని చెప్పారు. అధికారంలోకి రావటం కోసం కాంగ్రెస్ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించిందన్నారు. మహిళలకు రూ.2500, కల్యాణలక్ష్మితో తులం బంగారం, రెండు లక్షల రుణ మాఫీ, రూ.4 వేల పెన్షన్ వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల పరిస్థితి పాలిచ్చే బర్రెను అమ్ముకొని దున్నపోతును కొనుక్కున్నట్లు అయ్యిందన్నారు. మళ్లీ కేసీఆర్ కావాలంటే ప్రజలు బీఆర్ఎస్‌కు 12 లోక్‌సభ సీట్లు అప్పగించాలని, ఏడాదిలో కేసీఆర్ సర్కారు వస్తుందని తెలిపారు. చీకటి ఉంటేనే వెలుగు విలువ తెలుస్తుందన్నారు. కాంగ్రెస్ వచ్చాక నాలుగు నెలల్లోనే నేతన్నల, రైతుల ఆత్మహత్యలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 24 గంటల కరెంటు వ్యవసాయానికి ఇచ్చామని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత అది ఆగిపోయిందన్నారు.

నేత కార్మికుల ఆత్మహత్యలు.. ప్రభుత్వ హత్యలు

పదేళ్లలో దేశ ప్రజలకు మోదీ సర్కారు చేసిందేమీ లేదని, అందుకనే ఇప్పుడు దేవుళ్ల పేరుతో రాజకీయం చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. బండి సంజయ్ ఒక్కనాడైన పార్లమెంట్‌కు పోయి ప్రజా సమస్యలపై అడిగాడా అని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు యాదగిరి గుట్ట ఆలయం కట్టారని, కానీ, ఎన్నడైనా దేవుడి పేరు చెప్పి కేసీఆర్ ఓట్లు అడిగారా? అని నిలదీశారు. బీజేపీ 1980లో పుట్టిందని, శ్రీరాముడు వేల ఏళ్ల క్రితం త్రేతా యుగంలో పుట్టారని అన్నారు. సిరిసిల్లలో ఒకే రోజు ఇద్దరు నేత కార్మికులు ఆత్మహత్య చేసుకోవడం ప్రభుత్వం చేసిన హత్యగానే భావిస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. సిరిసిల్లలో ఆత్మహత్య చేసుకున్న వార్పిన్ కార్మికుడు అడిచెర్ల సాయి, తంగళ్లపల్లిలో పవర్‌లూం కార్మికుడు అంకారపు మల్లేశం కుటుంబాలను కేటీఆర్ పరామర్శించారు.

దేవుడి పేరుతో బీజేపీ ఓట్ల వేట

ఆ పార్టీ అంటేనే అక్షింతలు, పులిహోర, కాషాయ జెండాలు.. వారి పాలన డొల్ల.. దేశం పరువు పోయింది

- నా బిడ్డను జైల్లో వేసినా బీజేపీకి నేను భయపడలేదు
- భువనగిరి రోడ్ షోలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

యాదాద్రి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ పదేళ్ల పాలనంతా డొల్ల అని, తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారని, వారి హయాంలో దేశం పరువు పోయిందని, సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అన్నారని, మరి అభివృద్ధి ఏదీ..? అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రానికి ఏమీ చేయని ఆ పార్టీకి ఓట్లడిగే అర్హత లేదన్నారు. కేంద్ర మంత్రి ఉండి కూడా రూపాయి తేలేకపోయారని ఆరోపించారు. బీజేపీ అంటే అక్షింతలు, పులిహోర, తీర్థాలు, కాషాయ జెండాలు అని విమర్శించారు. యాదాద్రి ఆలయాన్ని తాము అద్భుతంగా అభివృద్ధి చేశామని, ఎన్నడైనా దాన్ని ఓట్ల కోసం వాడుకున్నామా? అని వ్యాఖ్యానించారు. తన బిడ్డను జైల్లో పెట్టినా బీజేపీకి భయపడలేదని, దేవుడు తనను తెలంగాణ కోసమే పుట్టించాడని, ప్రాణం ఉన్నంతవరకు రాష్ట్ర అభివృద్ధి, ప్రజల హక్కుల కోసం ఉద్యమిస్తానని స్పష్టం చేశారు. భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌కు మద్దతుగా గురువారం కేసీఆర్ ప్రచారం చేశారు. రాత్రి భువనగిరిలో రోడ్ షోలో మాట్లాడారు. బీజేపీ దేవుడి పేరుతో ఓట్లు దండుకుంటోందని.. కాంగ్రెస్ దేవుడి మీద ఒట్టు వేసి కాలం గడుపుతోందని విమర్శించారు. సీఎం యాదాద్రి మీద ఒట్టేసి చెబుతున్నారు కానీ చేయడం లేదన్నారు. అందరి తరఫున కొట్లాడే ఏకైక వ్యక్తి కేసీఆర్ అని.. పెద్ద మనిషిలా అన్నింటిపై యుద్ధం చేస్తానని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని కాంగ్రెస్ ఆరోపిస్తోందని.. భువనగిరి మున్సిపాలిటీలో ఆ పార్టీ చేసిందేమిటని నిలదీశారు. అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీకి ఓటేసినట్టేనని, బీఆర్ఎస్ లౌకిక పార్టీ అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అడుగడుగునా బీజేపీ ఇబ్బంది పెట్టిందని.. దానికి ఓటేస్తే మోటర్లకు మీటర్లు పెడతారని కేసీఆర్ హెచ్చరించారు. "కులం, మతం చూడకుండా పాలించి తెలంగాణను ఒడ్డుకు తెచ్చాం. అందరూ సంతోషంగా ఉండేలా పనిచేశాం. ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేశాం. మంచిగున్న తెలంగాణ ఆగమైతుంటే చూస్తూ ఊర్కోవాలా? పోరాడాలా? ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి పంచాయితీ పడ్డది. కేసీఆర్‌ను కిందపడేసి కొట్లాడమంటే ఎట్లా? కొట్లాడ్డానికి బలం కావాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి" అని కేసీఆర్ కోరారు. దేవుడు కేసీఆర్‌ను తెలంగాణ కోసమే పుట్టించాడని.. తెలంగాణ ప్రజల గుండెను చీల్చితే కేసీఆర్ కనిపిస్తాడని, కేసీఆర్ గుండెను చీలిస్తే కనిపించేది తెలంగాణ ప్రజలని పేర్కొన్నారు.

రైతు బంధు ఐదెకరాలకేనా?

అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. ఐదు ఎకరాలు ఉన్నవారికే రైతు బంధు ఇస్తామంటోందని.. మిగతా రైతులు ఏం కావాలని, మీ సొమ్మేమన్నా పోతుందా? అని కేసీఆర్ ప్రశ్నించారు. తాను పక్కకు జరగ్గానే కరెంటు కష్టాలు మొదలయ్యాయని.. ఇది కరెంటు ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వం అని మండిపడ్డారు. మిల్లర్లతో కుమ్మక్కై రైతులను నిలువునా ముంచుతున్నారని, 225 మంది చనిపోతే కనీసం పరామర్శించలేదని ఆరోపించారు. భువనగిరి గురుకులంలో విద్యార్థి మృతి చెందడంపై ఆవేదన వ్యక్తం చేశారు. "చేనేతల సంక్షేమం కోసం తెచ్చిన పథకాలను రద్దు చేశారు. రుణ మాఫీ మరిచిపోయారు. తులం బంగారం తుస్సుమనిపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, కల్యాణలక్ష్మి పథకం చెక్కులు బంద్ అయ్యాయి. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని ఎగ్గొట్టారు. అమ్మాయిలకు స్కూటీలు ఏమయ్యాయి? కరెంటు బిల్లులు అడ్డగోలుగా వస్తుండడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ధాన్యానికి బోనస్ ఇవ్వలేని ఈ పాలన అంతా బోగస్" అని కేసీఆర్ నిప్పులు చెరిగారు. పంటలన్నీ ఎండిపోయాయని, అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఈ పరిస్థితిని నివారించేందుకు ప్రభుత్వంపై ఇక యుద్ధం చేద్దామని పిలుపునిచ్చారు.


యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో కేసీఆర్ రోడ్‌షోకు హాజరైన కార్యకర్తలు, అభిమానులు

రాజీనామా లేఖతో నేనొస్తా.. నువ్వొస్తావా?

సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు సవాల్



మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 25: "కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తే తాను రాజీనామాకు సిద్ధమని, మాఫీ చేయకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామాకు సిద్ధమేనా? నేను రాజీనామా లేఖతో గన్‌పార్కు వద్దకు వస్తా.. రేవంత్‌కు ఆ దమ్ముందా?" అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ విసిరారు. ఇద్దరం కలిసి రాజీనామా లేఖలను మేధావులకు అందజేద్దామని, కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు, రుణమాఫీ అమలు చేస్తే తన రాజీనామా లేఖను ఆ మేధావులు స్పీకర్‌కు ఇస్తారని, చేయని పక్షంలో రేవంత్‌రెడ్డి రాజీనామా లేఖను గవర్నర్‌కు అందజేస్తారని చెప్పారు. ఈ ఒప్పందానికి సిద్ధమేనా అని ప్రశ్నించారు. మెదక్‌లో సోమవారం నిర్వహించిన రోడ్‌షోలో హరీశ్ మాట్లాడారు. కేసీఆర్ వల్లే కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాయని, రేవంత్‌రెడ్డి సర్కారు వాటిని రద్దు చేసే కుట్ర పన్నుతుందన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి పేగులు మెడలో వేసుకుంటానని మాట్లాడడం తగునా? అని ప్రశ్నించారు. బీజేపీ మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తున్నదని విమర్శించారు. మెదక్ జిల్లా గులాబీ పార్టీ అడ్డా అని, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా మరోసారి ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు. అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. గతంలో ఇక్కడ కలెక్టర్‌గా పని చేసిన అనుభవజ్ఞుడు వెంకట్రామారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాగా, ఆగస్టు 15న ఫాం హౌస్‌కు వెళ్లడానికి మూట-ముల్లె సర్దుకుని పెట్టుకోవాలని హరీశ్‌రావును ఉద్దేశించి పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావును బయటకు పంపే పనిలో కేసీఆర్, కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎంతో సవాల్ చేయడానికి హరీశ్‌కు ఉన్న అర్హత ఏంటని ప్రశ్నించారు. దమ్ముంటే మెదక్ పార్లమెంట్ స్థానాన్ని గెలిపించుకోవాలని సవాల్ విసిరారు.

ప్రధాని మోదీ అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

» సీఈవో వికాస్ రాజ్‌కు కాంగ్రెస్ నేతల వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారసభల్లో ప్రధాని మోదీ చేస్తున్న అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శోభారాణి నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు గురువారం సీఈవో వికాస్ రాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రధాని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలవారిని కించపరిచేలా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ప్రధాని వ్యాఖ్యలను సోషల్‌మీడియాలో ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

5 కిలోల బంగారం రూ.221 కోట్ల ఆస్తులు

హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత బాగా రిచ్



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత కుటుంబానికి రూ.221,40,09,647 విలువైన ఆస్తులు ఉన్నాయి. ఎన్నికల అఫిడవిట్‌లో ఆమె పేర్కొన్న వివరాల ప్రకారం.. మాధవీలత వద్ద 3.9కిలోల బంగారు నగలు, ఆమె భర్త విశ్వనాథ్ వద్ద 1.1 కిలోల బంగారం ఉంది. విరించి ఆస్పత్రి, ఇతరత్రా అన్నీ కలిపి మాధవీలత పేరిట రూ.31.31 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. విరించి లిమిటెడ్, వివో బయోటెక్ సంస్థల్లో ఆమెకు షేర్లు ఉన్నాయి. కుటుంబసభ్యుల పేరిట రూ.165.47కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయి. అలాగే, మాధవీలత దంపతులకు రూ.55.92కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. వీటిల్లో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, వాణిజ్య భవనాలు, అపార్ట్‌మెంట్లు, ప్లాట్లు ఉన్నాయి. మాధవీలతకు రూ.90లక్షలు, ఆమె భర్త విశ్వనాథ్‌కు రూ.26.13 కోట్ల అప్పులు ఉన్నాయి. కుమారుడు పేరిట సుమారు 11 లక్షల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. వారి కుటుంబసభ్యులందరి వద్ద కలిపి 365గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఆయనకు రూ.10.50లక్షల అప్పులు ఉండగా ఆయన కుమార్తె పేరిట రూ.18.51లక్షల రుణం ఉంది.

'కాసాని' ఆస్తులు రూ.213.35 కోట్లు



చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కుటుంబానికి రూ.213.35 కోట్లు ఆస్తులు ఉన్నాయి. కాసాని పేరిట రూ132.35 కోట్లు, ఆయన భార్య చంద్రకళ పేరిట రూ.81కోట్ల విలువైన ఆస్తులున్నాయి. అలాగే ఆయన కుటుంబానికి రూ.15.12కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయి. కాసానికి రూ.30లక్షల అప్పులు ఉన్నాయి. జ్ఞానేశ్వర్ దంపతుల వద్ద 120 తులాల బంగారు ఆభరణాలున్నాయి. ఆయనపై ఓ క్రిమినల్ కేసు ఉంది.

ఆత్రం సుగుణపై 50 క్రిమినల్ కేసులు

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణపై 50 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం..ప్రజా ఉద్యమంలో భాగంగా నమోదైన ఈ కేసులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. ఆత్రం సుగుణ వద్ద ఎలాంటి నగలు లేవు. సుగుణకు రూ.12.10 లక్షల విలువైన చరాస్తులు, ఆమె భర్త పేరిట రూ.42వేల విలువైన చరాస్తులు ఉన్నాయి. వారికి రూ.42.50 లక్షల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. సుగుణకు రూ.23.49 లక్షలు, ఆమె భర్తకు రూ.29.76 లక్షల అప్పులు ఉన్నాయి.

నగేశ్ స్థిరచరాస్తులు రూ.1.62 కోట్లు

ఆదిలాబాద్ బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ తనకు రూ.1.62కోట్ల విలువైన స్థిరచరాస్తులు ఉన్నాయి. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం.. ఆయన భార్య పేరిట రూ.24.79 లక్షల విలువైన చరాస్తులు ఉండగా కుమార్తె,

డీకే అరుణ ఆస్తి రూ.66.75 కోట్లు



మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి డీకే అరుణ కుటుంబానికి రూ. 66.75కోట్లు ఆస్తులు ఉన్నాయి. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ప్రకారం.. రూ. 26.47 కోట్ల విలువైన చరాస్తులు, రూ. 40.27 కోట్ల స్థిరాస్తులు, 1.54కిలోల బంగారు ఆభరణాలు, 93 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. డీకే అరుణ దంపతుల పేరిట రూ.2.26 కోట్ల బ్యాంకు డిపాజిట్లు, పలు కంపెనీల్లో రూ.28.45లక్షల విలువైన షేర్లు, రూ.16.50లక్షల విలువైన పోస్టాఫీసు బాండ్లు ఉన్నాయి. అరుణ పేరిట రూ.25లక్షల విలువైన కారు ఉండగా, ఆమె భర్త పేరిట రూ.9.50 కోట్ల విలువైన 80 వాహనాలు ఉన్నాయి.

రూ.10 కోట్ల ఆస్తులు.. రెండు కోట్ల అప్పులు



మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి రూ.10.83 కోట్ల ఆస్తులు, రూ.2.73 కోట్ల అప్పులు ఉన్నాయి. ఆయనకు రూ.3.39కోట్లు స్థిరాస్తులు, రూ. 7.44 కోట్ల చరాస్తులు ఉన్నాయి. ఆయన భార్య గీతారెడ్డి పేరిట రూ.2.39 కోట్ల విలువ చేసే చరాస్తులు ఉన్నాయి. హిందూ అవిభాజ్య కుటుంబ ఆస్తి రూ.2.72 కోట్లు ఉంది.

మల్లు రవి ఆస్తి 52.32 కోట్లు



నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి కుటుంబానికి రూ.52.32 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ప్రకారం.. రూ.26.49కోట్ల విలువైన స్థిరాస్తులు, రూ.25.82కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయి. మల్లు రవి దంపతుల వద్ద రూ.3.40లక్షల నగదు ఉంది. ఆయన కుటుంబానికి 870 గ్రాముల బంగారం, 10 గ్రాముల వజ్రాభరణాలు ఉన్నాయి కానీ సొంత వాహనం లేదు.

కాసుల రాజకీయం

లోక్‌సభ ఎన్నికల ఖర్చు రూ.1.2 లక్షల కోట్ల నుంచి 1.35 లక్షల కోట్లు

అమెరికా అధ్యక్ష ఎన్నికలకు మించి ఖర్చు.. ప్రపంచంలోనే అత్యధికం

» 2019లో ఒక ఓటుకు పెటిన ఖర్చు రూ.700.. ఇప్పుడది రూ.1400

» పార్టీలు, అభ్యర్థులు, ప్రభుత్వం ఈసీ.. అందరి ప్రత్యక్ష, పరోక్ష ఖర్చు ఇది

» పీటీఐ ఇంటర్వ్యూలో సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ చీఫ్ భాస్కర్ రావు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రూ.1.35 లక్షల కోట్లు.. అక్షరాలా లక్షా ముప్పై ఐదు వేల కోట్ల రూపాయలు! ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఎన్నికల తతంగంగా.. దేశవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల ఖర్చు ఇది! గెలవడానికి అభ్యర్థులు వెదజల్లుతున్న డబ్బు.. అధికారం కోసం పార్టీలు కుమ్మరిస్తున్న డబ్బు.. ప్రభుత్వం, ఈసీ ఎన్నికల నిర్వహణకు ఖజానా నుంచి తీసి ఖర్చుచేస్తున్న డబ్బు.. ఇది! ప్రభుత్వం, పార్టీలు, అభ్యర్థులు, ఎన్నికల కమిషన్.. అందరూ కలిసి ప్రత్యక్షంగా, పరోక్షంగా చేస్తున్న వ్యయం!! మూడున్నర దశాబ్దాలుగా దేశంలో జరుగుతున్న ఎన్నికల ఖర్చును ఎప్పటికప్పుడు లెక్కగడుతున్న సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్-ఢిల్లీ) అధినేత ఎన్.భాస్కర్‌రావు పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వివరాలు వెల్లడించారు. "ఈసారి ఎన్నికల ఖర్చు రూ.1.2 లక్షల కోట్లు ఉంటుందని మేం ప్రాథమికంగా అంచనా వేశాం. కానీ.. ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బహిర్గతమయ్యాక మా అంచనాలను రూ.1.35 లక్షల కోట్లకు పెంచాం" అని ఆయన వివరించారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించడానికి 3-4 నెలల ముందరి ఖర్చులను కూడా పరిగణనలోకి తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. పార్టీలు, అభ్యర్థులు రకరకాల మీడియాల్లో ప్రచారానికే తమ మొత్తం వ్యయంలో 30% కేటాయిస్తున్నట్టు వివరించారు.



ఎన్నికల బాండ్ల రూపంలోనే కాక.. అనేక మార్గాల్లో పార్టీలకు, అభ్యర్థులకు డబ్బులు అందుతున్నాయని ఆయన గుర్తుచేశారు. పార్టీలు, అభ్యర్థులు.. ఖర్చు పరిమితిని అధిగమించినా దొరక్కుండా తప్పించుకోవడానికి రకరకాల మార్గాలను అనుసరిస్తున్నట్టు భాస్కర్ రావు వివరించారు. సీఎంఎస్ లెక్కల ప్రకారమే.. 2019 ఎన్నికల్లో అయిన మొత్తం ఎన్నికల ఖర్చు రూ.60వేల కోట్లలో దాదాపు 45%బీజేపీ చేసిన వ్యయమే! 2024లో బీజేపీ ఖర్చు ఇంకా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

రెండు దశాబ్దాల్లో ఆరు రెట్లు..

2019లో మనదేశంలో ఒక్కో ఓటుకూ అందరూ కలిసి చేసిన ఖర్చు రూ.700. ఇప్పుడు అది ఏకంగా రూ.1240 నుంచి రూ.1400కు చేరడం గమనార్హం. 1998లో లోక్‌సభ ఎన్నికల ఖర్చు రూ.9వేల కోట్లు కాగా.. 2019 ఎన్నికల నాటికి ఆరు రెట్లు కావడం, ఆ తర్వాత ఐదేళ్లలో రెట్టింపు కావడం.. ఎన్నికల్లో పెరుగుతున్న ధనస్వామ్యానికి గుర్తని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికాలో 2020లో జరిగిన అధ్యక్ష ఎన్నికలకు 14.4 బిలియన్ డాలర్లు.. అంటే, రూ.1.2 లక్షల కోట్లు కాగా.. మన ఎన్నికల ఖర్చు అంతకు మించి కావడం గమనార్హం. ఎన్నికల్లో కార్పొరేట్ శక్తుల ప్రభావం అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. 2019 ఎన్నికల్లో 70శాతం మంది అభ్యర్థులు కార్పొరేట్ ఆర్థిక సాయం ద్వారా ఎన్నికల్లో పోటీపడ్డవారే. 2014 ఎన్నికల్లో ఆ సంఖ్య 30శాతం ఉండేది. ఎన్నికల సంఘం ఇచ్చిన నివేదిక ప్రకారం పార్టీల ఆర్థిక సాయం అందుకునే అభ్యర్థుల సంఖ్య 2014లో 42శాతం నుంచి.. 2019లో 17శాతానికి పడిపోయింది. 2009 నుంచి 2019 మధ్య దశాబ్దకాలంలో ఎన్నికల్లో పోటీ చేసే సంపన్నుల శాతం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. 2009లో రూ.కోటి అంతకుమించి ఉన్నవారి సంఖ్య 29% కాగా.. 2019లో వారి సంఖ్య 88శాతానికి (మొత్తం 474 మంది ఎంపీలు) పెరిగింది. నగదు ప్రవాహాన్ని కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలు నిష్ఫలంగా మారుతున్నాయి. వాస్తవ పరిస్థితులకు, నిబంధనలకు పొంతన ఉండటం లేదు.


గత ఆరు ఎన్నికల్లో ఎవరి ఖర్చెంత?

ఏడాది	అంచనా వ్యయం (రూ.కోట్లలో)	ఈసీ వాటా (%)	కాంగ్రెస్ కూటమి (%)	బీజేపీ కూటమి (%)
1998	9,000	13	30	20
1999	10,000	10	31-40	25
2004	14,000	10	35-45	30
2009	20,000	12	40-45	35-40
2014	30,000	12	30-32	40-45
2019	60,000	15	15-20	45-55

సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ గణాంకాల ప్రకారం 1998 నుంచి 2019 దాకా ఏ ఎన్నికల్లో ఎవరి ఖర్చు ఎంతో చూస్తే..

ఎన్నికల ఖర్చులో ఎవరి వాటా ఎంత?

అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ గణాంకాల ప్రకారం 2014, 2019 సంవత్సరాల్లో తమ ఎన్నికల ఖర్చు గురించి సిటింగ్ ఎంపీలు ఇచ్చిన వివరాలు..





నామినేషన్ వేయడానికి ర్యాలీగా వెళ్తున్న ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి, మంత్రులు తుమ్మల, పొంగులేటి తదితరులు

రాహుల్ ప్రధాని అయితే.. కులగణనతో రిజర్వేషన్ల పెంపు

» నెహ్రూ-అంబేడ్కర్‌ల రాజ్యాంగంతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రిజర్వేషన్లు

» మోదీ ప్రధాని అయితే రాజ్యాంగం రద్దు

» రిజర్వేషన్లు ఎత్తేస్తారు: జగ్గారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితే దేశ వ్యాప్తంగా కుల గణన చేసి రిజర్వేషన్లు పెంచుతారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. మోదీ మళ్లీ ప్రధాని అయితే రాజ్యాంగాన్ని రద్దు చేసి రిజర్వేషన్లు ఎత్తేస్తారని అన్నారు. గురువారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకరులతో మాట్లాడారు. నెహ్రూ, అంబేడ్కర్‌లు రాజ్యాంగాన్ని రాసి బడుగు, బలహీన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు.. మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించారని పేర్కొన్నారు. గడిచిన 75 ఏళ్లుగా రిజర్వేషన్లు అమలు చేయడం వల్లనే నేడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఎంతో ప్రయోజనం చేకూరిందని తెలిపారు. ఒకవేళ మళ్లీ మోదీ ప్రధాని అయితే రాజ్యాంగాన్ని రద్దు చేసి రిజర్వేషన్లను ఎత్తేస్తారని జగ్గారెడ్డి అన్నారు. దేశ ప్రజలంతా అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిన సమయం ఇదని చెప్పారు. ఇప్పుడు మనం తీసుకునే నిర్ణయాలు మన పిల్లల భవిష్యత్‌పై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు.

తెలంగాణ నుంచి 15 ఎంపీ సీట్లు గెలవాలి

దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కావాలంటే తెలంగాణ నుంచి 14-15 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎంపీలుగా గెలవాలని జగ్గారెడ్డి అన్నారు. రాహుల్ ప్రధాని అయితే ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారని చెప్పారు. గురువారం బీజేపీపై చార్జ్‌షీట్ విడుదల చేసినట్టు జగ్గారెడ్డి తెలిపారు. పదేళ్లపాటు దేశాన్ని మోదీ ఆగం చేశారని మండిపడ్డారు. ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. విదేశాల నుంచి నల్లధనం తీసుకొచ్చి ప్రతి నిరుపేద తెరిచిన జన్‌ధన్ అకౌంట్‌లో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి.. ఒక్క పైసా వేయలేదని మండిపడ్డారు. అలాగే ఏటా రెండు కోట్ల మందికి ఉద్యోగాలిస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని చెప్పారు. పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని జగ్గారెడ్డి ప్రశ్నించారు.



గాంధీ భవన్‌లో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

17 స్థానాలకు బరిలో 893 మంది!

(మొదటిపేజీ తరువాయి)

స్థానానికి 23 మంది అభ్యర్థులు 42 సెట్లు వేశారు. చేవెళ్ల 66 మంది (87 సెట్లు), మహబూబ్‌నగర్ 38 మంది (58 సెట్లు), నాగర్‌కర్నూల్ 34 మంది (53 సెట్లు), కరీంనగర్ 53 మంది (94 సెట్లు), పెద్దపల్లి 63 మంది (109 సెట్లు), వరంగల్ 58 మంది (89 సెట్లు), మహబూబాబాద్ 29 మంది (56 సెట్లు), నిజామాబాద్ 42 మంది (90 సెట్లు), నల్లగొండ 57 మంది (114 సెట్లు), భువనగిరి 59 మంది (110 సెట్లు), జహీరాబాద్ 40 మంది (69 సెట్లు), మెదక్ 54 మంది (90 సెట్లు), సికింద్రాబాద్ 57 మంది (75 సెట్లు), హైదరాబాద్ స్థానానికి 57 మంది 85 నామినేషన్ సెట్లు దాఖలు చేసినట్లు అధికారులు వివరించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే నామినేషన్ దాఖలు చేయగా.. గురువారం చాలా చోట్ల ఒకట్రెండు సెట్లు అదనంగా వేశారు. ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ టికెట్ సాధించిన రామసహాయం రఘురాంరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఖమ్మంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ రేణుకా చౌదరి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. కరీంనగర్ బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్ నామినేషన్ వేశారు. ఆయనకు మద్దతుకు భారీ ర్యాలీ నిర్వహించగా.. గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. మాజీ మంత్రి బాబూ మోహన్ వరంగల్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఆరోగ్యం బాగాలేకపోవడంతో వీల్‌ఛైర్‌లోనే రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చారు. ప్రస్తుతం ప్రజాశాంతి పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా ఉన్న ఆయన.. ఆ పార్టీ నుంచే పోటీ చేస్తానని గతంలో ప్రకటించారు. అయితే చివరకు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలవడం గమనార్హం.



ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ధర్మపురి అర్వింద్

ప్రచార రథాలకు గూగుల్ మ్యాపింగ్!

» నిర్ణీత ప్రాంతాల్లో తిరిగేలా సాంకేతికత

» అయినా పరిధులు దాటుతోన్న వైనం

» హైదరాబాద్‌లో పక్కపక్క ప్రాంతాలు వేర్వేరు లోక్‌సభ నియోజక వర్గాల్లో

» అయోమయానికి గురవుతున్న డ్రైవర్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వివిధ పార్టీల ప్రచార రథాలు ఆయా లోక్‌సభ నియోజకవర్గ పరిధి/హద్దులు దాటకుండా ఉండేందుకు అభ్యర్థులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. తమ ప్రచార రథాలకు గూగుల్ మ్యాపింగ్ చేసుకుంటున్నారు. తద్వారా నియోజకవర్గాల హద్దుల విషయంలో గందరగోళం వీడి స్పష్టతతో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. కూకట్‌పల్లి శాసనసభ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏరియా మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం, శేరిలింగంపల్లి పరిధిలోని ప్రాంతం చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం కిందకు వస్తుంది. బోయిన్‌పల్లిలో అంబేడ్కర్ విగ్రహం ఒక వైపు ప్రాంతం సికింద్రాబాద్ లోక్‌సభ, మరోవైపు ఏరియా మల్కాజ్‌గిరి లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో ఉంటుంది. ఇలా.. పక్కపక్కనే కాలనీలు, బస్తీలు ఉండే మహానగరంలో లోక్‌సభ సెగ్మెంట్ హద్దుల విషయంలో అయోమయం నెలకొంది. అయితే, సమగ్ర పరిశీలన అనంతరం అభ్యర్థులు, ఓటర్లు ఓ అవగాహనకు వస్తున్నా.. ప్రచార రథాల ప్రచారం మాత్రం దారి తప్పుతోంది. ఈ ఇబ్బందులకు చెక్ పెట్టేలా పలువురు అభ్యర్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ఏ ప్రచార రథం ఎక్కడ పర్యటించాలనేది గూగుల్ మ్యాపింగ్ చేసుకుంటున్నారు. దీంతో ప్రచార రథాలు ఇతర నియోజకవర్గాలకు వెళ్లకుండా నియంత్రించడంతోపాటు.. సొంత నియోజకవర్గంలోనే ఓ ప్రచారం రథం తిరిగిన చోట మరొకటి తిరగకుండా ఉంటుందన్నది వారి ఆలోచన. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కవరయ్యేలా గూగుల్ మ్యాపింగ్ చేసినట్టు చేవెళ్ల అభ్యర్థి ఒకరు తెలిపారు. రెండు, మూడు రోజులకో మారు ప్రతి ప్రాంతంలో పర్యటించేలా వాహనాల వారీగా మ్యాపింగ్ చేశామని చెప్పారు.



అయినా పరిధి దాటి ప్రచారం...

గూగుల్ మ్యాప్ ఆధారంగా వెళ్లడంతో కొందరు డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గాల పరిధిని వారు దాటిపోతున్నారు. ప్రధాన పార్టీకి చెందిన చేవెళ్ల అభ్యర్థి ఒకరి వాహనం ఇటీవల మల్కాజ్‌గిరి పరిధిలో పర్యటించింది. మల్కాజ్‌గిరి అభ్యర్థి ప్రచార రథం ఒకటి సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రాంతంలో తిరిగింది. దీంతో స్థానిక ఓటర్లు అయోమయానికి గురయ్యారు. మన అభ్యర్థి ఎవరు? ఈయన వాహనం ఎందుకు ఇక్కడ తిరుగుతోంది? అని కొందరు చర్చించుకోవడం కనిపించింది. గూగుల్ మ్యాపింగ్ ఆధారంగానే వెళ్తున్నామని డ్రైవర్లు చెబుతున్నా.. నియోజకవర్గాల పరిధి దాటుతుండడం గమనార్హం. మ్యాపింగ్‌లో లోపమా..? లేక డ్రైవర్లకు అవగాహన లేకపోవడం కారణమా..? అన్నది బాధ్యులు మరోసారి పరిశీలించుకోవాల్సిన అవసరముంది.

ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే

నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది! బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరో లెక్క తేలింది! రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తరఫున బరిలో ఉన్న అభ్యర్థులు వీరే!

నియోజకవర్గం	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
1. ఆదిలాబాద్ (ఎస్టీ)	ఆత్రం సుగుణ	జి.నగేష్	ఆత్రం సక్కు
2. పెద్దపల్లి (ఎస్సీ)	గడ్డం వంశీకృష్ణ	గోమాస శ్రీనివాస్	కొప్పుల ఈశ్వర్
3. కరీంనగర్	వెలిచాల రాజేందర్‌రావు	బండిసంజయ్	బి.వినోద్ కుమార్
4. నిజామాబాద్	టి.జీవన్ రెడ్డి	ధర్మపురి అరవింద్	బాజిరెడ్డి గోవర్ధన్
5. జహీరాబాద్	సురేష్ షెట్కార్	బీబీ పాటిల్	గాలి అనీల్ కుమార్
6. మెదక్	నీలం మధు	రఘునందన్‌రావు	పి. వెంకటరామిరెడ్డి
7. మల్కాజ్‌గిరి	సునీత మహేందర్ రెడ్డి	ఈటల రాజేందర్	రాగిడి లక్ష్మా రెడ్డి
8. సికింద్రాబాద్	దానం నాగేందర్	జి.కిషన్ రెడ్డి	పద్మారావు గౌడ్
9. హైదరాబాద్	ఎండీ వలీయుల్లా సమీర్	మాధవీ లత	గడ్డం శ్రీనివాస్ యాదవ్
10. చేవెళ్ల	జి.రంజిత్ రెడ్డి	కొండా విశ్వేశ్వర్ రెడ్డి	కాసాని జ్ఞానేశ్వర్
11. మహబూబ్‌నగర్	వంశీ చంద్ రెడ్డి	డీకే అరుణ	మన్నె శ్రీనివాస్ రెడ్డి
12. నాగర్‌కర్నూల్ (ఎస్సీ)	మల్లు రవి	పి. భరత్	ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
13. నల్గొండ	రఘువీర్ కుందూరు	సైది రెడ్డి	కంచర్ల కృష్ణా రెడ్డి
14. భువనగిరి	చామల కిరణ్ కుమార్‌రెడ్డి	బూర నరసయ్య గౌడ్	క్యామ మల్లేష్
15. వరంగల్(ఎస్సీ)	డాక్టర్ కడియం కావ్య	ఆరూరి రమేష్	డాక్టర్ సుధీర్ కుమార్
16. మహబూబాబాద్(ఎస్టీ)	బలరాం నాయక్	అజ్మీర సీతారామ్ నాయక్	మాలోతు కవిత
17. ఖమ్మం	రామసహాయం రఘురామ్‌రెడ్డి	తాండ్ర వినోద్ రావు	నామా నాగేశ్వరరావు


అనర్హత పిటిషన్లు స్పీకర్‌కు అందాయా?

» తెలుసుకొని చెప్పండి

» ఏజీకి హైకోర్టు సూచన

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తులు స్పీకర్ కార్యాలయానికి అందినవీ, లేనిదీ తెలుసుకొని చెప్పాలని అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డిని హైకోర్టు సూచించింది. ఈ దరఖాస్తులను స్వీకరించి, రసీదులు ఇవ్వాలని ప్రభుత్వ న్యాయవాదులను ఆదేశించింది. పార్టీ ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్‌ను అనర్హులుగా ప్రకటించేలా స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ చేపట్టిన జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం గురువారం ఈ ఆదేశాలు ఇచ్చింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.


The Mark of Achievement
SR Shines Again!
Sterling Performance in JEE MAIN 2024
YEARS OF BRILLIANCE 50
ALL INDIA RANK 5 G.NAVEEN APP. 240310345924 (R)
ALL INDIA RANK 12 A.NANDINI APP. 240310111980 (R)
ALL INDIA RANK 42 Y.SATHWIK REDDY APP. 240310688822 (R)
ALL INDIA RANK 55 G.KALU APP. 240310398144 (R)
ALL INDIA RANK 126 D.MANISH APP. 240310469723
ALL INDIA RANK 131 D.KARTHIK APP. 240310408808 (R)
ALL INDIA RANK 144 J.SHRETHAN REDDY APP. 240310686945 (R)
ALL INDIA RANK 148 K.PRASHANTH REDDY APP. 240310439090 (R)
ALL INDIA RANK 149 T.TEJASWI APP. 240310484777 (R)
ALL INDIA RANK 154 K.AKHIL YADAV APP. 240310604565 (R)
ALL INDIA RANK 186 P.NIHAL SREEVATHSAV APP. 240310642019 (R)
ALL INDIA RANK 192 K.SREERAM REDDY APP. 240310166922 (R)
ALL INDIA RANK 201 T.AMRUTHA VARSHINI APP. 240310017984 (R)
ALL INDIA RANK 211 K.RAMANA REDDY APP. 240311169525 (R)
ALL INDIA RANK 225 T.SRESHTA APP. 240310251866 (R)
ALL INDIA RANK 314 P.RITHVIK APP. 240310550132 (R)
ALL INDIA RANK 357 R.DEEPANSH REDDY APP. 240310166542
ALL INDIA RANK 385 G.NAVEEN KRISHNA SAI APP. 240310308078 (R)
ALL INDIA RANK 430 Md.TAYYAB APP. 240310214498 (R)
ALL INDIA RANK 431 K.SIDDARTHA APP. 240310562983 (R)
ALL INDIA RANK 433 B.ABHISHEK RATHOD APP. 240310361365 (R)
ALL INDIA RANK 497 G.UDAY APP. 240310340124 (R)
ALL INDIA RANK 530 M.SRINU APP. 240310411282 (R)
ALL INDIA RANK 550 B.BHAVITHA APP. 240310684585 (R)
ALL INDIA RANK 599 S.BHANU PRASAD APP. 240310517138 (R)
ALL INDIA RANK 614 D.PRAGNA TEJA APP. 240310126395 (R)
ALL INDIA RANK 625 L.RAMYA LEELA PAVANI APP. 240310598220 (R)
ALL INDIA RANK 662 G.BHAGAVANDAS APP. 240310452162 (R)
ALL INDIA RANK 730 P.MARUTHI APP. 240310415884 (R)
ALL INDIA RANK 782 J.SHRESTITHA APP. 240310460489 (R)
ALL INDIA RANK 783 T.TEJESH APP. 240310441887 (R)
ALL INDIA RANK 788 DANISH FATIMA APP. 240310281113 (R)
ALL INDIA RANK 880 V.PRATHEEK APP. 240310509541 (R)
ALL INDIA RANK 861 B.ANAND SAI APP. 240310360916 (R)
ALL INDIA RANK 870 M.ABHIGNAN APP. 240310483312 (R)
ALL INDIA RANK 872 P.MEGHANA APP. 240310194592 (R)
ALL INDIA RANK 944 D.VARSHITH APP. 240310463538 (R)
ALL INDIA RANK 948 N.MAHENDRA BABU APP. 240310449409 (R)
ALL INDIA RANK 986 Y.HARSHITH APP. 240310189007 (R)
LONG TERM (JEE-MAIN/ADVANCED) ADMISSIONS ARE IN PROGRESS 2024-25
3256 STUDENTS SELECTED FOR JEE-Advanced 2024
SR Educational Academy
TELANGANA ● ANDHRA PRADESH ● KARNATAKA
HYDERABAD: 8886322296, 9121307474, 9290684090, 8712612424, 8712612422, 8712604778, 8712612435, 8712612425, 8712612433 | WARANGAL: 9642117378 | VIJAYAWADA: 8142111302 | VIZAG: 9052222274, 9154854707 | GUNTUR: 9154854694 | TIRUPATI: 9154854699 | NELLORE: 9154854696 | ANANTHAPURM: 9154854691 | KURNOOL: 9154854695
NIZAMABAD: 9642117110 | SRIKAKULAM: 9154854697 | BHIMAVARAM: 9642223762, 7331122579 | RAJAHMUNDRY: 9154854693 | KARIMNAGAR: 9642117335 | NALGONDA: 9573927070 | ONGOLE: 8712609156 | KHAMMAM: 9121155002 | ADILABAD: 9154854690 | KOTHAGUDEM: 9154854692 | NIRMAL: 9642117835 | HOSAPETE: 9154854713.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 26 ఏప్రిల్ 2024



ఇఫ్లూలో
పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. హైదరాబాద్ సహా షిల్లాంగ్, లఖ్‌నవూ క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్‌లో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి. పీజీ డిప్లొమా కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఇఫ్లూ దూరవిద్య విధానంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ కోర్సును కూడా అందిస్తోంది.

పీజీ డిప్లొమా ఇన్ టీచింగ్ ఆఫ్ ఇంగ్లీష్: హైదరాబాద్ క్యాంపస్‌లో 40, లఖ్‌నవూ క్యాంపస్‌లో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ(ఇంగ్లీష్/ఇంగ్లీష్ లిటరేచర్/లింగ్విస్టిక్స్/టీఈఎస్ఎల్/ఈఎల్‌టీ) ఉత్తీర్ణులై ఉండాలి.

పీజీ డిప్లొమా ఇన్ టీచింగ్ ఆఫ్ అరబిక్: హైదరాబాద్ క్యాంపస్‌లో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ(అరబిక్/అరబిక్ లిటరేచర్/లింగ్విస్టిక్స్/టీచింగ్ ఆఫ్ అరబిక్) పూర్తిచేసి ఉండాలి.

పీజీ డిప్లొమా ఇన్ ట్రాన్స్‌లేషన్: హైదరాబాద్ క్యాంపస్‌లో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ(ఇంగ్లీష్) ఉత్తీర్ణతతోపాటు ఏదేని ఇండియన్/ఫారిన్ లాంగ్వేజ్ చదవడం, రాయడంలో ప్రావీణ్యం ఉండాలి.

పీజీ డిప్లొమా ఎంట్రెన్స్ టెస్ట్: పరీక్ష సమయం రెండు గంటలు. మొత్తం మార్కులు 100. పీజీ డిప్లొమా ఇన్ టీచింగ్ అరబిక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో అరబిక్ లాంగ్వేజ్‌కు సంబంధించి 75, సబ్జెక్ట్ స్పెసిఫిక్ నాలెడ్జ్‌కు సంబంధించి 25 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పీజీడీటీఈ, పీజీడీటీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే టెస్ట్‌లో ఇంగ్లీష్ లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ నుంచి 50, సబ్జెక్ట్-స్పెసిఫిక్ నాలెడ్జ్ నుంచి 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు.

పీజీ డిప్లొమా స్కాలర్‌షిప్‌లు: కుటుంబ వార్షికాదాయం రూ.1,50,000లు మించనివారికి మెరిట్ కం మీన్స్ ఫెలోషిప్ కింద ట్యూషన్ ఫీజు మినహాయిస్తారు. బుక్ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1000లు ఇస్తారు. సోషల్ వెల్ఫేర్ సంస్థలు/రాష్ట్ర ప్రభుత్వాలు/ మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్/యూజీసీ నుంచి ప్రతినెలా రూ. 1000లకు పైగా స్కాలర్‌షిప్ పొందుతున్న అభ్యర్థులకు ఇవి వర్తించవు. ఈ మొత్తం రూ. 1000 కన్నా తక్కువగా ఉంటే మిగిలినదాన్ని ఇఫ్లూ ఇస్తుంది.

పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ టీచింగ్ ఆఫ్ ఇంగ్లీష్: ఈ డిస్టెన్స్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. అడ్మిషన్ టెస్ట్, వయోపరిమితి నిబంధనలు లేవు.

అర్హత: ఎంఏ(ఇంగ్లీష్/లింగ్విస్టిక్స్/ఎడ్యుకేషన్/మాస్ కమ్యూనికేషన్/సైకాలజీ/క్రిటికల్ హ్యూమానిటీస్/లిబరల్ ఆర్ట్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు ఫీజు+ప్రోగ్రామ్ ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.6,820; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,070; దివ్యాంగులకు రూ.1,320

పీహెచ్‌డీ: విభాగాలు-సీట్లు: ఇంగ్లీష్ లిటరేచర్ 7, కంపారేటివ్ లిటరేచర్ 3, ఇండియన్ అండ్ వరల్డ్ లిటరేచర్స్ 6, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 3, హిందీ 5, ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఎడ్యుకేషన్ 16, ఎడ్యుకేషన్ 1, లింగ్విస్టిక్స్ అండ్ ఫొనెటిక్స్ 18, ఈస్థటిక్స్ అండ్ ఫిలాసఫీ 1, కల్చరల్ స్టడీస్ 8, ఫిల్మ్ స్టడీస్ అండ్ విజువల్ కల్చర్ 6, మీడియా అండ్ కమ్యూనికేషన్ 18, ఫ్రెంచ్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 8, రష్యన్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 5, జర్మన్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 3, స్పానిష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 4, అరబిక్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 9 సీట్లు ఉన్నాయి.

అర్హత: విభాగాన్ని అనుసరించి (ఎంఏ/ఎంఫిల్)(ఇంగ్లీష్/కంపారేటివ్ లిటరేచర్/ట్రాన్స్‌లేషన్ స్టడీస్/హిందీ/టీఈఎస్ఎల్/ ఈఎల్‌టీ/ఎడ్యుకేషన్/కల్చరల్ స్టడీస్/ఫిల్మ్ స్టడీస్/కమ్యూనికేషన్/ఈస్థటిక్స్/ఫిలాసఫీ/విజువల్ ఆర్ట్స్/కల్చర్/లీగల్ స్టడీస్/ఆంత్రోపాలజీ/హిస్టరీ/పొలిటికల్ సైన్స్/సోషియాలజీ/సోషల్ వర్క్/మీడియా స్టడీస్/జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్/ లింగ్విస్టిక్స్/ఫొనెటిక్స్/అప్లయిడ్ లింగ్విస్టిక్స్/ఫ్రెంచ్/రష్యన్/జర్మన్/స్పానిష్/ అరబిక్) లేదా ఎంఫిల్ ఇంగ్లీష్(కామన్వెల్త్ లిటరేచర్/ఇంగ్లీష్ లిటరేచర్/ కంపారేటివ్ లిటరేచర్) ఉత్తీర్ణులై ఉండాలి.

- యూజీసీ(నెట్/జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్) అర్హత ఉన్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. వీరిని నేరుగా ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూకి 30 మార్కులు కేటాయించారు. ఇందులో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- **ఎంట్రెన్స్ టెస్ట్:** పరీక్ష సమయం రెండు గంటలు. సంబంధిత సబ్జెక్ట్, రీసెర్చ్ మెథడాలజీల నుంచి ఒక్కోదానిలో 35 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 70.
- **ఫెలోషిప్:** నెట్ అర్హత లేని వారికి నెలకు రూ.8000ల ఫెలోషిప్‌తోపాటు కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.8000 ఇస్తారు. జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి నెలకు రూ.31000ల ఫెలోషిప్, రూ.7440ల హెచ్ఆర్ఏ, ఏడాదికి రూ.10000ల కంటింజెన్సీ గ్రాంట్ ఇస్తారు. ఎస్ఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి నెలకు రూ.35,000ల ఫెలోషిప్, రూ.8400ల హెచ్ఆర్ఏ, ఏడాదికి రూ.20,500ల కంటింజెన్సీ గ్రాంట్ ఇస్తారు.

ముఖ్య సమాచారం
- **ఎంట్రెన్స్ టెస్ట్ ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** పీజీసీటీఈకి మే 10; పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు మే 8.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 8
- **వెబ్‌సైట్:** efluniversity.ac.in

ఐఐఎఫ్‌టీ
ఆన్‌లైన్‌లో ఎంబీఏ(ఐబీ)

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) - ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్) ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఆన్‌లైన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. దీని వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ స్ట్రాటజీ, ట్రేడ్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. రెండో ఏడాది ఫైనాన్స్, ట్రేడ్, మార్కెటింగ్, స్ట్రాటజీ, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవాలి. ప్రోగ్రామ్‌లో భాగంగా వర్చువల్ సెషన్స్ ఉంటాయి. ప్రముఖ పారిశ్రామిక నిపుణులు గెస్ట్ లెక్చర్స్ ఇస్తారు. కేస్ స్టడీస్, ప్రాబ్లం సాల్వింగ్ విధానాలపై బృంద చర్చలు ఉంటాయి. వారాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్ సెషన్స్ నిర్వహిస్తారు.


అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.



ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.3,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

ఐఎల్‌బీఎస్‌లో అకడమిక్ ప్రోగ్రామ్‌లు

న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ & బైలరీ సైన్సెస్(ఐఎల్‌బీఎస్) - వివిధ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. పీహెచ్‌డీ, పీడీసీసీ, పీజీసీసీ, సర్టిఫికెట్ కోర్సులు సహా ఫెలోషిప్ ప్రవేశాలు నిర్వహించనున్నారు. ఆల్ ఇండియా ఎంట్రెన్స్ టెస్ట్, డిపార్ట్‌మెంటల్ అసెస్‌మెంట్/ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పీహెచ్‌డీ వ్యవధి 3 నుంచి 5 సంవత్సరాలు. పోస్ట్ డాక్టోరల్ సర్టిఫికెట్ కోర్సులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు, ఫెలోషిప్‌ల వ్యవధి ఏడాది. కొన్ని పీజీసీసీ కోర్సులు, ఇతర సర్టిఫికెట్ కోర్సుల వ్యవధి ఆర్నెల్లు.



సీట్లు: అన్ని కోర్సుల్లో కలిపి మొత్తం సీట్లు 91. పీహెచ్‌డీ కోర్సులో 13 సీట్లు ఉన్నాయి. వీటిలో మాలిక్యులార్ అండ్ సెల్యులార్ మెడిసిన్‌లో 4, హెపటాలజీలో 2, క్లినికల్ న్యూట్రిషన్‌లో 1, వైరాలజీలో 1, నర్సింగ్‌లో 5 సీట్లు ఉన్నాయి. పీడీసీసీ కోర్సులో 47 సీట్లు ఉన్నాయి. వీటిలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ అనెస్థీషియా 3, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ 3, హెపటోపాథాలజీ 3, నెఫ్రాలజీ 3, ట్రాన్స్‌ప్లాంట్ వైరాలజీ 3, డయాగ్నస్టిక్ వైరాలజీ 1, క్రిటికల్ కేర్ మెడిసిన్ 3, జీఐ మెడికల్ అంకాలజీ 3, హెచ్‌పీబీ అండ్ జీఐ అడ్వాన్స్‌డ్ రేడియేషన్ అంకాలజీ 3, గ్యాస్ట్రో రేడియాలజీ 3, బ్లడ్ బ్యాంకింగ్ అండ్ ఇమ్యూనోహెమటాలజీ 3, అడ్వాన్స్‌డ్ డయాగ్నస్టిక్ అండ్ క్లినికల్ మైక్రోబయాలజీ 3, అఫెరిసిస్ టెక్నాలజీ అండ్ బ్లడ్ కాంపొనెంట్ థెరపీ 3, సెల్యులార్ ట్రాన్స్‌ప్లాంట్ ఇమ్యూనాలజీ 1, హెపటాలజీ 4, అడ్వాన్స్‌డ్ క్లినికల్ బయోకెమిస్ట్రీ 2, హెపటో-హెమటాలజీ 1, పల్మనరీ-క్రిటికల్ కేర్-స్లీప్ మెడిసిన్ 2 సీట్లు ఉన్నాయి. పీజీసీసీ కోర్సులో 17 సీట్లు ఉన్నాయి. వీటిలో క్లినికల్ న్యూట్రిషన్ 2, ఎపిడిమియాలజీ ఆఫ్ వైరల్ హెపటైటిస్ అండ్ లివర్ డిసీజెస్ 1, క్లినికల్ రీసెర్చ్ ఇన్ లివర్ డిసీజెస్ 2, క్లినికల్ బయో ఇన్ఫర్మాటిక్స్ 10, డయాలిసిస్ థెరపీ 2 సీట్లున్నాయి. అడ్వాన్స్‌డ్ హెపటాలజీలో 2 ఫెలోషిప్‌లు ఉన్నాయి. సర్టిఫికెట్ కోర్సుల్లో క్రిటికల్ కేర్ 2, బయోస్టాటిక్స్ 10 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: పీహెచ్‌డీ కోర్సుకు ప్రథమ శ్రేణి మార్కులతో ఎంబీబీఎస్/మాస్టర్స్ డిగ్రీ(మెడికల్/డెంటల్ సైన్సెస్)/ఎంటెక్/ఎంఫార్మసీ/ఎంవీఎస్సీ/ఎమ్మెస్సీ నర్సింగ్/ఎంఫిల్ నర్సింగ్/మాస్టర్స్ డిగ్రీ(బయోలాజికల్ సైన్సెస్-(బయో కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/జువాలజీ/మైక్రోబయాలజీ)) ఉత్తీర్ణులై ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ నెట్ జేఆర్ఎఫ్, డీబీటీ జేఆర్ఎఫ్, ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్ ఉన్న అభ్యర్థులు ఎంట్రెన్స్ ఎగ్జామ్ రాయనవసరం లేదు. వీరిని నేరుగా ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. పీడీసీసీ కోర్సుకు సంబంధిత విభాగంలో ఎండీ/డీఎన్‌బీ ఉత్తీర్ణులై ఉండాలి. పీజీసీసీ కోర్సుకు విభాగాన్ని అనుసరించి ఎమ్మెస్సీ/ఎంబీబీఎస్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీడీఎస్/ఎమ్మెస్సీ-లైఫ్ సైన్సెస్/ఎమ్మెస్సీ-స్టాటిస్టిక్స్/బీఎస్సీ-నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. సర్టిఫికెట్ కోర్సులకు ఎంబీబీఎస్/పీజీ(సైన్స్/ఎకనామిక్స్/సోషియాలజీ/స్టాటిస్టిక్స్/సైకాలజీ/ఫిజియోథెరపీ); ఫెలోషిప్‌లకు డీఎం/డీఎన్‌బీ(గ్యాస్ట్రో ఎంటరాలజీ) పూర్తిచేసి ఉండాలి.

ఎంపిక: పీహెచ్‌డీ కోర్సుకు నిర్వహించే ప్రవేశ పరీక్షలో 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ పీజీ స్థాయిలో ఉంటాయి. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి. అర్హత పొందిన అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో ఎంపిక చేసి ఇంటర్వ్యూ/డిపార్టుమెంటల్ అసెస్‌మెంట్‌కు పంపుతారు. నెట్ అర్హత ఉన్నవారికి వ్యాలిడ్ జేఆర్ఎఫ్‌కు 30 మార్కులు, ఆర్నెల్ల పరిశోధన అనుభవానికి 20 మార్కులు, ప్రజంటేషన్‌కు 10 మార్కులు, ఇంటర్వ్యూకి 40 మార్కులు వెయిటేజీ ఇస్తారు. పీడీసీసీ/పీజీసీసీ/ఫెలోషిప్/సర్టిఫికెట్ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో నిర్దేశిత సబ్జెక్టుల నుంచి నిర్దేశించిన మేరకు ప్రశ్నలు ఇస్తారు. రాత పరీక్ష స్కోర్‌కు 70 శాతం, డిపార్టుమెంటల్ అసెస్‌మెంట్/ఇంటర్వ్యూకి 30 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 12
- **రిటెన్ ఎగ్జామినేషన్:** మే 26
- **డిపార్ట్‌మెంటల్ అసెస్‌మెంట్:** మే 27
- **కోర్సులు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.ilbs.in

జాబ్ కార్నర్

సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (అసిస్టెంట్ కమాండెంట్) ఎగ్జామ్ 2024

మొత్తం ఖాళీలు: 506

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్... సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(అసిస్టెంట్ కమాండెంట్) ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, ఇండో-టిబెటిన్ బోర్డర్ పోలీస్, సశస్త్ర సీమాబల్‌లో అసిస్టెంట్ కమాండెంట్ల(గ్రూప్ ఎ) ఉద్యోగాలు భర్తీ చేస్తారు. అర్హులైన పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

మొత్తం ఖాళీలు: 506(బీఎస్ఎఫ్-186, సీఆర్‌పీఎఫ్-120, సీఐఎస్ఎఫ్-100, ఐటీబీపీ-58, ఎస్ఎస్‌బీ-42)

అర్హత: బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు నిర్దిష్ట శారీరక, వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 20 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(పేపర్-1, పేపర్-2), ఫిజికల్ స్టాండర్డ్స్/ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.200. ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం

దరఖాస్తుకు చివరి తేదీ: మే 14

రాత పరీక్ష తేదీ: ఆగస్టు 4

వెబ్‌సైట్: https://upsc.gov.in/



నేవల్ డాక్‌యార్డ్‌లో అప్రెంటిస్‌లు

మొత్తం ఖాళీలు: 301

భారత నౌకాదళానికి చెందిన ముంబయిలోని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్(నేవీ), నేవల్ డాక్‌యార్డ్ అప్రెంటిస్ స్కూల్... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ఏడాది అప్రెంటిస్‌షిప్ ట్రెయినింగ్: **288 ఖాళీలు**
2. రెండేళ్ల అప్రెంటిస్‌షిప్ ట్రెయినింగ్: **13 ఖాళీలు**

ట్రేడులు: ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రోప్లేటర్, ఫిట్టర్, ఫౌండ్రీమన్, మెకానిక్(డీజిల్), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్, ఎంఎంటీఎం, పెయింటర్(జి), ప్యాటర్న్ మేకర్, పైప్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానిక్ రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ, షీట్ మెటల్ వర్కర్, షిప్‌రైట్(ఉడ్), టైలర్(జి), వెల్డర్(జి అండ్ ఇ), మేసన్(బీసీ), ఐ అండ్ సీటీఎస్ఎం, షిప్ రైట్(స్టీల్), రిగ్గర్, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్.

అర్హత: ఎనిమిది, పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: కనిష్ఠ వయసు 14 ఏళ్లు, గరిష్ఠ వయోపరిమితి లేదు.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ/స్కిల్ టెస్ట్‌లో వచ్చిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 10

వెబ్‌సైట్: https://indiannavy.nic.in/

ఏఆర్ఐలో స్టెనోగ్రాఫర్స్

భారత ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన పుణెలోని మహారాష్ట్ర అసోసియేషన్ ఫర్ ద కల్టివేషన్ ఆఫ్ సైన్స్ - అగార్కర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎంఏసీఎస్-ఏఆర్ఐ)... డైరెక్ట్/డిప్యూటేషన్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ప్రైవేట్ సెక్రటరీ: **2 పోస్టులు**
2. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2: **2 పోస్టులు**

అర్హత: ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణతతో పాటు టైపింగ్ స్పీడ్ ఉండాలి.

జీతం: ప్రైవేట్ సెక్రటరీ పోస్టుకు రూ.44,900 - రూ.1,42,400. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2 పోస్టుకు రూ.25,500 - రూ.81,100.

వయోపరిమితి: స్టెనోగ్రాఫర్ పోస్టుకు 27 ఏళ్లు మించరాదు. ప్రైవేట్ సెక్రటరీ పోస్టుకు 56 ఏళ్లు మించరాదు.

ఎంపిక విధానం: స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తు చివరి తేదీ: మే 6

వెబ్‌సైట్: https://aripune.org/

లిటిల్స్




మీకు తెలుసా?

- పొడవైన తోక, చూడటానికి గంభీరంగా... మెడ కిందిభాగంలో ఎరుపు, తల మీద బంగారు రంగు ఉంటుంది. మెడ చుట్టూ చీరనేసినట్లుండే అందం... మొత్తానికి చూడటానికి ఫస్ట్‌లుక్‌లో నెమలిలా ఉండే ఈ పక్షి పేరు 'గోల్డెన్ పీజంట్'. భూమ్మీద ఉండే అందమైన పక్షుల్లో ఇదొకటి. విచిత్రమేంటంటే ఇవి.. మగ పక్షులు. ఆడపక్షులు నలుపు, బ్రౌన్ కలర్‌లో ఉంటాయి.
- వీటి పుట్టినిల్లు చైనా. కొండప్రాంతాల్లో తిరుగుతుంటాయివి. బరువు 600 గ్రాములు ఉంటాయి. ఇక మగపక్షులు 90 నుంచి 100 సెంటీమీటర్ల పొడవుంటే.. ఆడపక్షులు 70 నుంచి 80 సెం.మీ పొడవు ఉంటాయి.



- ఈ పక్షులు తెలివైనవి. అయితే సహనం కూడా వీటికి ఎక్కువ. అయితే ఒక్కోసారి మగపక్షులకు కోపం ఎక్కువ వస్తుంది. ఎంత అంటే ఆడపక్షులను చంపేస్తాయి. అయితే ఇది చాలా అరుదుగా జరుగుతుంది. ఇవి గాల్లోకి మరీ ఎత్తుకు ఎగరలేవు. అయితే వేగంగా పరిగెత్తగలవు.
- చలి, వేడి ప్రాంతాల్లో కూడా బతకగలవు. వీటిని పెంచుకోవచ్చు కూడా.
- ఈ పక్షుల గుడ్లు బాతు గుడ్లంత ఉంటాయి. మట్టిలో కంటే గడ్డిమీద గుడ్లు పెట్టటానికి ఇష్టపడతాయి. 5 నుంచి 12 గుడ్లు వరకూ పెడతాయి. ఇవి పొదిగే కాలం మూడు వారాలు.

జత లేని బొమ్మ ఏది?




సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



5 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 291

3		4			1			7
	5							
			6					8
6			9			2	7	3
			8		7			
2	1	7			3			5
5					4			
							9	
1			2			4		6

సుడోకు - 290 సమాధానం

6	7	2	9	1	3	4	8	5
8	1	9	4	2	5	7	3	6
3	4	5	6	7	8	9	2	1
9	2	8	5	6	4	1	7	3
7	6	1	8	3	2	5	9	4
5	3	4	7	9	1	2	6	8
1	9	7	3	4	6	8	5	2
2	5	3	1	8	7	6	4	9
4	8	6	2	5	9	3	1	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.